

# చలో ఛత్తీస్‌గఢ్

## దండకారణ్యంలో జర్నలిస్టు అనుభవాలు

**ఎం.ఎం. రహమాన్**
సీనియర్ జర్నలిస్టు

# చలోఛత్తీస్‌గఢ్

రచయిత : **ఎం.ఎం. రహమాన్,** సీనియర్ జర్నలిస్టు

ప్రథమ ముద్రణ : మే, 2010


వెల : రూ. 100/-

ప్రతులు : 2,000
కాపీరైట్స్ © రచయిత
లక్ష్మి పబ్లికేషన్స్

ప్రతులకు :
ఎం.ఎం. రహమాన్
జవహర్ నవోదయ విద్యాలయ
చొప్పదండి
కరీంనగర్ జిల్లా - 505 415
సెల్ నం. 95539 55370, 98483 28698

ముద్రణ :
సాయిలిఖిత ప్రింటర్స్
ఖైరతాబాద్
హైదరాబాద్ - 500 004.

# అంకితం



రెక్కలు ముక్కలు చేసుకుని ఎనిమింది మంది సంతానాన్ని పోషించి, అందరికీ దారి చూపించి ఆత్మగౌరవంతో బతకమని చెప్పిండు. వలసాంధ్రులతో ఆర్డీఎస్ కెనాల్ కింద అనేకసార్లు పోరాటం జరిగినప్పుడు, నాపైన దాడులు జరిగినప్పుడు బాధ పడకుండా న్యాయం కోసం నా కొడుకు కొట్లాడుతున్నడని పదిమందికి చెప్పుకుని సంతోషపడేటోడు. చుండూరు దళితులపై - దాడి ఆందోళన సమయంలో పెత్తందార్లు మాపైన కేసులు బనాయిస్తే కోర్టుకొచ్చి మాకందరికీ జామీన్ ఇచ్చి ఇడిపించిండు. నీతిగ బతకమని న్యాయం కోసం కొట్లాడమని నిరంతరం చెప్పి అడుగడుగున ప్రోత్సహించిన మా అయ్య సుభాహన్‌మియ్యాకు ఈ పుస్తకం అంకితం.

నువ్వు మిగిల్చిన జ్ఞాపకాలతో

నీ నడిపోడు.

# విషయ సూచిక


| | |
|---|---|
| ముందుమాట | 5 |
| సందేశాలు | 8 |
| నామాట | 24 |
| బందూకు బాల్యం | 51 |
| ఎరక్కపోయి, ఎర్రబోరులో ఇరుక్కుపోయి | 53 |
| నక్సలిజం పుట్టిందిలా | 87 |
| చట్టం ఏం చెబుతోంది | 88 |
| రాష్ట్రంలో నిషేధమిలా | 90 |
| నిషిద్ధ సంస్థల వివరాలు | 93 |
| మహేంద్రకర్మతో ఇంటర్వ్యూ | 97 |
| అబూజ్‌మడ్‌కు నా ప్రయాణం | 103 |
| ఏబీఎన్ లాంగ్‌మార్క్ | 107 |
| ఇదే అబూజ్‌మడ్ | 108 |
| జవాన్లూ .. మీరూ మావాళ్లే | 111 |
| ఆకుపచ్చకోనలో అన్నలపాలన, అబూజ్‌మడ్‌లో జనతానా సర్కార్ | 114 |
| "అడవి నుంచి వాళ్లే వెళ్లిపోవాలి." | 117 |
| అడవిలో ఆకలి వేట | 120 |
| ముందుకు సాగని వేట | 123 |
| జనం అసంతృప్తే మావోయిస్టుల బలం | 125 |
| నక్సల్స్ ఎక్కడ విజయం సాధించారంటే | 127 |
| నిపుణుల కమిటీ సిపార్సులు | 130 |
| హింస – ప్రతిహింసలో మృతుల వివరాలు | 134 |
| రచయిత ప్రోఫైల్ | 136 |

# ముందుమాట

ఛత్తీస్ గఢ్.... దేశమంతా ఇప్పుడు ఇటే చూస్తున్నది. శ్రీలంకలో ఎల్.టి.టి.ఇ ఏరివేత అదే తరహాలో మావోయిస్టులను మట్టుబెట్టాలని, ఇక్కడ భారత సర్కార్ కంకణం కట్టుకున్నది.. దానికి కొనసాగింపుగానే వేలకొద్దీ సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లు పారా మిలటరీ బలగాలను అక్కడ మోహరించారు. అంతర్యుద్ధం లాంటి వాతావరణం అలముకొన్న ఈ దండకారణ్యంలో ఏం జరుగుతోందన్న విషయాన్ని ఏ జాతీయ ఛానెల్ కూడా బయటి ప్రపంచానికి చూపించే సాహసం చేయలేదు. ఆదివాసులు, అడవి బిడ్డల్ని అక్కడి వనరుల్ని వశపర్చుకునే క్రమంలో ఎలా పరాధీనుల్ని చేస్తున్నది ఏ పత్రికా రాయలేదు. నోరులేని అడవి బిడ్డలకు అండగా నిలిచినందుకు, హక్కుల గురించి మాట్లాడినందుకు ఎందరో ప్రజాస్వామ్యవాదుల్ని ఎలా నిర్భంధించిందీ ఎప్పుడూ తెలుగు మీడియా చర్చించలేదు. పేరున్న ఏ జర్నలిస్ట్ కూడా అబూజ్ మడ్‌కు చేరుకోలేదు. అసలు అబూజ్ అంటే తెలియదు అని అర్థం. మాడ్ అంటే అడవి! ఆ తెలియని అడవుల్లోకి గూగుల్ కంటికి చిక్కని ఈ ప్రాంతంలోకి మన తెలుగు జర్నలిస్టు కాలు మోపటం ఓ సాహసం.

ఒక అంశాన్ని బ్రేక్ చేస్తే, అదే దారిలో తెలుగు మీడియా పరిగెత్తడం పరిపాటి కానీ అబూజ్ మడ్ అడవులకు అక్కడి దృశ్యాలను, సజీవ చిత్రాలను మోసుకొచ్చింది రహమాన్ మాత్రమే. టి.వి5లో పక్షం రోజుల పాటు, ఆపరేషన్ అబూజ్ మడ్ పేర ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రసారమైన వరుస కథనాలు, అలాగే ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వారం రోజుల పాటు వరుసగా ప్రచురితమైనమై విశేషాలు బయటి ప్రపంచానికి గ్రీన్ హంట్ సన్నాహాలకు, అబూజ్ మడ్ అడవుల్లో జరుగుతున్న వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టాయి.

ఆంధ్రప్రదేశ్, చత్తీస్ గఢ్ సరిహద్దు రెండు రాష్ట్రాల సరిహద్దుగా గాక రెండు దేశాల సరిహద్దులా మారింది. అక్కడ సొంత పాలకుల నిర్లక్ష్యానికి గురౌతున్న వారు, సొంత రక్షణ దళాల చేతిలో బందీలుగా బతుకుతున్నారు. శరణార్థుల శిబిరాల్లో బిక్కు బిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. అమ్మ కడుపులో ఉన్నంత ఆనందంగా ఆ అడవిలో తరతరాలుగా బతుకుతున్న ఆదివాసుల బతుకు, భవిష్యత్ నిలువునా శిథిలమైపోతున్నాయి.

ప్రధానంగా తెలంగాణాను ఆవరించి పారే గోదావరికి అవతలి ఒడ్డున ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోని కోయలు, గొత్తి కోయలు నివసించే ప్రాంతమంతా ఇప్పుడు యుద్ధ భూమిగా మారింది. గోదావరి అలలు మోసుకొచ్చిన విప్లవ బీజాలు మొలకెత్తి శాఖోపశాఖలుగా విస్తరించి ఆదివాసులకు ఆలనై, ఆలంబనై ఉంటున్న దశలో గడిచిన దశాబ్ద కాలంగా అక్కడ రాజ్యం ఉక్కుపాదం మోపింది. ఆ అడవుల అడుగుల్లో వున్న వేలకోట్ల విలువ చేసే ఖనిజాలు శిలా లోహ సంపద కోసం దేశవిదేశీ దళారులు, వ్యాపారులు అక్కడ వాలారు. వారిని అడ్డుకుంటున్న స్థానిక ఆదివాసులను తరిమేయడానికి ఆపరేషన్లు చేస్తూ నాటి పీపుల్స్ వార్, నేటి మావోయిస్టు పార్టీకి పెట్టని కోటగా ఉంటూ వస్తున్న దండకారణ్యంలో సాగిన దమనకాండ అంతా ఇంతా కాదు. ఆదివాసులనే అడవికి దూరం చేసి వారి ఆస్తులనీ, గొడ్డూ గోదనీ, వారి ఇళ్లనూ బుగ్గిపాలు చేశారు. మహిళలపై సామూహిక అత్యాచారాలు చేశారు. గడిచిన పదేళ్లలో గొత్తికోయ ఆదివాసుల్ని జంతువుల్లా వేటాడి చంపడం గురించి అపప్పుడప్పుడు పేపర్లలో చదువుతున్నాం, టెలివిజన్‌లో తరచుగా... ఇటువంటి సంఘటనా ... దృశ్యాలను చూస్తున్నం. ఇప్పుడైతే ఏకంగా అబూజ్‌మడ్‌గా పిలవబడుతున్న దండకారణ్యాన్ని భారత సాయుధ బలగాలు, పోలీసులు చుట్టుముట్టాయన్న వార్తలు వస్తున్నాయి. ఆ ప్రాంతమంతా మందుపాతరలు మళ్ళీ మారుమోగుతున్నాయి. ఇప్పుడు యుద్ధభూమిని తలపిస్తుంది. ఈ నేపథ్యంలో మిత్రుడు రహమాన్ "చలో ఛత్తీస్ గఢ్" అనే పిలుపునీయడం అభినందనీయం.

అసలు ఛత్తీస్ గఢ్ ఎందుకు వెళ్లాలి? చత్తీస్‌గఢ్‌లో ఏం జరుగుతోంది. అడవిలో అగ్గిమంట రాజేయడంలో ఎవరి పాత్ర ఎంత? నక్సలైట్ల ఏరివేత పేరుతో ఆదివాసుల్ని ఊచకోత కోసి మన ప్రభుత్వాలు ఏం సాధించదలచుకున్నాయి? ఈ ప్రశ్నలకు ఈ పుస్తకంలో సమాధానాలు దొరుకుతాయి.


తామర తంపర్లుగా టెలివిజన్ చానళ్లు విస్తరిస్తున్న ఈ కాలంలో తెలుగు వార్తలకు విలువ లేకుండా పోయింది. మరీ ముఖ్యంగా వార్తా రచన అనేది దాదాపు కనుమరుగైయిపోయింది. పాత్రికేయులు కూడా వార్తలు వండడం, వినసొంపుగా వడ్డించడానికే పరిమితమై రాయడం మర్చిపోతున్న కాలం ఇది. మరీ ముఖ్యంగా మన టెలివిజన్ ఛానళ్లలో సౌండ్‌బైట్ తప్ప వార్తలే లేని పరిస్థితిల్లో రెహమాన్ ఈ పనికి పూనుకోవడం, ఆయన పని చేసిన టివి ఛానళ్లలో రిపోర్టు చేసిన అంశాలు పుస్తక

రూపంలోకి తీసుకురావడం అభినందనీయం. సాధారణంగా జర్నలిస్టులు రిపోర్టు చేయడంతోనే తమ బాధ్యత తీరిపోయిందని అనుకుంటారు. కానీ రహమాన్ అలా కాకుండా ఆ వార్తల వెనుక ఉన్న విషయాలను, విశేషాలను, వివాదాలను, వాస్తవాలను, ఆ వార్తల సేకరణ సందర్భంగా తను అనుభవించిన బాధ, దుఃఖం, ఉద్వేగాన్ని కొంతైనా మనతో పంచుకున్నారు. తెలుగు వార్తా రచనలో వాటిపై వివరణాత్మక విశ్లేషణలు ఉండే ఇటువంటి పుస్తకాలు చాలా అరుదు. అలాంటి వార్తలకు గుర్తింపు కూడా తక్కువే. అధికార, రాజకీయ వార్తలకే తప్ప అణగారిన బతుకులకు విలువనివ్వని ఈ కాలంలో ఓ టెలివిజన్ జర్నలిస్టు 20 రోజుల పాటు సల్వాజుడుం, అడవిలో యుద్ధం, బందూకు బాల్యం, దండకారణ్యం, ఒరిస్సా యుద్ధతంత్రం, ఆదిమానవుడు తదితర బ్యాంగులతో వరుస కథనాలను తెరకెక్కించడానికి తుపాకుల మధ్య తిరిగడం ఖచ్చితంగా సాహసమే అవుతుంది. పిఆర్‌పి రేటింగ్‌లే వార్తల ప్రామాణికతను నిర్ధారిస్తున్న ఈ కాలంలో రెహమాన్ సాహసాన్ని ఎవరు గుర్తించినా, గుర్తించకపోయినా ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ ఇంటర్నేషనల్ కమిటీ రెడ్‌క్రాస్, ప్రెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సాయుధ పోరు, వార్ జోన్ రిపోర్టింగ్‌లో దేశంలో ముగ్గురు అత్యుత్తమ జర్నలిస్టులలో రెహమాన్‌ను ఎంపిక చేయడం ముదావహం.

తెలుగు మీడియా విస్తరిస్తూ వస్తున్న క్రమంలో వార్తల ప్రాధాన్యం మారిపోయింది. పాలకుల పాదయాత్రల్ని, పదయాత్రలుగా నెలల కొద్దీ కీర్తించే మాడియా సామాన్యుడి ఆకలి కేకల్ని వినడానికి నిరాకరిస్తోంది. ఖచ్చితంగా ఈ నేపథ్యంలో మానవీయ కథనాలే నిజమైన వార్తలు అవుతాయి. ఈ పుస్తకంలో కేవలం ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టులకు, సల్వాజుడుంకు లేదా పోలీసు భద్రతా దళాలకు జరుగుతున్న యుద్ధ రిపోర్టుగా మాత్రమే కాకుండా అనేక లోతైన విషయాలు ఉన్నాయి. తెలంగాణా ప్రజలకు ముఖ్యంగా నక్సలైట్ల ప్రభావం ఉన్న ప్రాంతాలలో చాలా కాలంగా వినబడుతున్న విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. కోయలు, గొత్తి కోయల వైరుధ్యం, సాంస్కృతిక జీవనం, ఆ ప్రాంత నైసర్గిక పరిస్థితులను భౌగోళిక స్వరూపాన్ని పరిచయం చేస్తూనే.. దండకారణ్యంలో కొనసాగుతున్న హింసా, ప్రతిహింసలను రెండు ఆధిపత్య వర్గాల వాదోపవాదాలను సమగ్రంగా ఆవిష్కరించే ప్రయత్నం ఈ పుస్తకంలో జరిగింది. పైకి యాత్రా రచనగా కనిపించే ఈ పుస్తకం ఒక పోరాటానికి, ఆ పోరాటం వెనుక ఉన్న సామాజిక వైరుధ్యాలకు, వాస్తవికతకు అద్దం పడుతుంది. ఇది ప్రజలను ఆలోచింప చేస్తుందని ఆశిస్తున్నాను.

**– ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి**

# సందేశం



ఈ సమాజంలో మన చుట్టూ ఎన్నో చీకటి కోణాలు... కదిలిస్తే జాలువారే కన్నీటి గాథలు... వీటిని వెలుగులోకి తీసుకురావడానికి టీవీ5 చేసిన ఓ ప్రయత్నమే ఈ పుస్తక రచనకు ప్రేరణగా నిలిచింది.

అడవి బిడ్డల కన్నీళ్ళు, కష్టనష్టాల వాస్తవ చిత్రాలు, మానవీయ కథనాలను ఇటీవలి కాలంలో పలు మీడియా సంస్థలు ఆవిష్కరించాయి. ఈ అడవి పుత్రుల ఆరాటాలు, పోరాటాల గురించి తెలుసుకోవడానికి టీవీ5 ప్రత్యేక ప్రతినిధిగా రహమాన్‌ను ఛత్తీస్‌గఢ్ అడవులకు పంపించింది. దట్టమైన ఆ అడవుల్లో అడుగుపెట్టినప్పటి నుంచీ ఎదురైన అనుభవాలను, సేకరించిన సమాచారాన్ని టీవీ5 ఎప్పటికప్పుడు ప్రసారం చేసింది.

ఈ ప్రసారాలకు ప్రేక్షకులనుంచి కూడా విశేషాదరణ లభించింది. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో సాగిన సాహసయాత్రకు రచయిత రహమాన్ అక్షర రూపం కల్పించి 'ఛలో ఛత్తీస్‌గఢ్' అన్న శీర్షికతో ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఎన్నో అనుభవాలు, మరెన్నో వాస్తవ చిత్రాలను ఇందులో పొందుపరిచారు. ఛత్తీస్‌గఢ్‌లో అసలేం జరుగుతోందో తెలుసుకోవాలనుకునేవారు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం ఇది.

అనేక కష్టనష్టాలకోర్చి ఈ పుస్తకాన్ని సిద్ధం చేసిన రహమాన్ అభినందనీయుడు. సమాజ సేవలో సాహసాలకు వెనకడుగువేయని టీవీ5, ఈ రచయితకు శుభాశీస్సులు అందజేస్తున్నది.

***బి. ఆర్. నాయుడు***

చైర్మన్ – టీవీ 5

# ప్రజాగ్రహం ముందు ఏ సైన్యమూ నిలువలేదు



కొన్ని వందల కోట్ల సంవత్సరాల క్రితం సూర్యుని నుండి విడిపోయిన భూగోళం అంతర్భాగం... క్రమేపీ చల్లబడుతున్నది. కానీ దాని ఉపరితలం వేడెక్కుతున్నది. వాతావరణపరంగా, రాజకీయంగా ఏ సాంకేతిక పరిజ్ఞానం లేని ఆదిమానవుడే విశ్వవాప్తంగా సుఖశాంతులతో బతికేవాడేమో అనిపిస్తోంది నాకు. దిక్సూచిని కనుక్కోవడం, నౌకాయానం, ఐరోపా దేశస్థులు మూడు ఖండాలనూ ఆక్రమించడం... అక్కడ ఉన్న అసలు అమెరికన్ల, అప్‌టెక్‌ల, ఆస్ట్రేలియా వాసుల అంతర్ధానానికి కారణమైంది. అలాగే ఆసియా ఖండంలో లేని ఎన్నో వ్యాధులను తెల్లవారు ప్రవేశపెట్టారు. ఉత్తర – దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా ఖండాల్లోని కోట్ల మంది అమాయక ప్రజల్ని మట్టుబెట్టారు. ఇది చారిత్రక సత్యం. నవీకరణ, సరళీకరణ పేరుతో అవే సామ్రాజ్యవాద దేశాలు వెనుకబడ్డ ఆఫ్రో–ఏషియన్ దేశాల్ని చాలా తెలివిగా, అనుమానించడానికి వీల్లేకుండా నేడు దోచుకొంటున్నాయి. పొరుగు దేశాల మధ్య చిచ్చు పెట్టి యుద్ధాలకు పురిగొల్పుతున్నాయి. ఈ రెండు ఖండాల దేశాలు పలు మారణాయుధాలకు, ఔషధాలకు, పరీక్షా క్షేత్రాలుగా మారాయి. ఇదీ నేడు జరుగుతున్న వాస్తవం.

ఈ నేపథ్యంలో చూస్తే నేడు పశుపతి (నేపాల్) నుంచి తిరుపతి వరకు పడగలు విప్పి బుసలుకొడుతున్న మావోయిజం... నోరు లేని, చేతగాని తరతరాలుగా అణచివేయబడ్డ యావద్భారత గ్రామీణ జనుల ఆక్రందనల, నిశ్శబ్ద రోదనల ప్రతిధ్వని అనిపిస్తోంది.

స్వతంత్రానికి ముందు బ్రిటిష్ మాజీ ప్రధాని చర్చిల్ మాటలు నా చెవుల్లో రింగుమంటున్నాయి. “భారతీయులు స్వాతంత్ర్యానికి అనర్హులు. వాళ్లంతా నైతికంగా గడ్డిపోచలకంటే హీనం.”

స్వాతంత్ర్యానంతర పరిణామాల్ని పరిశీలిస్తే ఈ మాటలు నిజమేననిపిస్తున్నాయి. కృష్ణమీనన్ హయాంలో జీపుల కుంభకోణం మొదలుకొని ఎల్ఐసీ నిధుల దుర్వినియోగంతో పరిణతి చెందిన నైతిక పతనం – బోఫోర్స్ – హర్షద్ మెహతా శవ పేటికల కుంభకోణాలు వగైరా వగైరాలతో (ఓహ్ తలచుకుంటేనే గుండె బద్దలవుతోంది) అధోస్థానానికి చేరుకుంది. లక్షాధికారి ఎలాగైనా కోటీశ్వరుణ్ని కావాలనుకుంటే, కోటీశ్వరుడు అర్బుదేశ్వరుణ్ని కావాలని తహతహలాడుతున్నాడు. వేలకోట్లకు అధిపతులైనవారు కూడా ఇంకో వెయ్యి కోట్ల కోసం తప్పుడు మార్గాలు పడుతున్నారు. ఇన్‌కమ్ టాక్స్ దాడులు – జైలుకెళ్లడం లాంటివి స్థాయీ చిహ్నాలుగా మారాయి.

మన రాజకీయ నాయకులది వృత్తి రాజకీయమే. వారికింకొక విద్య తెలియదు. వారు మరణిస్తే వారి సంతానానికి వారసత్వంగా ఆ వృత్తి సంక్రమిస్తుంది. అందుకే ఎవరో అన్నారు... "ఏమాత్రం రిస్కు లేని వృత్తి రాజకీయమే" అని. వందల ఏళ్లుగా శ్రమిస్తున్న ఒక టాటా కంపెనీకి నష్టాలు రావొచ్చు. కానీ ఇప్పటివరకు ఏ రాజకీయ నాయకుడూ నష్టాలు చవిచూడలేదు.

ఇక అవినీతి నిరోధక సంస్థలు చిన్న, మధ్యస్థాయి ఉద్యోగులపై విరుచుకు పడతాయి. ఎప్పుడో ఒకప్పుడు ప్రభుత్వ ఆదరణ కోల్పోయిన ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్ల పైన పడుతుంటారు.

ఈ కుళ్లిపోయిన వ్యవస్థ వల్ల ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందాల్సినంతగా అందడం లేదు.

ధనిక, బీద వర్గాల మధ్య అంతరం బాగా పెరుగుతున్నది. ధనిక వర్గాల పరమ జుగుప్సాకరమైన జీవన శైలిని మధ్య తరగతివారు, బీదవర్గాలు నిశ్చేష్టులై గమనిస్తున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఈ వింత కొనుగోలు (Conspicuos Consumption) ధోరణులను ఆరికట్టాలి. నెలకొక నోకియా సెల్ మోడల్, ఆర్నెల్లకొక రకం కారు – పబ్బులు – పెప్సీలు మనల్ని మానసిక, శారీరక దౌర్బల్యులుగా మారుస్తున్నాయి.

ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం "సర్వే జనా సుఖినో భవంతు."

దీన్ని విస్మరించిన అనేక ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయి. బలి చక్రవర్తి చెప్పినట్లు

"కారే రాజులు! రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే? వారేరీ?
సిరి మూటఁ గట్టుకొని పోవం జాలరే? భూమిపై పేరైనన్ గలదే?"

ప్రజల ఓపికకు ఓ హద్దుంటుంది. ఆ చెలియలికట్ట తెగిపోతే రక్తపాతం తప్పదు. ప్రజాగ్రహం ముందు ఏ సైన్యమూ నిలువలేదు.

ఇప్పటికైనా వ్యవస్థలో నిర్ణయాత్మక బాధ్యతల్లో ఉన్నవారు మేల్కొని తమ ధనిక, వర్గ, వర్ణ పక్షపాతాన్ని మానుకొని మన ప్రణాళికలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి. లేకపోతే దేశంలో ఎన్నో నక్సల్బరీలు, శ్రీకాకుళాలు, తెలంగాణలు, లాల్‌గఢ్‌లు, అబూజ్‌మాడ్‌లు పునరావృతమవుతాయి. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోని దేశం... చేసిన తప్పుల్నే మళ్లీ మళ్లీ చేస్తూ నాశనమవుతుంది.

ఇక ప్రస్తుత పుస్తకం "ఛలో ఛత్తీస్‌గఢ్" చదివిన నాకు జర్నలిజం అంటే ఇలా ఉండాలి అనిపించింది. ధైర్యం చేసి, ప్రాణాలకు తెగించి అటు సల్వాజుడుం ఇటు మావోయిస్టుల ఆధీనంలో ఉన్న రెండు ప్రాంతాల్లో రచయిత రెహమాన్ కలదిరిగారు. తిరగడమే కాదు... తన లక్ష్యాన్ని సాధించగలిగారు. సాధించడమే కాదు... ప్రతి క్షణం అడవితో, అక్కడి మనుషులతో మమేకమయ్యారు. అందుకే ఒక దగ్గర "మానవుడు ఆటవిక జీవితం నుంచి బయటకు రావడం" పెద్ద పొరపాటని అభిప్రాయపడ్డారు.

ఈ విశ్లేషణాత్మక దృష్టి ఇతర అంశాలపైనా ప్రసరించారు. అసలు ఛత్తీస్‌గఢ్‌లో భూస్వాములైన కోయలు... అధిక సంఖ్యలో ఉన్న గొత్తికోయల్ని చిన్నచూపు చూడటం మావోయిస్టులకు లాభించిందనే సత్యాన్ని నిర్భయంగా చెప్పారు.

చక్కటి శరీర సౌష్టవంతో, సుశిక్షుతులైన మిలీషియా - గెరిల్లాల ముందు ఒక్క సల్వాజుడుం కార్యకర్తలే కాదు పోలీసులు కూడా దిగదుడుపేనని గ్రహించారు. మ్యాగజైన్లు నడుముకు కట్టుకొని ఖాళీ తుపాకీ చేతపట్టిన నలుగురు ఎస్కార్ట్ కానిస్టేబుల్స్ మధ్యన కూర్చొని హోటల్లో భోజనం లాగించేస్తున్న దంతెవాడ ఇన్స్‌పెక్టరే ఒక ఉదాహరణ. ప్రభుత్వ కీలుబొమ్మ అయిన మహేంద్రకర్మ నాయకత్వం వహిస్తున్న సల్వాజుడుం ఎస్పీవోలకు మూడు నెలలుగా జీతాలు అందడం లేదంటే నాకేమీ ఆశ్చర్యం కలుగలేదు. ఇది "మామూలు" విషయం. అంతటా ఉన్నదే.

రచయిత తన నిశిత దృష్టితో గొత్తికోయల జీవన విధానాన్ని గమనించాడు. వాళ్లకు అడుక్కోవడం అంటే తెలియదు. దాచుకోవడం అంతకన్నా తెలియదు.

ఆవుపాలు దాని దూడకు మాత్రమే చెందుతాయనీ, తాము తాగకూడదనీ విశ్వసిస్తారు. పాలతో పాటు పొదుగును కూడా కోసుకొని తినేవాళ్లను ఇది విస్మయానికి గురి చేస్తుంది.

ఛత్తీస్‌గఢ్‌లోని పది జిల్లాల్లో మావోయిస్టుల మాట చెల్లుబాటు అవుతుంది. ఆ ప్రాంతంలో పదిహేనేళ్లుగా ఎన్నికలు జరగలేదని, భూమిశిస్తు వగైరా అంతా మావోయిస్టులే వసూలు చేస్తారనీ తెలిసి అక్కడ సమాంతర ప్రభుత్వం నడుస్తున్నదనీ అనుకోవాలి.

రచయితకు మావోయిస్టు నేతల్ని కలుసుకోవడానికి ఎంత కష్టమైందో - జుడుం నేత మహేంద్రకర్మను కలుసుకోవటానికీ అంతే కష్టమైంది. అంటే ఇరువైపులా నాయకత్వం భయం భయంగా బతుకుతోందన్నమాట.

అడపాదడపా జరిగే మారణకాండలో వందల సంఖ్యలో కోయలు, గొత్తికోయలు, పోలీసులూ మరణిస్తున్నారు. ఈ మూడు పక్షాల్లో ఏ ఒక్క పక్షమూ ఈ మారణకాండకు దారితీసిన పరిస్థితుల్ని సృష్టించలేదు. 1) అచేతనావస్థలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, 2) చదువు నేర్చుకొని, మోసం చెయ్యటం నేర్చుకొని గొత్తికోయల జీవన విధానాన్ని ధ్వంసం చేసిన - చేస్తున్న కొందరు కోయదొరలు, 3) ఇదే అదనుగా భావించి దంతేవాడ, ఎర్రబోరు, కుంట, అబూజ్‌మాడ్ వగైరా ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయి కోయ - గొత్తికోయల మధ్య అగాధాన్ని ఇంకా పెంచి తమ పబ్బం గడుపుకొంటున్న ఆంధ్ర మావోయిస్టులు.

ఈ మూడు కారణాల వల్ల ఈరోజు యావత్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రగులుతున్న మహా శ్మశానవాటికను తలపిస్తున్నది. దీనికి పరిష్కారం ఎప్పుడు? ఎలా?

తన నిశిత దృష్టితో సమస్యను మనకు కళ్లకు గట్టినట్లు చూపించిన శ్రీ రహమాన్‌గారు జర్నలిజంలో అత్యున్నత ప్రతిభా ప్రమాణాలు కనబరిచారు. అందుకు ఆయన రాష్ట్ర స్థాయిలోనే గాక దేశ స్థాయిలో ఉన్నత ప్రమాణాల అవార్డుకు అర్హులని ఘంటా బజాయించి చెప్పగలను.

బెస్టాఫ్ లక్... కీపిటప్ రహమాన్.

**పేర్వారం రాములు**

రిటైర్డ్ డీజీపీ, ఆంధ్రప్రదేశ్

సమయం – అర్థరాత్రి
భాగ్యనగరం

# ఆత్మీయ వాక్యం



a great man must be motivated by the dynamics of a social purpose - ambedkar

ఒక సాధారణ జర్నలిస్టు.. అసాధారణమైన.. అనితర సాధ్యమైన.. దుర్భేద్యమైన అమానవీయ విధ్వంసాన్ని బట్టబయలు చేసిన ప్రయత్నం ఇది. ఒక రకంగా తనతో తాను యుద్ధం చేస్తూనే సమాజాన్ని అడుగడుగునా నిర్వీర్యం చేస్తున్న విలువల పరాయీకరణను కళ్లకు కట్టినట్లుగా చూపించేందుకు సాగించిన జీవనయాత్ర ఇది. ఏదో ఒక ప్రయోజనం లేకుండా ముందుకు సాగని పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ప్రాణాలకు తెగించి విద్యుక్త ధర్మాన్ని సమర్థవంతంగా నిర్వహించడం సాహసమే.. వృత్తి పరమైన నిబద్ధతను పాటిస్తూనే సగటు మానవుడిగా స్పందించడం.. ఆ దిశగా జరుగుతున్న అనాగరిక, అసహజ, అమానవీయ దుశ్చర్యలను, సంఘటనలను తెరకెక్కించడం (దృశ్యీకరించడం) అభినందనీయం, మానవ సమూహం అడవి నుంచి ఎన్నో అనుభవాలను, మూట గట్టుకుంది, పాఠాలు నేర్చుకుంది. ఎల్లలెరుగని.. ఏమీ తెలియని అడవి బిడ్డల ఆక్రందనలు.. ఆవేదనలు.. పోరాటాలు.. ఆరాటాలు.. వైరుధ్యాలు.. అన్నింటినీ సమరోత్సాహంతో రికార్డు చేయడమంటే మరో అరుదైన ప్రపంచాన్ని ఆవిష్కరించడమే.. అన్ని అవకాశాలు.. అపారమైన వనరులున్నా వినియోగించుకోలేక.. కాలక్షేపం చేస్తున్న నయా జమానా ఊరేగుతున్న ప్రపంచంలో రహమాన్ తన జీవితాన్ని ఫణంగా పెట్టాడు. మరణం అంచుల దాకా వెళ్లి తిరిగొచ్చాడు. ఛత్తీస్‌గఢ్.. ఆ పేరు ఇపుడు దేశవ్యాప్తంగా అందరికీ సుపరిచితం. ఇదే ప్రస్తుత హాట్ టాపిక్. అక్కడ జరుగుతున్న మారణకాండ పిట్టల్లా రాలిపోతున్న అమాయకుల మానప్రాణాల గురించిన వాస్తవ సమాచారం కోసం వెదకడమంటే గాలిలో దీపాన్ని వెలిగించడమే. జరుగుతున్నదొకటి.. జరిగేది మరొకటి.

ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ.. అడవిబిడ్డల మధ్య రాజుకున్న అధిపత్య పోరులో నెలకొన్న ప్రతి సంఘటనను ఆస్వాదించేలా, అనుభవంలోకి తీసుకునేలా, చేసినందుకు అభినందించాలి.

దండకారణ్యంలో చోటు చేసుకున్న పరిణామాలు.. వాటి వెనకనున్న వాస్తవాలు తెలుసుకోవాలంటే.. సల్వాజుడుం పేరుతో గొత్తికోయల జాతి నిర్మూలనకు జరుగుతున్న ప్రయత్నాలను, మావోయిస్టులు నడిపిస్తున్న సమాంతర జనతన్‌సర్కార్ గురించి వివరాలు కావాలంట రహమాన్ సాగించిన అద్భుతయాత్ర చదవాల్సిందే. మీడియా రంగంలోకి రావాలనుకుంటున్న వారు, ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న వారు, విధిగా దీనిని ఆకళింపు చేసుకోవాలి. పరిశోధనాత్మక జర్నలిజానికి ప్రతీకగా నిలిచిన ఈ సాహసోపేత ప్రయత్నం వర్ధమాన జర్నలిస్టులకు కరదీపిక లాంటిది.

నూరు పూలు వికసించనీ.. వేయి ఆలోచనలు సంఘర్షించనీ..

అభినందనలతో..

**ఆర్. శైలేష్ రెడ్డి**
ఛానల్ హెడ్
జీ 24 గంటలు
ఆంధ్రప్రదేశ్

# సందేశం




రవి కానని చోటు... కవి కానును... రవి, కవి కానని చోటు ఛత్తీస్‌గఢ్‌ను దృశ్యీకరించి తెర కెక్కించిన జర్నలిస్టు రహమాన్ అభినందనీయుడు. సమాజం కళ్ళుండీ చూడలేని చోటును నేడు మీడియా మూడో కన్ను చూస్తోంది.

సంచలన వార్తల ద్వారా అందరి దృష్టి ఆకర్షించే రహమాన్ నాకు సుపరిచితుడు. ఛత్తీస్‌గఢ్ వార్తల ద్వారా బెస్ట్ రిపోర్టర్ అవార్డు అందుకొన్న రహమాన్ అవే కథలకు అక్షరరూపం ఇవ్వడం ముదావహం. చుట్టూ ఉన్న సమాజాన్ని, సమస్యలను ఆకళింపు చేసుకొని వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్న ప్రతీ జర్నలిస్టు తప్పక చదవాల్సిన పుస్తకం 'ఛలో ఛత్తీస్‌గఢ్'. జాతీయ ఛానళ్ళు వెళ్ళలేని చోటుకు చేరుకొని అక్కడ జరుగుతున్న అకృత్యాలను కథనాలుగా మలిచి తెలుగు జర్నలిజానికి వన్నెతెచ్చిన రహమాన్ మరింత ఎత్తుకు ఎదగాలని, లోకం కానని మరెన్నో గాథలను వెలుగులోకి తీసుకురావాలని, కలం యోధుల చరిత్రలో తనకు ఓ బంగారు పేజీ సొంతం చేసుకోవాలని మనసారా ఆకాంక్షిస్తూ ...

అభినందనలతో...

**సి. పార్థసారథి**
ఐ.ఎ.ఎస్., కమిషనర్,
సమాచారపౌరసంబంధాల శాఖ
ఆంధ్రప్రదేశ్.



# సందేశం

మిత్రుడు రహమాన్ సాహసోపేతంగా చేసివచ్చిన ఛత్తీస్‌గఢ్ యాత్రను పుస్తక రూపంలో మలచడం అభినందనీయం. ఒకపక్క అనేక కోణాలలో దేశం, సమాజం అభివృద్ధి చెందుతుంటే ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని జిల్లాలు చాలా దారుణమైన పరిస్థితులలో చిక్కుకోవడం విచారకరం. అత్యంత వెనుకబడిన జాతులుగా పరిగణించే కోయ, గొత్తికోయలలో విభేదాలు, నక్సల్స్, సల్వాజుడుంల మధ్య పోరులో సామాన్యుడి బతుకు ఛిద్రమైపోతోంది. అడవులలో కూడా ప్రశాంత జీవనానికి ఆస్కారం లేని విధంగా యుద్ధ వాతావారణం నెలకొన్న సందర్భంలో ఆ వార్తలను దృశ్యరూపంలో తీసుకురావడం అంత తేలికైన విషయం కాదు. నిజంగా చాలా ధైర్యం కావాలి. పొరుగుదేశాలతో యుద్ధం జరిగితే, ఆ వార్తలను కవర్ చేయడం ఒక ఎత్తు. మన సైనికులు ఉన్న వైపు ఉండి వార్తలు కవర్ చేయవచ్చు. కాని మన దేశంలోనే అంతర్గతంగా యుద్ధం జరుగుతున్నప్పుడు ఎక్కడ ఏమి పేలుతుందో, ఎవరు ఎటువైపు నుంచి కాల్పులు జరుపుతారో తెలియని పరిస్థితిలో జర్నలిస్టులు వృత్తి నిర్వహించడం అంటే అది మాటల్లో చెప్పేదికాదు. స్వయంగా అనుభవిస్తేనే ఆ ఇబ్బంది ఏమిటో అర్థం అవుతుంది. అలాంటి యుద్ధ వాతావరణంలోకి వెళ్లి వార్తల్ని తీసుకురావడం అంటే అదో అనుభవం. భయానకమైన పరిస్థితుల నుంచి బయటకు వచ్చాక అవన్నీ అనుభూతులవుతాయి. హిమాలయం ఎక్కినంత సంతోషం కలుగుతుంది. ఆ అనుభవాలన్నిటినీ దృశ్యరూపంలో చూపడమేకాక, పుస్తక రూపంలోకి కూడా రెహమాన్ తీసుకురావడం హర్షణీయం. మన దేశంలో అధికారం అధికంగా వినియోగించినా, అధికారంతో సంబంధం లేకుండా తుపాకి గొట్టాన్ని ప్రయోగించినా, చివరికి యాతన పడుతున్నది సామాన్యుడే. ఛత్తీస్‌గఢ్ ఇలాంటివారికందరికి ఓ ప్రయోగశాల అయిపోయింది. అది నక్సలైట్ల బృందం కావచ్చు. సల్వాజుడుం కావచ్చు. లేదా ప్రభుత్వ యంత్రాంగం కావచ్చు. జనంపై

పెత్తనం చేయాలన్న తపనే ఎక్కువగా కనిపిస్తోందికాని, జనం బతుకులను బాగుచేయాలన్న యావ కన్పించదు. ఈ పుస్తకం చదువుతుంటే అవన్నీ బోధపడుతుంటాయి. ఏది ఏమైనా తన అనుభవాలతో కూడిన ఈ పుస్తకాన్ని అందించినందుకు రెహమాన్‌కు అభినందనలు.

**– కొమ్మినేని శ్రీనివాసరావు**

ఎడిటర్, ఎన్.టీవీ, హైదరాబాద్.

# దండకారణ్యంలో సత్యశోధన



'సాహసి కానివాడు జీవన సమరానికి పనికిరాడు.. హిమశిఖరమైన ఎవరెస్టును ఒక టెన్సింగే ఎక్కగలడు' అంటాడు తిలక్. అత్యంత ప్రమాదభరితమైన ఛత్తీస్‌గఢ్‌లో ప్రవేశించడం, అక్కడి పరిస్థితులను చిత్రించి యథాతథంగా అందించగలగడం ఒక రహమాన్‌కే సాధ్యమైంది. ఛలో ఛత్తీస్‌గఢ్ అంటూ మొదటి నుంచి చివరిదాకా ఆగకుండా చదివించగలిగే రహమాన్‌లో సాహసంతో బాటు చేయి తిరిగిన రచయిత కూడా కనిపిస్తాడు. సాధారణంగా ఇలాంటి పరిశోధనాత్మక వార్తాకథనాల నేపథ్యం రాస్తున్నపుడు స్వోత్కర్ష ఎక్కువగా ఉండి అసలు విషయం తక్కువగా ఉంటుంది. ఈ రచనలో రహమాన్ ఎక్కడా తన గొప్పదనం గురించి చెప్పుకోలేదు. బాహ్య ప్రపంచానికి తెలియని అక్కడి పరిస్థితులు కళ్లకు కట్టినట్టు వివరిస్తూ, విశ్లేషిస్తూ నడిపించిన బిగువైన కథనమే రహమాన్ సాహసాన్ని పరోక్షంగా చాటిచెబుతుంది.

టీవీలో దృశ్యమే మాట్లాడుతుంది. అందుకే దృశ్యాన్ని దిగమింగే వ్యాఖ్యానం మంచిది కాదని టీవీ రచన తొలి పాఠాల్లో చెబుతారు. ఈ పుస్తక రచన అవసరం అందుకు భిన్నమైనది. దృశ్యాన్ని వర్ణిస్తూ చదువరిని ముందుకు నడపాలి. చదువుతున్నపుడే చూస్తున్న అనుభవం కలిగేలా రాయాల్సిన అవసరాన్ని గుర్తించి అందుకు తగిన శైలిని ఆశ్రయించారు రహమాన్. అలాంటి ఆకట్టుకునే శైలిలో మనల్ని చేయి పట్టుకొని ఆఖరిపేజీ దాకా నడిపిస్తారు. టీవీకీ రాసే పద్ధతికి భిన్నంగా పాఠకుణ్ణి మాత్రమే దృష్టిలో పెట్టుకోవడం వల్లనే ఇది సాధ్యమైంది.

భావోద్వేగాన్ని కలిగించడం ద్వారా ప్రేక్షకుణ్ణి ఆకట్టుకునే టీవీ మాధ్యమం కోసం పరిశోధనాత్మకంగా వార్తా కథనాలు రూపొందించిన యువ జర్నలిస్టు రెహమాన్ ఇప్పుడు తన విశ్లేషణాత్మక రచన ద్వారా పాఠకులకు మరింత

చేరువయ్యారు. రెండు వేరు వేరు ప్రవాహాల్లా సాగిపోతున్న దృశ్య, ముద్రణ మాధ్యమాలను సమానంగా ఉపయోగించు కోవడం కూడా రహమాన్ ప్రత్యేకత. టీవీలో కేవలం దృశ్య రూపంలో కథనాలు ప్రసారం చేసి ఆసక్తి పెంచి, ఇప్పుడు ముద్రణలో మరిన్ని వివరాలు, విశ్లేషణ జోడించి ప్రచురించి మేధావులను ఆకట్టుకుంటున్నారు. టీవీ ప్రేక్షకులు, పత్రికల పట్ల ఎలా స్పందిస్తారనే విషయాన్ని ఇటీవలే సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ (సి ఎం ఎస్) సంస్థ పరిశోధించింది. ఎక్కువ సేపు టీవీ వార్తలు చూసినవారు మరుసటి రోజు మరింత ఎక్కువగా పత్రికలు చదువుతున్నారన్నది ఆ అధ్యయన సారాంశం. పత్రికల మీద పెరిగిన ఆసక్తికి కారణమైన టీవీ వార్తల ప్రభావాన్ని "Appetizer Effect" గా సిద్ధాంతీకరించింది. అప్పట్లో టీవీ5లో ప్రసారమైన ఈ వరుస కథనాలు కూడా అలాంటి ప్రభావాన్ని చూపించి పుస్తకానికి మరింత ఆదరణ తెచ్చిపెడతాయన్నది నా నమ్మకం.

పరిశోధనాత్మక జర్నలిజంలో టీవీలకూ, పత్రికలకూ ప్రధానమైన భేదాలున్నాయి. సంబంధిత డాక్యుమెంట్లు సంపాదించగలిగితే తప్ప పత్రికలు ప్రత్యక్షమైన ఆధారాలు చూపించడం కష్టం. సంభాషణల ద్వారా సేకరించిన సమాచారాన్ని పాఠకుడి విశ్వాసం పొందేలా అందించడం కత్తి మీద సాములాంటిది. టీవీకి దృశ్య రూపంలో ఆధారం దొరుకుతుంది గనుక తిరుగులేని సాక్ష్యమవుతుంది. అదే సమయంలో మరో సమస్య కూడా ఉంది. టీవీ జర్నలిస్టు ఒంటరిగా వెళ్ళి సమాచారం సేకరించడం సాధ్యంకాదు. కెమెరామన్ వెంట ఉండాలి. స్వయంగా కెమెరా ఆపరేట్ చేయగలిగినా, వెంట కెమెరా ఉండటమే ప్రమాదకరం. సజీవ సాక్ష్యం సంపాదించగలిగే అవకాశంతోబాటు ప్రమాదంలో చిక్కుకునే ప్రతికూల పరిస్థితులూ టీవీ జర్నలిస్టులకుంటాయి. అందుకే ఈ పరిశోధనలో రహమాన్‌కు చేదోడు వాదోడుగా నిలిచిన కెమెరామన్ / వీడియో జర్నలిస్టునూ అభినందించాలి.

'ఛలో ఛత్తీస్‌గఢ్' ఈ పుస్తకంలో రహమాన్ పొందుపరచిన అంశాలను మళ్ళీ ఇక్కడ ప్రస్తావిస్తే పునరుక్తి దోషమవుతుంది. స్వానుభవాలనూ, అక్కడి ప్రజల మధ్య పొందిన సహానుభూతినీ రంగరించి అందించిన ఈ కథనాన్ని పరిచయం చేయడమంటే తినబోయే వాళ్ళకు రుచి చెప్పడమే! చదవటం మొదలెడితే పూర్తయ్యేదాకా చదువుతూనే ఉంటారని మాత్రం హామీ ఇవ్వగలను.

దండకారణ్యంలో దాగిన వాస్తవాలను శోధించి ప్రపంచానికి చూపించాలనే ఆరాటంతో ఇలాంటి సాహసానికి ముందుకొచ్చిన రెహమాన్‌ను, అతడి కృషికి తగిన గుర్తింపు వచ్చేలా వరుస కథనాలు ప్రసారం చేసి ప్రోత్సహించిన టీవీ5 యాజమాన్యాన్నీ ప్రత్యేకంగా అభినందించాలి. ఈ రచన మరికొందరు టీవీ జర్నలిస్టులను పరిశోధనల వైపు పురికొల్పుతుందనీ, పరిశోధనాత్మక కథనాలను ఇలా పుస్తక రూపంలో కూడా తెచ్చేందుకు తగినంత ఉత్సాహాన్నిస్తుందనీ ఆశిస్తున్నాను. మిత్రుడు రహమాన్‌కు మరోమారు హృదయపూర్వక అభినందనలు.

**– తోట భావనారాయణ**

టీవీ జర్నలిస్ట్

# అరుదయిన పరిచయం

జర్నలిస్టు మిత్రుడు రెహమాన్ ఇక్కడ తన వృత్తిజీవిత అనుభవాలలోంచి ఒక అనుభవాన్ని మీకు పరిచయం చేస్తున్నారు. జర్నలిస్టులకు వాళ్ల వృత్తిజీవితంలో వందలా వేలా విశిష్ట అనుభవాలు ఉంటాయి. ఎన్నో ప్రాంతాలలో, ఎన్నో సన్నివేశాలలో, ఎందరో వ్యక్తులతో వ్యవహరించిన సందర్భాలలో గడించిన అపురూపమైన అనుభవాలు ఉంటాయి. అవి సాధారణ పాఠకులకూ శ్రోతలకూ అందవు. ఎందుకంటే ఎప్పుడయినా జర్నలిస్టులు రాసినవాటికన్న, చూపించినవాటికన్న మించినవీ, రాయనివీ, చూపించనివీ చాలా ఉంటాయి. నిజానికి పాశ్చాత్య దేశాల జర్నలిస్టులు చాలామంది ఇతర దేశాలకో, ఇతర ప్రాంతాలకో వృత్తిపరమైన పర్యటన చేసినప్పుడు తాము ప్రాతినిధ్యం వహించే పత్రికకో, దృశ్యమాధ్యమానికో ఇచ్చే నివేదికతోపాటుగానే సొంతంగా వ్యాసాలూ, జీవితానుభవాలూ, పుస్తకాలూ రాస్తారు. అలా తమ వార్తానివేదికలలో చెప్పలేకపోయిన అనేక విషయాలను, ముఖ్యంగా తమ అనుభవాలను, తాము కలుసుకున్న వ్యక్తుల, చూసిన ప్రాంతాల విశేషాలను వివరిస్తారు. తెలుగులో అటువంటి ప్రయత్నం అసలే జరగలేదని కాదుగాని, జరగాల్సినంత జరగలేదు. ఎంతోమంది తెలుగు జర్నలిస్టులు గడించిన విలువైన అనుభవాలు వాళ్ల మనసులలోనే కాలగర్భంలో కలిసిపోయాయి. ఆ అనుభవాలలోంచి శతాంశమో, సహస్రాంశమో మాత్రమే మనం పత్రికలలో చదివీ, దృశ్య మాధ్యమాలలో చూసీ ఉంటాం. ఆరకంగా తెలుగులో జర్నలిస్టులు తమ వార్తలవెనుక కథలు చెప్పడం ఒక అరుదయిన సందర్భమే. ఇప్పుడు ఛలో ఛత్తీస్‌గఢ్ పుస్తకంలో అటువంటి అరుదయిన ప్రయత్నం చేస్తున్నందుకు రెహమాన్‌ను అభినందించాలి.

నిజానికి రహమాన్ మనకు పరిచయం చేస్తున్నది ఎక్కడో సుదూరమైన, మనకు తెలియని ప్రాంతం కాదు. మనకు కూతవేటు దూరంలో మన గోదావరి అవతలి ఒడ్డున మొదలయి సువిశాలంగా వ్యాపించే దండకారణ్యంలో దంతెవాడ జిల్లా

జనజీవితంలో తాను చూసిన విశేషాలను రహమాన్ వివరిస్తున్నారు. అక్కడ సల్వాజుడుం పేరుతో సాగుతున్న సాయుధ ముఠా కార్యకలాపాల తీరునూ, దాని పర్యవసానాలనూ తాను అప్పుడు పని చేస్తున్న టీవీ5 కోసం చిత్రించడానికి వెళ్లి, అది ఒక సాహస కార్యక్రమంగా, ఎన్నోసార్లు మృత్యువుకూ, ప్రమాదానికీ అంచులదాకా వెళ్లివచ్చి ఆ వార్తా నివేదిక తయారు చేశారు. పనిలో పనిగా ఇటు శరణార్థులుగా తరలివచ్చి తలదాచుకుంటున్న గొత్తి కోయలనూ, అటు సల్వాజుడుం క్యాంపులలో చిక్కుబడిపోయిన ఆదివాసులనూ కలిశారు.

మావోయిస్టు దళాలను కలవడానికి అష్టకష్టాలు పడి సాధించి ఒక దళాన్ని ఇంటర్వ్యూ చేశారు. మరోవైపు సాల్వాజుడుం ప్రారంభకుడు మహేంద్రకర్మను, దంతెవాడ జిల్లా పోలీసు అధికారులనూ ఇంటర్వ్యూ చేశారు. అదంతా టీవీ5లో కొన్ని రోజులపాటు ధారావాహికగా ప్రసారమయి బహుళ జనాదరణ పొందింది.

ఆ నివేదిక ప్రసారమయి చాలా రోజులు గడిచిపోయినాక కూడ ఆ అనుభవాలు రహమాన్‌ను వదలలేదు. తాను పొందే అనుభవాలను ముక్కున పెట్టుకుని కాగితం మీద పెట్టగానే, ప్రసారం చేయగానే మరచిపోయే రకం జర్నలిస్టు కాదు రహమాన్. చాలమంది జర్నలిస్టులు వృత్తి జీవితంలో తాము కలిసే మనుషులనూ, తమ వార్తావస్తువులనూ వెంటనే మరచిపోతారు. మరచిపోక తప్పని ఒత్తిడి ఉంటుంది. కాని కొన్ని వార్తావస్తువులు అలా మరపుకు వచ్చేవి కావు. ముఖ్యంగా ఆ వార్తావస్తువులు జనజీవిత ఘర్షణకు సంబంధించినవయితే, ఆ వార్తావస్తువుల నిండా కన్నీళ్లూ నెత్తురూ నిండి ఉన్నట్టయితే, ఆ జర్నలిస్టు భావోద్వేగాలకు కదిలిపోయే సున్నిత మనస్కుడయితే తన వార్తావస్తువుల కన్నీటితడి, నెత్తుటి స్పర్శ ఆ జర్నలిస్టును ఎప్పటికీ వదలదు.

అందుకే నిరాశ్రితులుగా, శరణార్థులుగా ఖమ్మంజిల్లా అడవుల్లో తల దాచుకుంటున్న గొత్తికోయల కుటుంబాలలో ప్రవహిస్తున్న కన్నీరు, నిర్బంధ శిబిరాలవంటి క్యాంపులలో బలవంతాన ఉంచబడి తమ నైసర్గిక అటవీజీవితం గురించి తీరని కలలు కంటూ ఆదివాసులు అనుభవిస్తున్న దుఃఖం, సల్వాజుడం సైనికులుగా మారి పాలకవర్గాలకు, సామ్రాజ్యవాద ఖనిజదాహానికి తెలిసీతెలియ సమిధలయిపోతున్న ఎస్పీవోల అమాయక ఆగ్రహం, దంతెవాడను అభివృద్ధి చేయడమంటే ఖనిజవిలువలను బహుళజాతి సంస్థలకు అప్పగించడమేననీ,

అందుకొరకు అవసరమయినదంతా చేస్తాననీ, మావోయిస్టులను నిర్మూలిస్తాననీ మహేంద్రకర్మ పలికే ప్రగల్భాలు, తమ ఆదివాసి సమాజానికి మాత్రమే కాదు, దేశానికి ఒక కొత్త, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను చూపడానికి జీవన్మరణ పోరాటం సాగిస్తున్న సాయుధ విప్లవకారుల దృఢ నిశ్చయం, త్యాగనిరతి – ఇవీ, ఇలాంటివే మరెన్నో అనుభవాలను రహమాన్ అత్యంత సన్నిహితంగా, ప్రమాదకరంగా, ఉద్వేగపూరితంగా అనుభవించారు.

ఆ అనుభవాలకు అక్షరరూపం ఇవ్వాలనీ, ఆ అనుభవాలను మనందరికీ అందుబాటులోకి తేవాలనీ రహమాన్ భావించిన ఫలితమే ఈ పుస్తకం. ఇది తెలుగు పత్రికారచనలోనూ, ఉద్వేగభరిత జీవితచిత్రణలోనూ, ఒక ఉద్యమ పరిచయంలోనూ, ఒక వాస్తవ నివేదనలోనూ అరుదయిన, అవసరమయిన, తప్పనిసరి చదవాల్సిన పుస్తకం.

ప్రపంచీకరణ యుగంలో పెరిగిపోతున్న పేజ్ 3 జర్నలిజంలో ఉన్న పేజీలన్నీ, ఉన్న ప్రసార సమయమంతా పేజ్ 3 కే పరిమితమయిపోతున్న సందర్భంలో ఇటువంటి జనజీవిత పార్శ్వాలెన్నిటినో చిత్రించవలసి ఉంది. ఆ కర్తవ్యాన్ని చేపట్టినందుకు రెహమాన్‌ను అభినందిస్తూ, ఈ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటారని ఆశిస్తూ...

**ఎన్. వేణుగోపాల్**

ఆగస్ట్ 8, 2009

# నా మాట

నిజానికి నాకు అరుదైన అవకాశాలే వచ్చినట్లు లెక్క. రోజూ నేతల సొల్లు కబుర్ల సౌండ్ బైట్స్‌రికార్డ్ చేసిన దానికంటే... ఆదివాసీలు, అడవులు, కొండలు, కోనలు ఎక్కడం, దిగడం... కల్తీలేని ప్రపంచం, కల్మషం లేని మనుషులతో మమేకమవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను.

నా సుదీర్ఘ జర్నలిస్టు ప్రయాణంలో అనేక మైలు రాళ్లు దాటాను. 2008లో టివి5 చానల్ తరుపున చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పర్యటించాను. అక్కడ సల్వాజుడుం పేరుతో సాగుతున్న అరాచకాలు, ఆకృత్యాలు, మావోయిస్టు పార్టీ నడిపిస్తున్న జనతన సర్కార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అంతర్యుద్ధం కారణంగా చెల్లాచెదురైన గొత్తికోయ గూడాలు నా ఈ పుస్తక రచనకు ప్రేరణ. ఇందులో రెండు ముఖ్య ఘట్టాలున్నాయి. 2009 నవంబర్‌లో అబూజ్‌మాడ్ అడవులను చుట్టుమట్టి కోబ్రా, సీఆర్‌పీఎఫ్, బిఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ బలగాలు తుపాకులు ఎక్కుపెట్టి 'గ్రీన్ హంట్' ఆపరేషన్ పేరుతో కీకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. దీని కవరేజ్ ABN ఆంధ్రజ్యోతి తరపున నేను హైదరాబాద్ నుంచి, అబూజ్‌మాడ్ వరకూ సాగిన నా అనుభవాలు. అబూజ్‌మడ్ అనుభవాలు అంతకు ముందు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నేను జరిపిన పర్యటన వివరాలు కలబోసి ఉన్నాయి. ఈ పుస్తకం మొదట చత్తీస్‌గఢ్ అనుభవాలే రాశాను. మాజీ డీజీపీ పేర్వారం రాములును సందేశం రాయాలని అడిగినపుడు ఆయన ఎందుకు రాశారో తెలియదు కానీ... నాకు జాతీయ అవార్డు ఇవ్వాలని అన్నారు. కానీ జర్నలిస్టులకు జాతీయ అవార్డులిస్తారా అని అనిపించి నవ్వుకున్నాను. పని ఒత్తిడిలో పుస్తక ప్రచురణ వాయిదా పడుతూ పోయింది.

ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ, ప్రెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా 2009 అక్టోబర్‌లో ఢిల్లీలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో జాతీయ ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందజేశాయి. నిజంగా పేర్వారం రాములుగారు అంతకచ్చితంగా ఆ కథనాలను అంచనా వేయగలిగారు. ఆ అవార్డు

తరువాత పుస్తకాన్ని వేద్దామనుకునేలోపు మరోమారు చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లి... గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ను కవర్ చేయాల్సి వచ్చింది. సందేశాల కోసం పుస్తకం ఇచ్చిన రోజుకి గ్రీన్‌హంట్ ఆపరేషన్ మొదలుకాలేదు. అందువల్ల సందేశాలిచ్చిన ప్రముఖులెవరూ గ్రీన్‌హంట్ ప్రస్తావన తీసుకురాలేదు. దీనిని పాఠకులు గమనించగలరు. ఈ పుస్తకానికి ముందుమాట రాసిన ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి గారికి, సందేశాలిచ్చిన రిటైర్డ్ ఐపీఎస్, మాజీ డీజీపీ పేర్వారం రాములు, టీవీ 5 ఛైర్మన్ బి.ఆర్. నాయుడు అబూజ్‌మడ్ గ్రీన్‌హంట్ ఆపరేషన్‌కు పంపిన ABN ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఐ అండ్ పీఆర్ కమిషనర్ సి. పార్థసారధి ABN లో ప్రసారం చేసిన న్యూస్ ఎడిటర్ కొమెడ సురేష్‌బాబు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించిన కె. శ్రీనివాసరావు, జీ 24 గంటలు ఛానల్ హెడ్ శైలేష్ రెడ్డి, ఎన్ టీవీ చీఫ్ ఎడిటర్ కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రముఖ జర్నలిస్టు తోట భావనారాయణ, వీక్షణం పత్రిక సంపాదకులు ఎన్. వేణుగోపాల్, పుస్తకం ఎప్పుడొస్తుందని అడుగుతూ నన్ను ప్రోత్సహించిన డాక్టర్ మన్నెం చంద్రమౌళి, టి.కె. లక్ష్మణరావు, ఛత్తీస్‌గఢ్‌కు నాకు తోడుగా వచ్చిన మిత్రుడు రమేష్ బాబుకు, కథనాలను జాగ్రత్తగా కెమెరాల్లో దృశ్యీకరించిన కెమెరామెన్స్ సతీష్, వేణు పుస్తకాన్ని అందంగా ముద్రించిన సాయి లిఖిత ప్రింటర్స్, చక్కగా డీటీపీ చేసిన కస్తూరి గ్రాఫిక్స్ రాజు, అందంగా కవర్ పేజీ డిజైన్ చేసిన అఫ్జల్‌కు, చత్తీస్‌గఢ్‌లో మేం పర్యటించేటప్పుడు.. ఇంకా బతికే ఉన్నారా అంటూ యోగ క్షేమాలు తెలుసుకున్న మిత్రుడు రమణమూర్తి గార్లకు కృతజ్ఞతాభివందనాలు.

ఆకులో ఈనెలై, పూవులో తేనెలై ప్రకృతిమాత ఒడిలో జీవనసమరానికై పాటుపడుతున్న అడవితల్లి బిడ్డల్ని కలుసుకొని, వాళ్ళ కష్టాలను, కన్నీళ్ళను ఈ ఆధునిక (అ)నాగరిక సమాజానికి కనువిప్పు కలిగించాలని ఈ సాహసయాత్రకు పూనుకొన్నాం. దిగితే కానీ లోతు తెలియదన్నట్లు ఈ యాత్రకు మొదలుపెట్టాకకాని తెలియలేదు, ఇదొక విహారయాత్ర కాదు... సమరయాత్ర అనీ, జీవన్మరణ యాత్ర అనీ. 'రాజ్యం' తన ప్రపంచంలోనే కాదు అందుకు అతీతంగా బతుకుతున్న ముఖ్యంగా అమాయకులను, అనామకులను, ఆదివాసీలనూ అనేక ఇబ్బందులపాలు చేస్తోందనీ. స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్ళు దాటినా విభజించు – పాలించు అన్న తెల్లోడి సిద్ధాంతాన్ని అవసరమైనప్పుడు 'రాజ్యం' తన అధికారాన్ని కాపాడుకోవడానికి అస్త్రంగా

ప్రయోగిస్తున్నదనీ. అమాయకులైన ఆదివాసీల మధ్య ఆధిపత్య చిచ్చు రగిలించి వారి ప్రాణాలు ఆకుల్లా రాలిపోతుంటే ఈ రాజ్యం "తమాషా" చూస్తున్నది. ఇది పిల్లికి చెలగాటం – ఎలుకకు ప్రాణసంకటంలాంటిది. ఇదొక దారుణమైన అనుభవం. ఆ ఆదివాసీల అనుభవాలే మా అక్షరాలయ్యాయి. అడవే మాకు పాఠశాలయింది. వాళ్ళ జీవితాలే పలకలయ్యాయి. మోడువారుతున్న వారి కన్నీటి జీవనగాథలే ఒక్కొక్క పుటగా విస్తరించింది. పదండి... చదువుదాం, తెలుసుకుందాం, ఆలోచిద్దాం. ఆ అడవి బిడ్డల జీవితాల్లోని అంధకారాన్ని తొలగిద్దాం. అందుకు సభ్యసమాజ పౌరునిగా స్పందిద్దాం.

**ఎం. ఎం. రహమాన్**

పుస్తక రచయిత

ఇది కథయో కల్పితమో కానేకాదు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో టివి-5, ABN ఆంధ్రజ్యోతి తరఫున మేము జరిపిన, గడిపిన పర్యటనలో కన్నవి, విన్నవి మాత్రమే.

ప్రాణాలకు తెగించి దండకారణ్యంలో జరుగుతున్న దారుణాలను ప్రజలముందుంచే ప్రయత్నం.

సల్వాజుడుం పేరుతో గొత్తికోయల జాతి నిర్మూలనకు జరుగుతున్న ప్రయత్నాలను, మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో నడుస్తోన్న జనతన సర్కార్‌పై టివి-5లో ప్రసారమైన సల్వా'జులుం', అడవిలో యుద్ధం, బందూకు బాల్యం, యుద్ధం... యుద్ధం, ఆదిమానవుడు, ABN ఆంధ్రజ్యోతిలో 'ఆపరేషన్ అబూజ్‌మాడ్' బ్యాంగ్‌లతో ప్రసారమైన వరుస కథనాలకు అక్షర రూపమే ఈ పుస్తకం.

దండకారణ్యంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను కెమెరాల్లో పట్టి ఆ దృశ్యాలను బయటి ప్రపంచానికి చూపించాలనేది మా యాత్ర అసలు ఉద్దేశం.

సల్వాజుడుం పేరుతో సాగుతున్న అశాంతి, అరాచక యాత్రను బట్టబయలు చేసేందుకు సాగింది ఈ సాహస యాత్ర.

**2004 జూన్ 4 వ తేదీన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అంబేలీ, కార్‌ఖేలీ ప్రాంతంలో సల్వాజుడుంకు అంకురార్పణ జరిగింది. సల్వాజుడుం అంటే శాంతియాత్ర అని అర్థం. తునికాకు కార్మికుల హక్కుల కోసం, తునికాకు కూలీల రేట్ల పెంపుదలపై తలెత్తిన సమ్మె విషయంలో గుత్తేదారులకు మద్దతుగా నిలిచిన గిరిజనుల్లోని ఓ వర్గంతో సల్వాజుడుం ఏర్పడింది.**

తూర్పుదిక్కున సూర్యుడు తన డ్యూటీకి సిద్ధమయ్యాడు. గొత్తి కోయ గిరిజనులను కలిసేందుకు మేము అంబులెన్స్‌లో రహస్యంగా బయలుదేరాం. వాగులు, వంకలు దాటాం. అడవిలో వాహనం వెళ్ళేందుకు దారిలేదు. అది దట్టమైన అడవి కావడం వల్ల అక్కడి నుంచి కాలినడకనే బయలుదేరాం. గిరిజనులను సామాజిక కార్యకర్తలు, బయట వ్యక్తులు కలుసుకోకుండా గొత్తి కోయలుండే గూడానికి అనుసంధానంగా ఉన్న చిన్నచిన్న రోడ్లను ఫారెస్ట్ అధికారులు తవ్వేశారు. వారు వేసుకున్న జొన్నపంటను పశువులను దింపి మేపేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను మాకు స్వచ్ఛంద కార్యకర్తలు చూపెడుతూ ఆ విషయాలు ముచ్చటిస్తూ ముందుకు సాగుతున్నాం.

చలికాలం కావడం వల్ల అడవిలో రాలిన ఆకులపై మంచు కురిసి తడిగా ఉంది. బుర్రలో వర్క్‌ప్లానింగ్ తాలూకు ఆలోచనలు తిరుగుతూ ఉన్నాయి. అక్కడ ఎలా మసలు కోవాలి, ఏం చేయాలన్న విషయాలపై ఇంకా ప్లాన్ లేదు. మనసులో ఏం చేయబోతున్నామో ఒకసారి చర్చించుకోవాలన్న ఆలోచన తడుతోంది. సామాజిక కార్యకర్తలతో సమాలోచనలు మొదలెట్టాం. అక్కడికి వెళ్ళిన తర్వాత... అంటూ ఆగాం. "మీరు మీడియా అని అసలు చెప్పొద్దు" అన్నారు సామాజిక కార్యకర్తలు. గిరిజనులు ఎవరికీ అంత తొందరగా దగ్గరవ్వరు అని వారన్నారు. కెమెరాలు, రికార్డింగ్ ముందే మొదలు పెడితే వాళ్ళు ఇంకో రకంగా అనుకునే అవకాశం ఉందని మేం కూడా మనసులో అనుకున్నాం. ఎందుకైనా మంచిది చిన్న వీడియో కెమెరా కర్చీఫ్‌లో చుట్టిపెట్టుకో, కెమెరా ఆటోలో పెట్టి రికార్డు చేయమని కెమెరామెన్‌తో అన్నాను. అలానే సిద్ధం చేసుకున్నాడు. రహస్య చిత్రీకరణ ఎందుకు? అక్కడికి వెళ్ళిన తర్వాత చూద్దాం అనుకుని ప్రయాణం సాగించాం. సామాజిక కార్యకర్తలకు

**సల్వాజుడుం మావోయిస్టు ఉద్యమానికి వ్యతిరేకంగా ప్రభుత్వం యేర్పాటు చేసిన ఓ ప్రైవేటు సమూహం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొంట, ఎర్రబోరు, యింజారం తదితర ప్రాంతాల్లో మావోయిస్టు ఉద్యమకారుల ఏరివేతే లక్ష్యంగా కాన్సంట్రేషన్ క్యాంప్‌లు ఏర్పాటయ్యాయి. వీటిని ప్రభుత్వం బేస్ క్యాంపులుగా ప్రకటించుకుంది.**

అడవిలో నడవటం అలవాటైపోయింది. వారి నడకను అందుకోవడానికి కాస్త పరుగెత్తినట్టుగా నడవాల్సి వచ్చింది. ఉదయం మొదలైన నడక దాదాపు మధ్యాహ్నమైంది. అల్లంత దూరంలో మనుషుల అలికిడిలా అనిపించింది. చెట్ల మధ్యలో నుంచి విల్లంబులు ధరించిన గిరిజనులు మాకు కనిపించారు. సామాజిక కార్యకర్తలు చప్పట్లు కొట్టి కోయ భాషలో వారిని పిలిచారు. వీరిని గుర్తుపట్టిన వారు కూడా ఎదురుగా వచ్చి మందులున్న అట్టపెట్టెల్ని, పండ్ల సంచుల్ని అందుకుని మాతోపాటు నడవసాగారు. కోయ భాషలో వారేదో మాట్లాడుకుంటుండగా మాకేమీ అర్థం కాలేదు. వారితోపాటు మేం కూడా వడివడిగా నడుస్తున్నాం. అడవిలో ఓ రెండు మలుపులు తిరిగాక చిన్నచిన్న పూరి గుడిసెలు కనిపించాయి. అక్కడికి చేరుకున్నాం. గూడెంలోని వారు ఓ చెట్టుకింద పోగయ్యారు. కొత్తగా వచ్చిన మా ముగ్గురిని అదోలా అనుమానంగా చూడసాగారు. ఒకింత కంగారు, అనుమానం వారి చూపుల్లో కనబడుతోంది.

ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం దాడులతో భీతిల్లిన గొత్తికోయలు రహస్యంగా ఆంధ్రా సరిహద్దు అడవుల్లోని గూడాల్లో తలదాచుకుంటున్నారు. మేం ఎవరన్నది వారికి ఇంకా చెప్పలేదు. చాలా మంది మలేరియా జ్వరాలతో బాధపడుతున్నారు. మేం ఎవరో తెలియక కోయ భాషలో గిరిజనులు వారిలోవారు చర్చించుకుంటున్నారు. జుడుం, పోలీసు అనే పదాలు మాత్రం అర్థమయ్యాయి. మిగతా భాష అర్థం కాలేదు.

జ్వరంతో బాధపడుతున్న వారికి మీరు చికిత్స చేయండి, మేం మంచంపై కూర్చుంటామని వెదురుతో అల్లిన మంచంపై మేం కూర్చున్నాం. స్వచ్ఛంద కార్యకర్తలు ఇంజక్షన్లు, మందులు ఇస్తూ చికిత్స చేసే పనిలో నిమగ్నమయ్యారు.

**"విభజించు, పాలించు" అన్న బ్రిటిష్ పాలకులు వదిలివెళ్లిన పాలనా తంత్రాన్నే ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోంది. అడవిలో ఉన్న గొత్తికోయలు, కోయల్ని విభజించి, గొత్తికోయ జాతి నిర్మూలనకు కోయల్ని చేరదీసి తుపాకులు అందజేసి యుద్ధాన్ని ప్రకటించింది. ఎస్‌పివోల పేరుతో సల్వాజుడుం కార్యకర్తలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సాయుధులుగా సంచరిస్తూ ప్రైవేట్ లైసెన్డ్ ఫోర్స్‌గా సంచరిస్తారు.**

గూడెం పెద్దను పటేల్‌గా పిలుస్తారు. మీరెవరు అన్నట్టుగా పటేల్ మమ్మల్ని ప్రశ్నించాడు. ఎక్కువసేపు అనుమానితులుగా ఉండటం మంచిది కాదని నాకనిపించింది. ఇక చెప్పేద్దామని అన్నాను. మిత్రుడు కూడా చెప్పడమే మంచిదనడంతో వెంటనే పత్రకార్ అని అన్నాం. కెమెరా బయటికి తీసి చూపెట్టాం. పటేల్‌కు ఏదో పెద్ద అనుమానం నివృత్తి అయినట్టుగా ఆయన ముఖంలో ఓ వెలుగు కనిపించింది. ఈ విషయాన్ని గబగబా నడుచుకుంటూ చెట్టుకింద పోగైన గిరిజనులకు చెప్పేశాడు. కొందరు యువకులు, వృద్ధులు మావద్దకు చేరుకున్నారు. అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాం. మంచినీళ్ళు తాగాం. చాలా మందికి ఒంటిపై బట్టలు లేవు. ఒకరిద్దరికి హిందీ వచ్చు. మిగిలిన వారికీ కోయ భాష తప్ప మరే భాషా రాదు. నిజంగానే శరణార్థి బతుకులు. సొంత రాష్ట్రంలో అడవితల్లి ఒడిలో స్వేచ్ఛగా తిరిగిన వీరు ఆంధ్రా సరిహద్దుల్లోని అడవుల్లో దాక్కుని బతకాల్సిన దుస్థితి. కెమెరా ఓపెన్‌గానే పట్టుకున్నాం. ఆంధ్రా నుంచి మిమ్మల్ని కలుసుకునేందుకే వచ్చామని చెప్పాక అందరూ తలూపి ఓ చిరునవ్వు నవ్వారు. కృతజ్ఞత తెలిపినట్లుగా ఉంది ఆ తలూపడం. గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేయవద్దనుకున్నాం. మాటల్లో పెట్టి సున్నితంగా విషయాలు రాబట్టాలనుకున్నాం. ఏం తింటున్నారు... ఎలా బతుకుతున్నారో తెలుసుకున్నాం. అలా ఓ పదినిముషాలు గడిచాక సల్వా జుడుం గురించి అడగ్గానే ఒక్కసారిగా వారి ముఖంలో భయం కనిపించింది. ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. కొందరు లేచి పక్కకు వెళ్ళిపోయారు. కొందరేమో మాట్లాడలేదు. మేం కూడా సంభాషణ ఆపేశాం. అలా గుడిసెలను పరిశీలనగా చూసినట్టూ ఏదేదో నటించాం. పోడు వ్యవసాయం గురించి అడిగి ఏయే పంటలు పండిస్తారో మళ్ళీ మాటలు కలిపాం.

**ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న అడవిని దండకారణ్యం అని పిలుస్తారు. ఇందులో 10 కోట్ల మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఇది ప్రత్యేక రాష్ట్ర డిమాండుగా అప్పట్లో ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆ డిమాండు పెద్దగా లేదు. ఈ 10 కోట్ల మంది గిరిజనులు సూర్యుని వెలుతురు, ప్రకృతి అందించే ఫలాలు తప్ప ఏ ప్రభుత్వమూ వీరి దరి చేరలేదు. ప్రభుత్వం అంటే వీరికి తెలిసింది మావోయిస్టు పార్టీయే.**

ఇంతలో స్వచ్ఛంద కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. జుడుం అఘాయిత్యాలు మీరు చెప్పాలి. లేకపోతే అంత దూరం నుంచి వచ్చిన వారికి ఏం తెలుస్తుంది అని కోయ భాషలో వారికి ధైర్యం నూరిపోశాడు. అయినా ఒకరి ముఖాలు మరొకరు చూసుకుంటున్నారే తప్ప పెదవి విప్పడం లేదు.




**సల్వాజుడుం దాడులతో భీతిల్లి అజ్ఞాత జీవితాలు గడుపుతున్న గొత్తికోయలు**

**దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ ప్రాంతంలో ఎక్కువగా కోయ, గొత్తికోయలు నివసిస్తున్నారు. కోయలు పోడు వ్యవసాయం చేస్తారు. కోయల్ని ఈ ప్రాంతంలో 'దొర్లు'గా పిలుస్తారు. కోయదొరల దగ్గర వ్యవసాయ కూలీలుగా గొత్తికోయలు పనిచేస్తారు. గొత్తులు అణగారిన వర్గం.**

కోయ భాషలో సామాజిక కార్యకర్తలు చాలా సేపు మాట్లాడాక, పటేల్ షరతు విధించాడు. అయితే తామెక్కడ ఉంటున్నదీ చెప్పకుండా, ముఖాలు చూపెట్టకుండా అయితే సరేనన్నాడు. ఒక్కసారిగా వారి ముఖకవళికలు మారిపోయాయి. వారిలోని ఉద్వేగం, కోపం, ఆవేశం, బాధ, హృదయపొరల్లో దాగి ఉన్న ఆవేదన ఉప్పొంగాయి. వారి కష్టాలు వారి మాటల్లోనే... "అడవిలో పోడు వ్యవసాయం చేస్తూ గొడ్డూగోదా, పిల్లాపాపలతో సుఖంగా బతికేవాళ్ళం. సల్వాజుడుం యేర్పాటు తర్వాత మా బతుకు ఛిద్రమైంది. అర్ధరాత్రి వేళ మా గుడిసెలవైపు ఓ గుంపు దూసుకొచ్చింది. మమ్మల్ని పోగుచేశారు. యువకుల్ని ఓ వైపూ, యువతుల్ని మరోవైపూ, వృద్ధుల్ని ఇంకో గుంపుగా



**'జుడుం' గృహదహనాలకు పాల్పడటంతో అజ్ఞాతంగా అడవిలో కొత్తగా గుడిసెలు వేసుకుంటున్న గొత్తికోయలు**

**సల్వాజుడుంలో మావోయిస్టులను వ్యతిరేకించేవారు ఎవరైనా చేరొచ్చు. రూ. 1500 ల వేతనం, .303 రైఫిల్ యిస్తారు. ఉచిత భోజనం, వసతి. నాగా, మిజో సిఆర్‌పిఎఫ్ పారా మిలటరీ బలగాల్ని మావోయిస్టు ఏరివేతలో వాడుతుండగా, మావోయిస్టు ప్రజా సంఘాల్లో పనిచేసేవారిని, గొత్తికోయల్ని లక్ష్యంగా చేసుకొని సల్వాజుడుం పనిచేస్తోంది.**

వేరుచేశారు. మా కండ్ల ముందే మా గుడిసెల్ని తగులబెట్టారు. అందులో యాడాదికి సరిపడా తిండి గింజలు మా కళ్ళముందే కాలిపోయాయి. మేకలు, ఆవులు అగ్నికి ఆహుతయ్యాయి. సంఘాలని చూసే నాయకుని పేరు చెప్పమనీ ఇష్టమొచ్చినట్లు బూతులు తిడుతూ, కర్రలతో కొట్టారు. అప్పుడు ఆ నేత (బాబు) మామధ్యే ఉన్నాడు కానీ మేం పేరు చెప్పలేదు. తెల్లవారుజామున మాలో కొందరిని 'జుడుం' క్యాంపుల వైపు తీసుకెళ్ళారు. అందులోంచి మేము కొందరం తప్పించుకొని పారిపోయివచ్చాం. అలా పారిపోయిన మేము మావాళ్ళు ఏమైనా కలుస్తారేమోనని గూడెంలోకి వెళ్ళి చూశాము. మొండి గోడలు, చనిపోయిన మేకలు తప్ప మాకు ఏమీ అక్కడ కనిపించలేదు. బంధువుల ఇళ్ళకు వెళ్ళి కనుక్కున్నాము. అక్కడా వారి జాడ లేదు. మా బాబాయి, మా పెద్దన్న, మా తమ్ముని్న 'జుడుం' మూకలు చంపి శబరి నదిలో పడేసినట్లు తెలిసింది. మా గూడెంలోంచి తీసుకెళ్ళిన యువతుల్ని 'జుడుం' నేతలు పాడుచేస్తున్నట్టు తెలుస్తోంది. మా వారికోసం తిరుగని చోటు లేదు. బతికుంటే ఎక్కడోచోట కలిసేవాళ్ళం. క్యాంపులో కూడా వాళ్ళు లేరని తెలియడంతో చనిపోయే ఉంటారు. అయినా మేము ఏదో రోజు అంటే 'జుడుం' క్యాంపులు ఎత్తివేసిన తరువాత మా అడవుల్లోకి మేము వెళ్ళిపోతాం అక్కడే మా బతుకుదెరువు. ఇక్కడేముంది? ఆకులు, అలములు తిని రహస్య జీవితం గుడుపుతున్నా"మంటూ వారు ఒక్కో బాధ, గాథల్ని చెబుతుంటే మా గుండెలు చెరువులయ్యాయి.

అక్కడి నుంచి వారివద్ద సెలవు తీసుకుని ఆంధ్రా సరిహద్దుల్లోనే ఉన్న అడవుల్లోని మరో గూడానికి బయలు దేరాం. మళ్ళీ అవే దారులు. గతుకుల ప్రయాణం. మార్షల్ అంబులెన్స్ ద్వారా వెళ్ళాం. అడవి మధ్యన నరికిన చెట్ల మొదళ్ళు పెద్దవిగా ఉండటం

**సల్వాజుడుంలోని ఎస్‌పిఓల గురించి ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ సాయుధ పోరాట కాలంలో రజాకార్లతో పోల్చవచ్చు. హత్యలు, అత్యాచారాలు, గృహదహనాలు ఏది చేసినా అడిగేవారు ఉండరు. గూండాయిజానికి, రౌడీయిజానికి ఇదో లైసెన్సు.**

చేత వాహనం వెళ్ళలేకపోయింది. అందుకని రెండు కిలోమీటర్లు కాలినడకన ప్రయాణం సాగించాం. అప్పుడు కొన్ని పూరిళ్ళు కనిపించాయి. కానీ జనం కనిపించ లేదు. పరిశీలనగా చూశాం. ఎవరూ కనిపించలేదు. అడవితల్లి ప్రశాంతంగా ఉంది. ఇళ్ళలో వస్తువులేమైనా ఉన్నాయా అని వెళ్ళి చూశాం. అంతా ఖాళీ. ఖాళీ చేసి వెళ్ళిపోయారని ఓ నిర్ణయానికి వచ్చాం. ఆ అడవిలో వారిని వెతికి పట్టుకోవడం అయ్యేపని కాదని సామాజిక కార్యకర్తలన్నారు. ఇక చేసేదేముందని నిరాశగా వెను దిరిగే ప్రయత్నం చేస్తుండగా, ఇంతలో చాలా దూరంలో ఓ మనిషి, పాప వెళ్ళడం చూశాం. గట్టిగా విజిల్ వేస్తే అతను ఆగాడు. కోయ భాషలో సామాజిక కార్యకర్తలు పిలువగా అతను వెనుదిరిగి మావైపు వచ్చాడు. ఇక్కడి వారంతా ఎక్కడికి వెళ్ళారని అడిగితే ఏమీ మాట్లాడకుండా అందర్నీ కళ్ళతో నఖశిఖ పర్యంతం పరిశీలించాడు. మా వెనకాలున్న కొందర్ని గుర్తుపట్టాక, 'నేను తీసుకెళ్తాను. కాని చాలా దూరం ఉంది వస్తారా?' అని అన్నాడు. 'వచ్చిందే మీకోసం. వాహనంలో వెళ్ళొచ్చా?' అని అడిగితే 'సగం దూరం దాకా వెళ్ళొచ్చు' అన్నాడు. తిరిగి వాహనం వైపు నడిచాం. చిన్నపాపతో కలిసి అతను మావైపు వచ్చాడు. డ్రైవర్ అంబులెన్స్ స్టార్ట్ చేశాడు. వాహనంలో ఎక్కిన పాప కోయ భాషలో అరుస్తూ బిగ్గరగా ఏడవటం మొదలు పెట్టింది. 'డొల్లంతనే డొల్లంతనే' అని కోయ భాషలో అరుస్తుంది. డొల్లంతనే అంటే ఏమిటని సామాజిక కార్యకర్తలను అడిగాను. వారు నవ్వుతూ 'నన్ను చంపేస్తారు' 'నేను చనిపోతా' అని అర్థమని చెప్పారు. వాహనంలో అందరం ఒక్కసారిగా నవ్వాం. ఎందుకు నవ్వామో తెలియక ఓక్షణం ఏడుపు ఆపి మావైపు అమాయకంగా ఆ పాప చూడసాగింది. చేయి పట్టుకుని చూస్తే గజగజ వణుకుతోంది. ఆధునిక మనుషుల్ని చూడటం, వాహనంలో ఎక్కడం ఇదే మొదటిసారి అని ఆ గిరిజనులు చెప్పారు. ఎలాగో అలా కొత్త గూడానికి చేరుకున్నాం. సగం మంది గిరిజనులు జ్వరంతో మంచం పట్టారు. చాలా మందికి మాట్లాడే ఓపిక కూడా లేదు. అడవుల్లో

**దండకారణ్యంలో 100 శాతం గొత్తికోయలు, 60 శాతం కోయలు మావోయిస్టుల పక్షం ఉండగా 20 శాతం వరకు కోయలు సల్వాజుడుంలో చేరగా మరో 20 శాతం కోయలు తటస్థంగా ఉన్నారు. అలాగే ఉద్యమ ప్రభావం లేని ప్రాంతంలోంచి గొత్తికోయలు కోయ జాతీయులకు లక్ష్యంగా మారడంతో పుట్టకొకరు చెట్టుకొకరుగా పారిపోయి శరణార్థులుగా బతుకుతున్నారు.**

దొరికే ఆకులు, అలములు తిని జీవిస్తున్నారు. నిజంగానే వీళ్ళూ మనుషులే కదా... ఏంటీ జీవితం అని చర్చించుకున్నాం. వారికి మందులు ఇచ్చారు. గూడెంలో చీకటి అలుముకుంటోంది. అడవిలో దొరికే ఎండిన మొద్దుల్ని ఒకచోట వేసి నిప్పు పెట్టారు. ఈ వెలుతురులోనే రాత్రులు గడుపుతారు. వారికి తెలిసిన వీధి దీపమది. వీరిక్కడున్న విషయం బయటి ప్రపంచానికి తెలియకూడదని అజ్ఞాత జీవితం గడుపుతున్నారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సల్వాజుడుం దాడులతో భీతిల్లి వీరిక్కడ తలదాచుకుంటున్నారు. సల్వాజుడుం వేటాడి వెంటాడి చంపడం కారణంగా వారు రహస్యంగా బతకదలిచారు. గొత్తి కోయ జాతిని నిర్మూలించాలనేది సల్వాజుడుం లక్ష్యం. విషజ్వరాలు, మలేరియా బారినపడి చాలా మంది చనిపోయినట్లు విన్నాం. ఇంకా చాలామంది చావుకు దగ్గరవుతున్నట్టు ఈ గూడెంలో కనిపించారు. ఈ గూడెంలో వీరి అవస్థలు చూశాక కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చాలా చోట్ల ఇలా తలదాచుకుంటున్న గొత్తి కోయల్ని వేటాడి, వెంటాడి మరీ చంపినట్లు, గొంతులు కోయడం, సజీవ దహనాలు, అత్యాచారాలులాంటి సంఘటనల తాలూకు చేదు జ్ఞాపకాలు వారిని ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. పామున్న ఇంట్లో పడుకున్న చందంగా వీరి బతుకు కనబడుతోంది. జుడుం అరాచకాలు వీరిని నిద్రలో కూడా వెంటాడుతూనే ఉన్నాయి. వారి వేదన అరణ్య రోదన. పుట్టలో చీమలు ఎన్ని చచ్చినా ... బతికినా ఏ లెక్కల్లో చేరుతాయో, వీరూ అదే లెక్కల్లో చేరారు. చీకటి సమయంలో తిరుగు ప్రయాణం. బరువెక్కిన హృదయాలు, బుర్రను తొలుస్తున్న అనేక ప్రశ్నలు. ఆ రోజు అలా గడిచిపోయింది.

మరుసటిరోజు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సమీపంలో ఉన్న ఖమ్మం జిల్లా సరిహద్దుల్లో ఉన్న మరో గూడానికి వెళ్ళాం. ఇక్కడి పరిస్థితిని చూస్తే కడుపు తరుక్కుపోతుంది.

**యుద్ధంలో ఏ పక్షం వహించని 20 నుంచి 40 వేల మంది గొత్తికోయలు నిరాశ్రులయ్యారు. యుద్ధంలో ఏ పక్షం వహించక పోవడం కూడా ఇక్కడ నేరంగా మారింది. వీరిలో చాలా మంది అనారోగ్యంతో ఆకలిచావుల బారినపడ్డారు. వీరి పిల్లలు పౌష్టికాహార లోపం కారణంగా బానపొట్టలతో, వృద్ధుల్లాగా మారిపోయారు. ముడతలు పడ్డ దేహంతో సోమాలియా, సౌతాఫ్రికాల్లో ఉండే పిల్లల్ని తలపింపచేలా వీరు కనబడుతారు.**



**పౌష్టికాహార లోపంతో చావుకు దగ్గరౌతున్న ఓ గొత్తికోయ పసి బాలుడు**

చాలామంది పిల్లలు చనిపోయారు. ఇంకా ఎంతో మంది మృత్యుముఖంలో ఉన్నట్టు కనిపించింది. ఇక్కడి పరిస్థితి గమనిస్తే సల్వాజుడుం అనే ఓ రాక్షస బల్లి ఈ అడవి బిడ్డల్ని నమిలి మింగేస్తుందా? అని అనిపిస్తుంది. దక్షిణాఫ్రికా, సోమాలియాలో ఉన్నట్టు మాకు అనిపించింది. పసిపిల్లలు వృద్ధుల్లా కనిపిస్తున్నారు. కాళ్ళు, చేతులు, చర్మం ముడతలు పడి సన్నబడ్డాయి. అందరికీ బానపొట్టలే. పసిప్రాయంలోనే


కాళ్ళు చేతులు సన్నబడి ముడతలు పడ్డ దేహంతో రాలిపోవడానికి సిద్ధమైన పసి ఆకులు

వృద్ధులుగా మారిపోయారు. వారికిక మందులు పని చేయవు. తిండిలేని రోగానికి తిండే వైద్యం మరి. పౌష్టికాహార లోపంతో రాలిపోతున్న ఈ పసిమొగ్గలు స్త్రీ, శిశు సంక్షేమశాఖ లెక్కల్లో లేరు. అడవి తల్లి ఒడిలో రాలుతున్న లేత ఆకులు వారు. పండుటాకు రాలితేనే గొల్లున ఏడ్చే ఏ తల్లయినా... లేత ఆకులే తమ కళ్ళముందు రాలుతుంటే ఇక వారి గుండెకోత గురించి చెప్పేదేముంది... వర్ణనాతీతం. రాలిపోయే దశలో ఉన్న కొన్ని పసి సుమాలు మా గుండెల్ని పిండాయి. మాముందే కొన్ని పసి సుమాలు రాలిపోయాయి. ఆ దృశ్యాలు చూసిన ఎవరైనా చలించక మానరు. గిరిపుత్రుల బిడ్డలకు ఇలా నూరేళ్ళూ నిండిపోతుంటే ఎవరిని శపించాలో, ఏమని శపించాలో తెలియక తలపట్టుకుంటున్నారు ఆ అమాయకులు. ఏడ్చీ ఏడ్చీ వారి కళ్ళల్లో నీరు ఇంకిపోయింది. వారూ మన భావిభారత పౌరులే... భరతమాత కన్నబిడ్డలే... మహేంద్రకర్మ శాంతియాత్ర ఫలితమిది. ఆ శాంతియాత్రలో పెద్దోళ్ళ కాళ్ళకింద పడి నలిగిపోతున్నది అక్షరాలా పసిపిల్లలే.



బానపొట్టలతో తిండిలేని రోగంతో తల్లడిల్లుతోన్న అడవి బిడ్డల బాల్యం



అస్థిపంజరంకాదు...

పాలబుగ్గల వయసులో, ముడతలుబారిన దేహంపై మృత్యువు నర్తిస్తోంది. చిరుప్రాయంలోనే నూరేళ్ళూ నిండిన అభాగ్యులు, అనాథలు వారు. సుజలాం... సుఫలాం... సస్యశ్యామలాం... అని మనం గర్వంగా గొంతెత్తి పాడుకునే ఈ దేశంలోనే ఈ దుస్థితి. మనసున్న మనిషి ఎవరైనా ఓ రెండు కన్నీటి బొట్లు రాల్చక మానడు.

తర్వాత గూడానికి వెళ్ళేముందు ఓ ఊరి గుండా వెళ్ళి కొన్ని పండ్లు, ఫలాలు తీసుకువెళతామని అనుకున్నాం. ఒక గెల అరటిపండ్లు, మరికొన్ని ఇతర పండ్లు తీసుకుని వెళ్ళాం. అక్కడి పిల్లల పరిస్థితీ అదే. చాలా మంది పిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత, పేలవమైన శరీరం, కాంతిలేని కళ్ళు, దేహమంతా ముడతలు. ఈ గూడెంలో కూడా అవే రొటీన్ సీన్స్. మా దగ్గరున్న పండ్లు పిల్లలకు ఇచ్చాం. ఈ పిల్లలు నీ పిల్లలే అయితే ఎలా ఉంటుందో ఊహించుకొమ్మని మాలోని మనిషి ప్రశ్నించాడు. మా ప్రమేయం లేకుండా కళ్ళలో నిండిన నీరు బొట్లుబొట్లుగా రాలుతున్నాయి. కెమెరామెన్ వైపు చూసినప్పుడు వళ్ళు జలదరిస్తున్నట్లుగా తన శరీరాన్ని ఒక్కసారిగా ఊపాడు. ఎవరి కోసం జుడుం... ఎందుకోసం ఈ జులుం... గూడాల్ని శ్మశాన వాటికలు చేసి ఎవర్ని వీరు ఏలుకునేది? గొత్తికోయ జాతిలో పుట్టడమే వీరి చేసిన తప్పా?

**మావోయిస్టు ఉద్యమం ఉత్తర తెలంగాణ నుంచి దండకారణ్యంలో అడుగిడిన తర్వాత కోయలతో పాటు అడవిలో మెజారిటీ వర్గం అయిన గొత్తికోయలకు కూడా హక్కులు కల్పించారు. పోడు వ్యవసాయం గొత్తికోయలకు నేర్పించారు. దొరలు, సేవకులు అన్న తేడాపై నిషేధాన్ని ప్రకటించారు. అడవిపై ఆధిపత్యం ఉన్న కోయల్లో కొంతమందికి ఈ చర్య కంటగింపుగా మారింది.**

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రాజ్యం నడుపుతున్న సల్వాజుడుం చిచ్చు కారణంగా ఆదివాసులు రెండు గ్రూపులుగా విడిపోయారు. కోయజాతిలో కొందరిని చేరదీసి వారికి తుపాకులిచ్చి ప్రైవేటు ఫోర్స్‌గా తయారుచేసి గొత్తులపైకి ఎగదోశారు. గొత్తి కోయలు మావోయిస్ట్‌ల పక్షం వహిస్తున్నారు. యుద్ధంలో ఏ పక్షం వహించని కొందరు గొత్తికోయలు ఇలా శరణార్థులుగా మారిపోయారు. యుద్ధంలో ఏ పక్షం వహించక పోవడం కూడా పాపమైతే అంతకంటే దౌర్భాగ్యం మరొకటుంటుందా? ఇలా దాదాపుగా 20 గూడాల వరకు తిరిగాం. 20 నుంచి 40వేల వరకు గొత్తి కోయ గిరిజనులు శరణార్థులుగా మారిపోయారు. అన్నీ వదులుకొని, కట్టుబట్టలు కూడా వదలుకొని పక్షుల్లా తిరుగుతున్నారు. అలాగే ఒకటి రెండు గూడాల్లో మావోయిస్ట్ దళాలు తిరుగుతున్నట్టు తెలుసుకున్నాం. ఆ గూడాల్లోకి స్వచ్ఛంద కార్యకర్తలనుగానీ, కొత్తవారినిగానీ గిరిజనులు రానివ్వడం లేదు. మరికొన్ని చోట్ల గొత్తికోయలు స్థిరపడకూడదని స్థానిక అడవుల్లో ఉన్న కోయలు వీరి ఇళ్ళను తగులబెట్టినట్లు తెలిసింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎవరికీ పట్టని బతుకులు ఏ పక్షమూ వహించని గొత్తి కోయలవి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో శరణార్థులుగా మారిన కోయజాతీయులకు అక్కడి రమణ్‌సింగ్ ప్రభుత్వం బేస్ క్యాంపులను ఏర్పాటు చేసి రేషన్‌తోపాటు సకల సౌకర్యాలు కల్పిస్తుండగా, బేస్ క్యాంపుల్లో ఒక్క గొత్తి కోయ కూడా లేకపోవడం చూస్తే ఆ జాతి నిర్మూలన కోసం ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టుగా కనబడుతోంది. గొత్తి కోయల్లో మెజారిటీ వర్గం మావోయిస్ట్ పక్షం వహిస్తున్నారన్న సాకుతో మొత్తం గొత్తి కోయ జాతిపైనే ప్రభుత్వం కత్తిగట్టినట్టుగా మనకు అవగతమవుతోంది. దీంతో గొత్తి కోయలు పుట్టకొకరు, చెట్టుకొకరుగా బతుకుతున్నారు. ఏ గూడెంలో తిరిగినా అవే దృశ్యాలు, అవే బాధలు, అవే గాథలు, అవే కష్టాలు, అవే కన్నీళ్ళు...

ఇక మీ పర్యటన ముగిస్తారా? అని సామాజిక కార్యకర్తలు అడగగా, లేదు మేం బేస్‌క్యాంపులు చూస్తాం అని చెప్పాం. బేస్‌క్యాంపులకు వెళ్ళడం ప్రమాదమని అందరూ వారించారు. మేం వినలేదు. క్యాంపులకు ఎలా వెళ్ళాలి అని ఆలోచించాం. బేస్ క్యాంపులుండేది సల్వాజుడుం పోలీసు కంట్రోల్లోనే కదా... ఖమ్మం ఎస్పీ డిఎస్ చౌహాన్ నాకు మంచి మిత్రుడు. ఆయన ద్వారా బేస్ క్యాంపులు చూడొచ్చని అనుకున్నాను. వెంటనే ఎస్పీ చౌహాన్‌కు ఫోన్ చేశాను. ఆయన బాగా రిసీవ్ చేసుకున్నారు. వెంటనే మేమున్న ప్రాంతంలోని సిఐకి ఫోన్ చేసి చెప్పాడు. చింతూరు పోలీసు స్టేషన్‌కు వెళ్ళాం. సిఐ అత్యవసరంగా ఏదో డ్యూటీపై వెళ్ళారు. ఎస్ఐ రాజిరెడ్డి మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారు. ఎస్ఐ కరీంనగర్ వాసి. నాది కూడా కరీంనగర్ కావడంతో ప్రాంతీయ అభిమానం కొంత కలిసి వచ్చింది. మా సెల్‌ఫోన్‌లో సిగ్నల్స్ రావడంలేదు. పోలీసు స్టేషన్ ఫోన్ నుంచే ఎస్పీకి ఫోన్ చేయబోతుండగా ఎస్ఐ కంగారుపడ్డారు. ఫర్వాలేదని చెప్పి ఫోన్ చేశాం. మేము ఇక్కడికి చేరుకున్న విషయం కూడా చెప్పాను. ఎస్ఐ రాజిరెడ్డి కొంట బేస్‌క్యాంపు ఎస్‌డిపివోకు ఫోన్ చేసి ఆంధ్రా జర్నలిస్టులు వస్తున్నారు అని చెప్పారు. అయితే బేస్ క్యాంపుల్లోకి జర్నలిస్టులను అనుమతించేది లేదని, దంతెవాడ కలెక్టర్ ద్వారా అనుమతి పత్రంతో రావాలని ఎస్‌డిపివో సమాధానం చెప్పాడు. వెంటనే మేం అలా వద్దు ఫోన్ కట్ చేయమన్నాం. అన్ అఫీషియల్‌గానే వెళ్ళేందుకు నిర్ణయించుకున్నాం. ఇంతవరకు బేస్ క్యాంపులకు అనుమతించిన చరిత్ర లేదు. ఏం జరిగితే అదే జరుగుతుంది. బేస్ క్యాంపులకు వెళ్ళడం చాలనుకున్నాం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఒక ప్రైవేటు వాహనాన్ని అద్దెకు తీసుకుని దానిపై 'టివి5' అని రాసిన స్టిక్కర్‌ను అంటించి బయలుదేరాం. మాతోపాటు కోయభాష తెలిసిన ఒక యువకుడిని వెంటబెట్టుకుని ప్రయాణం ఆరంభించాం. ఉదయం 7 గంటలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో బయలు దేరాం. ఆంధ్రా సరిహద్దు దాటగానే 'వెల్‌కం టు ఛత్తీస్‌గఢ్' అనే బోర్డ్ వద్ద ఆగి 'పి టు సి' చెప్పాను. వాహనం యజమాని కమ్ డ్రైవర్ జుడుం నాయకుడని తెలిసింది. ఇక జుడుం గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తపడాలని కూడా నిర్ణయించుకున్నాం. ముందు కొంట బేస్ క్యాంపుకు చేరుకున్నాం. కొంటలో ఉండే సల్వాజుడుం నాయకుడు సోయం మోకా, విజయ్‌లను కలవాలని బయలు దేరాం.




**వెల్‌కమ్ టు ఛత్తీస్‌గఢ్**

మేము ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాలుపెట్టినప్పటి నుంచీ ఏదో తెలియని ఆందోళన, భయం వెంటాడుతున్నాయి. అందరూ వారించారు. వెళ్ళు మంచి అడ్వంచర్ అని ఒక్కరు కూడా అనలేదు. బయలుదేరే ముందు మిత్రులు చెప్పిన మాటలు చెవుల్లో మారుమోగుతున్నాయి. పులి గుహల్లోకి అడుగుపెడుతున్నామనే భావన. పైకి చిరునవ్వు, లోపల సన్నని వణుకు. కొంట ప్రమాదకరమైన ప్రాంతం. ముందుగా సల్వాజుడం స్థానిక నేత సోయం ఇంటికి వెళ్ళాం. మోకా తండ్రి రెండు పర్యాయాలు కొంట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అతడిని మావోయిస్టులు కాల్చి చంపారు.



**సల్వాజుడుం కొంట నియోజకవర్గం నేత మోకాతో ముఖాముఖి**

జుడుం నేతలకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే క్వార్టర్లు ఇచ్చారు. మోకా ఇంటి వద్దకు చేరుకున్నాం. కెమెరా, 'టివి 5' లోగో బయటకు కనబడేలా పట్టుకున్నాం. అతని

అంగరక్షకులు ఇంటి బయట చూస్తున్నారు. సోయం మోకా ఇంట్లో ఉన్నాడు. విజిటింగ్ కార్డు పంపాం. లోపలి నుంచి సమాధానం వచ్చింది. మోకా తుపాకి శుభ్రం చేసుకుంటున్నాడు. కూర్చోమని బయట కుర్చీలు వేశారు. డబుల్ బ్యారల్ తుపాకీతో మోకా బయటకు వచ్చాడు. అయామ్ రహమాన్ ఫ్రమ్ టివి 5 అంటూ పరిచయం చేసుకున్నాం. మెల్లగా సంభాషణ మొదలుపెట్టాం. మోకా టీ తెప్పించాడు. తేనీరు సేవించాక కెమెరా ఆన్ చేసి కెమెరామెన్ రోల్ అన్నాడు. మోకాతో ఇంటర్వ్యూ మొదలు పెట్టాం.

ప్ర: జుడుంను ఎందుకు మొదలుపెట్టారు?

*జ: మేము గిరిజనుల సంక్షేమం కోసమే మొదలుపెట్టాం*

ప్ర: మీరు చంపుతున్నది కూడా గిరిజనులనే కదా?

*జ: యుద్ధం నడుస్తోంది. అటూ ఇటూ ఎవరో ఒకరు చస్తారు.*

ప్ర: ఇప్పటి వరకు ఎంత మందిని చంపారు?

*మోకా సమాధానం చెప్పక దాటవేశాడు.*

ప్ర: ఎప్పటి వరకు యుద్ధం జరుగుతుంది?

*జ: అడవుల్లోంచి మావోయిస్టులను తరిమివేసే వరకు.*

ప్ర: గొత్తి కోయలు కూడా గిరిజనులే, మీరూ కోయ జాతీయులు. మీకూ గొత్తికోయల మధ్య ఎందుకు ఘర్షణ మొదలైంది?

*జ: వారు మావోయిస్టుల పక్షం వహిస్తున్నారు.*

ఇలాంటి కొన్ని ప్రశ్నలతో కూడిన ఇంటర్వ్యూ రికార్డు చేశాం. తర్వాత కెమెరా వైండ్ అప్ చేశాక ఎర్రబోరు, మరాయిగూడెం, అబుజ్‌మాడ్ ఘటనలతో జుడుం భారీగా నష్టపోయిందని మోకా అందోళన వ్యక్తం చేశాడు. తన విజిటింగ్ కార్డులు తీసి ఇచ్చి, ఎప్పుడైనా వచ్చి కలవవచ్చన్నాడు. అతని దగ్గర సెలవు తీసుకుని మరో నేత విజయ్ దగ్గరకు వెళ్ళాం.

విజయ్ ఇంటి ముందు కొంతమంది ఉద్యోగులు వేచి ఉన్నారు. మేం విజయ్ దగ్గరకు వస్తున్నట్టు మోకా ద్వారా ముందుగానే అతనికి సమాచారం ఉంది. ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే విజయ్ తెలుగువాడు. 40 సంవత్సరాల క్రితం



సల్వాజుడుం నేత విజయ్‌తో ఇంటర్వ్యూ

వారి పూర్వీకులు ఆంధ్రా నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. విజయ్ తుపాకీతో బయటకు వచ్చాడు. బైఠియే అంటూ కుర్చీ చూపెట్టాడు. అధికారులతో హడావుడిగా మాట్లాడి పంపించేశాడు. అధికార భాజాపా కంటే సల్వాజుడుం ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల్లో మోస్ట్ పవర్‌ఫుల్. విజయ్ తెలుగువాడని తెలిసింది కదా! ఎందుకు వేరే భాషలో మాట్లాడటం అనుకుని తెలుగులోనే మాట్లాడటం ప్రారంభించాం.

నా పేరు రహమాన్ అని పరిచయం చేసుకోగానే తెలుగు వాళ్ళా అంటూ ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. రమేశ్ తనకు తనుగా పరిచయం చేసుకుని కూర్చున్నాడు. ఎన్ని సంవత్సరాల క్రితం ఇక్కడికి వచ్చిందీ తెలుసుకున్నాం. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే విజయ్ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నాడు. ఓ ఐడియా తళుక్కున మెరిసింది. ఆయన పని చేసే స్కూల్‌లోనే ఇంటర్వ్యూ చేస్తే బాగుంటుంది కదా! తుపాకి భజాన వేసుకుని పాఠాలు చెబుతుంటే ఇంటర్వ్యూ చేస్తే ఎలా ఉంటుందని అన్నాను. మిత్రుడు కూడా అద్భుతంగా ఉంటుందన్నాడు. విజయ్ మెల్లగా ఇపుడు యాంటీ జుడుం మొదలైనప్పటి నుంచి స్కూల్‌కు వెళ్ళడం లేదన్నాడు. సరే తుపాకీ గురించి అడిగాం. డబుల్ బ్యారెల్, రెండు తూటాలు పేల్చేస్తుంది. తూటాలు తీసి చూపించాడు.

ఇంటర్వ్యూ మొదలైంది.

ప్ర: అసలు ఎందుకు మీరు తుపాకీ పట్టారు?

*జ: మా బాబాయిని మావోయిస్ట్‌లు చంపేశారు. మావోయిస్ట్‌లు ఆధిపత్య పోరులో ఆయనను చంపేశారు. మా బాబాయి చనిపోయిన తర్వాత నేను టార్గెట్ అయ్యాను.*

ప్ర: ఎలా? ఎందుకు?

*జ: నేను గ్రామాన్ని అభివృద్ధి చేశాను. అందుకు టార్గెట్ చేశారు...*

ప్ర: అభివృద్ధికి ప్రభుత్వం ఉంది కదా?

*జ: అభివృద్ధి మావోయిస్టులకు ఇష్టం ఉండదు. అందుకే వారు నన్ను టార్గెట్‌ను చేశారు.*

ప్ర: వారి టార్గెట్లలో ఎవర్నీ వదల్లేదు. ప్రాణమంటే తీపి లేదా?

*జ: క్షణం ఆగి... ప్రాణాలకు తెగించి పోరాడుతున్నాం.*

ప్ర: ఛత్తీస్‌గఢ్‌లో గొత్తి కోయలు మావోయిస్ట్‌ల పక్షాన, కోయలు సల్వాజుడుంలో ఉన్నారు. మరి బిసి తెగకు చెందిన మీరు సల్వాజుడుంలో ఎందుకు చేరారు?

*జ: నిజంగానే ఇక్కడ కోయ, గొత్తి కోయ యుద్ధంగా చూపెడుతున్నారు. ఇది నిజం కాదు. మావోయిస్ట్‌ల ఊచకోత వల్ల పెద్ద సంఖ్యలో మేం చనిపోతున్నాం. అయినా పోరాడుతున్నాం.*

ఇంటర్వ్యూ ముగించాక మమ్మల్ని బేస్ క్యాంపుకు తీసుకు వెళ్ళమని కోరాం. సరే మీరు అక్కడికి వెళ్ళండి, మేం వస్తామన్నాడు. బేస్ క్యాంపులోకి బయటి వారిని అనుమతించరు. మీరు వెళ్ళడం మంచిది కాదన్నారు. అయినా బేస్ క్యాంపుకు బయలుదేరాం.

దగ్గరలో ఉన్న టీస్టాల్ వద్ద ఆగి టీ తాగాం. పరిసరాలను గమనిస్తున్నాం. కెమెరామెన్ హుషార్‌గా ఉన్నాడు. ప్రమాదం అంచున ఉన్నామని చెప్పలేదు. ధైర్యం కూడగట్టుకున్నాం. మూడు నిముషాల్లో ముగించుకుని బయటకు రావాలనుకున్నాం. ఎవరైనా ఒత్తిడి చేస్తే, ఇబ్బందులు ఎదురైతే విజయ్, మోకా పేర్లు చెబుదామనుకుని బయలు దేరాం. విజయ్‌కు ఒకసారి ఫోన్‌చేశాం. ఫోన్ ఆఫ్‌లో ఉంది. రీచ్ అవడం లేదు. ఇక ఆగడమెందుకని ముందుకు సాగాం.

మేము నవ్వుతూ చాలా పాత వ్యక్తుల్లా ప్యాంట్ జేబుల్లో చేతులు పెట్టుకుని బేస్ క్యాంపుల్లోకి వెళ్ళసాగాం. నాగా, మిజో పారామిలటరీ ఫోర్స్ అత్యాధునిక ఆయుధాలతో సెంట్రీ కాస్తున్నారు. వారి దగ్గరకి వెళ్ళి షేక్ హ్యాండ్ ఇచ్చి లోపలికి వెళ్ళాం. వారు అడ్డగించలేదు. చాలా ఫ్రీగా కెమెరా బయటకు కనబడేటట్లు పట్టుకుని తిరిగాం. చాలా తొందరగా పని ముగించుకుని బయటకు రావాలనే ఆతృత. కొంత



సల్వాజుడుం కొంట బేస్ క్యాంప్‌లోని కోయ జాతీయుడు

జుడుం నాయకుడు ఒకరు మోకాతో మాట్లాడినప్పుడు మమ్మల్ని చూసిన ఓ జుడుం నాయకుడు మమ్మల్ని గుర్తుపట్టాడు. అతని వెంట బేస్ క్యాంపులో ఇక తాపీగా తిరగవచ్చని అనుకున్నాం. గబగబా బైట్స్ తీసుకోవడం మొదలుపెట్టాం. మేం బేస్‌క్యాంపులో ప్రవేశించిన విషయం క్యాంపు ఉన్నత అధికారులకు తెలియదు. క్యాంపులో పెద్ద సంఖ్యలో గిరిజనులున్నట్లు రికార్డుల్లో ఉంది, మా లెక్కల ప్రకారం 5వేలకు మించి లేరు. అక్కడున్న వారు మావోయిస్టుల వ్యతిరేకులూ కాదు. మావోయిస్టులకు టార్గెట్‌లూ కారు. కోయలు, కోయ కుటుంబంలో జన్మించిన వారు. అనివార్యంగా నయానా, భయానా బేస్ క్యాంపులకు తరలించబడ్డారు. ఇక్కడ వారు ఉండేందుకు వీలుగా పెంకుటిళ్ళు నిర్మించారు. వీరు గొడ్డూగోదాతో ఇక్కడికి వచ్చారు. పరిస్థితులు చక్కబడితే తమ గ్రామాలకు వెళ్ళాలన్నది వీరి అభిమతం. కెమెరా ఆన్ చేసి బైట్లు తీసుకున్నాం. అడవిలో వారి గూడాలకు తిరిగి వెళ్ళిపోవాలన్నదే చాలా మంది అభిప్రాయం. వీరు ఎవరిపై ఆగ్రహావేశాలు ప్రదర్శించలేదు. తాము అయిష్టంగానే ఇక్కడుంటున్నట్లు చెబుతున్నారు. ఇక్కడ అందరూ గమనించాల్సిన విషయం ఒకటుంది. ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలో మెజార్టీ తెగకు చెందిన గొత్తికోయలు ఒక్కరు కూడా బేస్ క్యాంపుల్లో లేరు. బయటి ప్రపంచానికి తెలియని మరో విషయం జుడుం అంతా సాయుధ సమూహం కాదు. అతి తక్కువ మంది వద్ద మాత్రమే ఆయుధాలుంటాయి. వారిని స్పెషల్ పోలీసు ఆఫీసర్ (ఎస్‌పివో) అంటారు. వీరికి 1500 రూపాయల జీతం. ఇక్కడ మారాయిగూడెం బేస్ క్యాంపు ఇంచార్జీ పెంటూ మాకు పరిచయమయ్యాడు.

అక్కడ మాట్లాడిన వారిలో పెంటూలో కనిపించినంత ఆగ్రహావేశాలు మరెవరిలోనూ కనిపించలేదు. పెంటూ తన బాధ చెప్పుకోవడానికి తన ఇంటికి రావాల్సిందిగా కోరాడు. జుడుం బేస్ క్యాంపులో ఉన్న పెంకుటిళ్ళలో పెంటూ ఇల్లు ఒకటి. పెంటూ తండ్రిని మావోయిస్టులు టార్గెట్‌గా ప్రకటించి చంపేసినట్టుగా



**తుపాకిపై ప్రమాణం చేసి మాట్లాడుతోన్న పెంటూ**

పెంటూ మాతో చెప్పాడు. ఎందుకని ప్రశ్నిస్తే 'అడవిలో మేం ఓ మోస్తరు రైతులం. నేను ప్లస్ టు వరకు చదివాను. మావోయిస్ట్‌లు మా గూడానికి రానంత వరకు మేం చాలా బాగున్నాం. మా వద్ద గొత్తి కోయలు పనిచేసేవారు. వారికి తగు ప్రతిఫలం ఇచ్చేవాళ్ళం. నక్సల్ వాదులు మా గూడాలకు వచ్చిన తర్వాత గొత్తి కోయలను మా దగ్గర పని మాన్పించారు. వారిని అడవి నరకి పోడు వ్యవసాయానికి పురమాయించారు. వారు పనిమానివేయడంతో మేం ట్రాక్టర్ కొన్నాం. అడవి వ్యవసాయానికి ట్రాక్టర్లు ఉపయోగించరాదంటూ మావోయిస్ట్‌లు ఆంక్షలు విధించారు. ఎవరి వ్యవసాయం వారే చేయాలన్నారు. మేం దొర్లు (కోయ) తెగకు చెందిన వారం. తరతరాలుగా గొత్తికోయలు మాకు సహాయకులు. లేనిపోని మాటలతో గొత్తికోయలను రెచ్చగొట్టారు. కలిసి బతుకుతున్న కోయలు, గొత్తి కోయల మధ్య చిచ్చుపెట్టారు. ఎవరితో సంబంధం లేకుండా మేం ట్రాక్టర్‌తో వ్యవసాయం చేద్దామంటే ట్రాక్టర్లు పెట్టి అడవి దున్నకూడదన్నారు. మా ట్రాక్టర్ తగులబెట్టారు. తర్వాత మేం పోలీసులతో కలిసి పనిచేయడం మొదలుపెట్టి, జుడుంలో చేరాం. మా నాన్నను టార్గెట్‌గా ప్రకటించారు. ఇక మేం వెనకడుగు వేయవద్దని నిర్ణయించుకున్నాం'. 'గొత్తికోయలు వ్యవసాయం చేస్తే తప్పేంటి?' అని అంటే పెంటూ సమాధానంగా అడవిలో కట్టుబాట్లు ఉన్నాయన్నాడు. గొత్తి వారికి వ్యవసాయం రాదు. వారి వెంటపడి వ్యవసాయం చేయండి అని అంటే ఎలా? 'ఎలుక తోలు తోమితే తెలుపు అవుతుందా?' అన్నాడు. రమేశ్ జోక్యం చేసుకున్నాడు. మేం తెలంగాణా నుంచి వచ్చాం. అక్కడ కూడా మావోయిస్ట్‌లు జనంకోసం పని చేస్తారు. ఇక్కడ గిరిజనులు ఎందుకు వ్యతిరేకులయ్యారు? మావోయిస్ట్‌ల గురించి ప్రజలు తప్పుడు అభిప్రాయంతో లేరన్న వాదనకు దిగబోయాడు. నేను వారించాను.




**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో యేర్పాటైన బేస్ క్యాంపులు -**
**అందులో గొడ్డూగోదాతో నివసిస్తోన్న కోయలు**

మనం నీటిలో ఉన్నాం. మొసలితో ఫైట్ వద్దన్నాను. అతను కూడా సర్దుకున్నాడు. ఇక కెమెరా ఆన్ చేసి బైట్ కోసం మైక్ పెంటూ ముందుంచాను. పెంటూ ఆవేశంతో 303 రైఫిల్ అందుకుని రైఫిల్‌పై ప్రమాణం చేస్తూ నా తండ్రిని నక్సల్స్ వెంటాడి, వేటాడి చంపారు. అలా చంపిన వారిని అడవి నుంచి తరిమివేసి ఈ ప్రాంతంలో శాంతి నెలకొల్పే వరకూ తన తుపాకీ దించనని శపథం చేశాడు.

బేస్ క్యాంపును పెంటూతో కలిసి చూశాం. పెంటూ తండ్రి చనిపోయాక ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాతోపాటు తనకు ఉద్యోగం ఇస్తున్నట్లు ప్రకటిస్తూ ఆ మేరకు ఆర్డర్ కూడా ఇచ్చినట్లు చెప్పాడు. అయితే నువ్వు ప్రశాంత జీవితానికి వెళ్ళుతున్నావన్న మాట అని అన్నాను. పెంటూ ఒక్కసారిగా వెనుదిరిగి చూశాడు. నక్సల్స్‌ను అడవి నుంచి తరిమి వేయడం మా సంకల్పం, మహోన్నత ఆశయం. ఉద్యోగంలో చేరినా జుడుంలో కొనసాగుతానని స్పష్టం చేశాడు. అతని నరనరానా నక్సల్స్ వ్యతిరేకత జీర్ణించుకుని పోయినట్టు మాకర్థమైంది. పెంటూను వెంటబెట్టుకుని క్యాంపులోని వారితో మాట్లాడే ప్రయత్నం చేశాం. మావోయిస్టుల ఏ చర్యలు మీలో వ్యతిరేతకను పెంచాయని ప్రశ్నించినప్పుడు, చాలా మందిని ఇన్ఫార్మర్ల పేరుతో శిక్షించడం పట్ల విముఖత వ్యక్తం చేశారు. ఒక సంఘటన జరిగిన తర్వాత ఆ ఘటనకు సంబంధించిన



**రోడ్డుకు ఇరువైపులా సల్వాజుడుం కార్యకర్తలు 300 కిలోమీటర్ల మేర అడవిని నరికివేసిన దృశ్యం**

**సల్వాజుడుం అంటే మొత్తం సాయుధ సమూహం కాదు. స్పెషల్ పోలీసు ఆఫీసర్లు (ఎస్‌పివో)లు మాత్రమే సాయుధులు. వీరికి రూ. 1500 ల వేతనం ప్రభుత్వం చెల్లిస్తోంది. వీరి ఉద్యోగం పర్మినెంట్ కాదు. వారితో అవసరంలేదు అని అనిపించినప్పుడు ప్రభుత్వం ఎప్పుడైనా వారిని ఉద్యోగంలోంచి తొలగించవచ్చు. మావోయిస్టులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం యేర్పాటు చేసిన ఇదో మానవ కవచం.**

ఇన్‌ఫార్మర్ ఎవరన్న విషయాన్ని నిర్ధారించుకోవడంలో శాస్త్రీయ పద్ధతులు, హేతుబద్ధతను అనుసరించరని వారు విమర్శించారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు అనేక అనర్థాలకు దారితీస్తాయని వారన్నారు. అదికూడా నిజమేనేమో అనిపించింది. ఛత్తీస్‌గఢ్‌లో పామెడ ఎన్‌కౌంటర్ తర్వాత 17 మంది గిరిజనులను ఇన్‌ఫార్మర్లంటూ మావోయిస్ట్‌లు మట్టుబెట్టారు. వారిలో ఒక్కరో, ఇద్దరో ఇన్‌ఫార్మర్లు ఉండొచ్చుగానీ, మొత్తానికి మొత్తం ఇన్ఫార్మర్లుగా అనుకోలేం.

సక్సెస్‌ఫుల్‌గా కొంట బేస్‌క్యాంపులో తిరిగి వచ్చాం. ఆనందం అనిపించింది. అసలు సల్వాజుడుం ఏంటి? ఈ క్యాంపు ఏంటి? కెమెరామెన్‌కు బొత్తిగా అర్థం కాలేదు. ఇక్కడి నుంచి మరో క్యాంపు ఇంజారం బయలుదేరాం. క్యాంపు ముందు ఓ 'పి టు సి' చెప్పుకుందామని లోగోతో నిలబడగానే అప్పటికే సెంట్రీ మారి ఫోర్స్ హడావుడి చేసింది. ఎందుకొచ్చిన గొడవంటూ ఆ ప్రయత్నం విరమించుకుని ఇంజారం వైపు మా వాహనం వెళ్ళనిచ్చాం. అటవీప్రాంతం గుండా వాహన ప్రయాణం. దాదాపు 300 కిలోమీటర్ల వరకూ రోడ్డుకు ఇరువైపుల అడవి నరికేసి



**సల్వాజుడుం ఏర్పాటు చేసిన ఇంజారం చెక్‌పోస్టు ఇది. డబ్బులివ్వకపోతే చిదకబాదుతారంటున్న ట్రక్కు డ్రైవర్**

**ప్రధాన రహదారులపై సల్వాజుడుం చెక్‌పోస్టులను యేర్పాటు చేసింది. ప్రతీ చెక్‌పోస్టు దగ్గర వాహనాలు ఆపి తనిఖీ చేస్తారు. ప్రతీ టక్కు డ్రైవర్ ఎంతో కొంత రొక్కం వీరికి యివ్వాల్సిందే. యివ్వక పోతే దేహశుద్ధి తప్పదు. ఈ చెక్‌పోస్టుల దగ్గర ప్రభుత్వ ఆర్టీసీ బస్సులను కూడా ఆపి చెక్ చేస్తారు. గొత్తి కోయలెవరూ ఈ రహదారుల వెంట ప్రయాణం చెయ్యరు. అనుమానం వస్తే వాహనాలు దించి 'జుడుం' క్యాంపులోకి తీసుకెళ్తారు. అలా వాహనాలు దిగి వెళ్ళినవారు చాలామంది జాడ లేదు.**

ఉంది. వెంటనే వాహనం ఆపాం. ఏంటీ? ఎవరు నరికారని ఆరా తీశాం. శ్రమదానంతో సల్వాజుడుం కార్యకర్తలు అడవి నరికేసినట్లు తెలిసింది. శ్రమదానంతో అడవి నరకడమేమిటని అడిగాం. మావోయిస్టులు అడవిలో నుంచి మందు పాతరలు, క్లేమోర్‌మైన్లు పేలుస్తున్నారని, కాల్పులు జరుపుతున్నారని, రోడ్డుకిరువైపులా ఉన్న అడవిని ఇలా నరికి వేసినట్లు చెప్పారు. ఏలినవారి ఆశీస్సులున్న జుడుం, వారికి ఏది అడ్డనుకుంటే అది తొలగిస్తారు మరి. తలలు నరికే జుడుంకు అడవి నరకడం ఓ లెక్కా అంటూ అక్కడివారన్నారు.

ఇక్కడి నుంచి కొద్దిగా ముందు రోడ్డుపై చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. వాహనాల తనిఖీతోపాటు వచ్చిపోయే వాహనాల వద్ద డబ్బులు వసూలు చేస్తారు.

వెంటనే కెమెరా ఆన్ చేశాం. ట్రక్కు డ్రైవర్ల బైట్లు తీసుకున్నాం. ఈ హైవేపై 5 చెక్‌పోస్టులున్నాయని, ప్రతిచోటా ఇదే పరిస్థితి ఉంటుందని, అడిగినంతా ఇచ్చి వెళ్ళాల్సిందేననీ వారుఅన్నారు. జుడుం ఎస్‌పివోలకు షేక్‌హ్యాండ్ ఇచ్చాం. నూనూగు మీసాల వారు చాలా మంది కనిపించారు. ఏమంత ఆవేశంతో లేరు. కెమెరా ముందు మాట్లాడటానికి సిగ్గుపడ్డారు. మెల్లగా మాటల్లో దింపి బైట్లు తీసుకున్నాం. తమను ఎస్‌పివోలంటారని, తమ వేతనం 1500 రూపాయలేనని, ఆ డబ్బులు కూడా 3 నెలలుగా రావడం లేదన్నారు. 1500 రూపాయలకు ప్రాణాలు కూడా పోతున్నాయన్నారు. జీతం మూడు వేలు చేస్తామన్నారు. ఇంతవరకు అతీగతీ లేదు. ఎస్పీవోలుగా మారాక మావోయిస్ట్‌లకు టార్గెట్లమయ్యాం. బయటికెళితే వారితో ప్రమాదం. రోడ్డుకిరువైపులా మా క్యాంపులున్నాయి. అటువైపు వెళితే మావోయిస్టుల ప్రభావప్రాంతాలు.

**సల్వాజుడుం లో 12 నుంచి 15 సంవత్సరాల పిల్లలు కూడా ఉన్నారు. బడికెళ్ళాల్సిన వయసులో బందూకులతో తిరుగుతున్నారు. ఇది ప్రభుత్వం మార్క్ బాలల హక్కుల ఉల్లంఘన. పిల్లలతో మామూలు పనులు చేయించడమే నేరమైతే సల్వాజుడుం ఏకంగా తూపాకులిచ్చి యుద్ధభూమికి పంపడంపై ప్రతిఒక్కరూ ఆలోచించాలి.**

# బందూకు బాల్యం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అంటే యుద్ధభూమి. ఎగిసిపడే మాంసపు ముద్దలు... శవాల గుట్టలు... ఇలాంటిచోట పిల్లలకు తుపాకులిచ్చి మరుభూమికి పంపుతుంటారా? అవును! ఐదవ తరగతి చదువు మాని ప్రభుత్వ ఆధీనంలో నడిచే సల్వాజుడుంలో తుపాకులు పట్టుకున్న కొందరు బాలలు కూడా మాకు కనపించారు. ఏంటీ దారుణమని ఆశ్చర్యపోయాం. పాలబుగ్గల పసివాళ్ళు... యుద్ధంలో సమిధలు... పిల్లలు సెంట్రీ పోస్టుపై తుపాకులతో పహారా కాస్తున్నారు. మెల్లగా సెంట్రీపోస్టుల పైకెక్కాం. ఆ పసిమొగ్గల హృదయాల్లోకి ఎవరు విషం ఎక్కించారు. పిల్లల్ని దగ్గరకి తీసుకుని కూర్చోబెట్టుకున్నాం. వారి వద్ద 303 తుపాకులున్నాయి. ఎప్పటి నుంచి జుడుంలో చేరారు? అని అడిగాం. తాను 5వ తరగతి చదివేటప్పటి నుంచి జుడుంలో పనిచేస్తున్నానని చెప్పాడు. ఇప్పుడు బడికెళితే 8వ తరగతిలో ఉండాలి. మూడు నెలలుగా జీతాలు కూడా రావడం లేదు. ఈ తుపాకీ మోయలేకపోతున్నాం. నాకు బడికి వెళ్ళాలని ఉంది. బడులన్నీ మూతబడ్డాయి. 12, 13 ఏళ్ళ పిల్లలు .303 తుపాకీని ఆపరేట్ చేయలేరు. ఇంజారం బేస్ క్యాంప్‌లో ఉన్న ఎస్పీవోలెవరూ వీరావేశంలో లేరు. వారిలో చాలా వరకు నైరాశ్యం ఆవహించి ఉంది. పసిపిల్లలతో సాధారణ పనులు చేయించడమే నేరం. అలాంటిది తుపాకులిచ్చి యుద్ధానికి పంపడం ఏంటని ఆలోచనలో పడ్డాం. బాలకార్మికులతో ఎవరైనా పనిచేయిస్తే ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తారు. అలాంటిది ప్రభుత్వమే పనిచేయిస్తే ఇంకెవరికి ఫిర్యాదు చేయాలి. జుడుంలో చేరిన వారిలో నయానా, భయానా వచ్చిన వారే ఎక్కువగా కనబడ్డారు.









**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో యేర్పాటైన బేస్ క్యాంపుల్లో
బందూకుల పోరుతో బుగ్గి అవుతోన్న బాల్యం
సెంట్రీ పోస్టుల పై .303 రైఫిల్‌తో పహారా కాస్తోన్న
సల్వాజుడుం కార్యకర్తలు**



బడికెళ్ళాల్సిన వయసులో బందూకులు పట్టుకొన్న సల్వాజుడుం లో పసి పిల్లలు

# ఎరక్కపోయి, ఎర్రబోరులో ఇరుక్కుపోయి....

మా వాహనం ఎర్రబోరు బేస్‌క్యాంపు వైపు సాగింది. ఎర్రబోరు బేస్ క్యాంపుపై మావోయిస్ట్‌లు మూకుమ్మడి దాడిచేసి 40 మంది జుడుం కార్యకర్తలను హతమార్చారు. పెద్ద ఎత్తున జరిగిన ఈ దాడిలో నష్టపోయిన క్యాంపు అప్పడప్పుడే కోలుకుంటోంది. దెబ్బతిన్న జుడుం అదే స్థాయిలో రగిలిపోతోంది. కొత్తవారు ఎవరు కనపించినా శత్రువుగానే పరిగణిస్తున్నారు. ఎర్రబోరు చేరుకోగానే మాకు భయంకరమైన సమాచారం అందింది. ఎర్రబోరు అటవీ ప్రాంతంలో జరిగే సంతల నుంచి గొత్తి కోయలను ఎత్తుకెళ్ళి మెడలు కోసి చంపుతారని, అక్కడికి వెళితే గొంతు కోసి శబరినదిలో విసిరేసే దృశ్యాలు సాధారణంగా కనబడతాయని తెలిసింది. అలాగే ఈ ప్రాంతానికి వచ్చిన జర్నలిస్టుల్లో కొంతమంది చేతి వేళ్లు కూడా నరికేసినట్లు స్థానికులు చెప్పారు. ఇక్కడి ప్రజలు కేవలం సంతల్లో దొరికే ఆహార పదార్థాలతో జీవిస్తారు. ఉప్పు, కారం ఇతర వస్తువులు అన్నీ సంతలోనే కొంటారు.

**ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా సంతలోనే కొంటారు. తమకు కావాల్సిన ఉప్పు, కారం కొనేందుకు సంతలకు వస్తుంటారు. వస్తుమార్పిడి పద్ధతి ద్వారా కొనుగోలు చేస్తారు. ప్రతి సంత వద్ద 40 నుంచి 50 మంది ఎస్‌పిఓలు పహారా కాస్తుంటారు. సంతలో గొత్తికోయలు ఎవరైనా వస్తే వారిని ఎత్తుకెళ్ళి చేతులు వెనక్కి కట్టి, గొంతు కోసి శబరి నదిలో పడేస్తారు. ఇప్పటికే పెద్ద ఎత్తున గొత్తికోయలు మిస్సింగ్‌లో ఉన్నారు. వారి అచూకీ లేదు. ఏ కోర్టులో కూడా హెబియెస్‌కార్పస్ పిటిషన్ కూడా దాఖలు కాలేదు.**

అడవిలో దొరికే వస్తువులతో సంతలో దొరికే వస్తువుల్ని మార్పిడి చేసుకుంటారు. సంతలో గొత్తి కోయలు దొరికితే చాలు చంపేస్తారని ప్రచారం ఉంది. సరే! ఏమైనా చూద్దాం అని ఎర్రబోరు సంతకు చేరుకున్నాం. ఇక్కడే మేము ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఇరుక్కుపోయాం. నిజంగానే వెనుకవైపు దట్టమైన అడవి. అడవి వైపు 40 మంది సల్వాజుడుం ఎస్పీవోలు తుపాకులు ధరించి ఉన్నారు. రమేశ్ సంతలోని జనంలో కలిసిపోయాడు. కెమెరామెన్ నాతో ఉన్నాడు. సంతలో సెంట్రీ చేస్తున్న దృశ్యాలను షూట్ చేస్తున్నాడు. నేను పక్కనుంచి చెప్పిన దృశ్యాలను కెమెరాలో షూట్ చేస్తున్నాడు. అక్కడ ఉన్న ఎస్పీవోల వైపు పలకరింపుగా ఓ చిరునవ్వు నవ్వితే ఎవరూ స్వీకరించడం లేదు. ఒకరు హడావుడిగా ఎటో పరిగెత్తినట్లు అనిపించింది. ఇంతలో ఐదారుగురు ఎస్పీవోలు తుపాకులతో నన్ను చుట్టుముట్టారు. ఎవరు మీరు? ఎక్కడి నుంచి వచ్చారని జుడుం నేత గర్జించాడు. మేం టివి5 జర్నలిస్టులమని చెప్పాం. గుర్తింపు పత్రాలు చూపాం. మీతో కలిసి మాట్లాడాలని ఎంతో దూరం నుంచి వచ్చామని చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. కట్టేయడం కోసం తాళ్ళు, మెడలు కోయడం కోసం కత్తులు తెమ్మని హిందీలో పురమాయించాడు. నాకు వెంటనే దృశ్యం గుర్తొచ్చింది. ఓ అభయానక దృశ్యం కళ్ళముందు కదలాడింది. చాలా మంది జర్నలిస్టుల చేతి వేళ్ళు నరికేసినట్లు విన్నాం. మళ్ళీ అదే జరగబోతోందనిపించింది. నై... హమ్ మీడియా హై... హమ్ పత్రకార్ హై అన్నాను. మీడియాభీ హమారా దుష్మన్ అన్నాడు. నువ్వు కూడా నక్సల్‌వాదివే అన్నాడు. సాలేకు గోలీ మారో అన్నాడు. అయినా నేను నవ్వుతూనే మాట్లాడుతున్నా. నా దగ్గరగా రమేశ్ లేదు. రమేశ్‌ని పిలవకపోవడమే మంచిదనుకున్నా. ఎర్రబోరులో



ఎర్రబోరు సంతలో కొత్తవారిని చూసి 'జుడుం' నేతలకు సమాచారం అందించేందుకు పరుగెడుతోన్న ఎస్‌పిఓ



ఎర్రబోరు సంతను చుట్టుముట్టి పహారా కాస్తోన్న సల్వాజుడుం ఎస్‌పిఓ లు



సల్వాజుడుం ఎస్‌పిఓ లు నన్ను చుట్టిముట్టి అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తోన్న దృశ్యం

మావోయిస్టుల దాడుల్లో ఆప్తుల్ని కోల్పోయిన వారి ఆక్రోశం ప్రస్ఫుటంగా కనిపించింది. అందుకే తుపాకీని ప్రయోగించడంలో వారికి విచక్షణ లేదు. తోక తొక్కిన పాములా ఉన్నారు. ఎవరు దొరికితే వారిని చంపేందుకు తహతహలాడుతున్నారు. హత్యల స్కోరు పెంచడమే వారి ఏకైక లక్ష్యంగా కనబడుతోంది. ఆంధ్రాప్రాంతం నుంచి వచ్చిన వారెవరైనా చంపమని వారికి ఆదేశాలున్నాయి. కెమెరామెన్‌కు హిందీ రాదు. మరోవైపు ఫ్రేమ్ పెట్టి తాపీగా షూట్ చేస్తున్నాడు. ఎంత చెప్పినా కెమెరా షూటింగ్ ఆపడం లేదన్న కోపం వారిలో బుసకొడుతోంది. కెమెరా ఆపేయ్ అన్నాను. ఎందుకు సార్? అని అమాయకంగా అన్నాడు. ఇంతలో మమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళిన జుడుం నేత షమీ హడావుడిగా అక్కడికి వచ్చాడు. పరిస్థితి విషమించిందని పసిగట్టాడు. వారందరినీ లోపలికి తీసుకెళ్ళి ఏదో మాట్లాడాడు. కాసేపటి తర్వాత మీరు వెళ్ళవచ్చు

**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సల్వాజుడుం చాలామంది జర్నలిస్టుల చేతులు నరికివేసినట్లు చెబుతారు. ఓ నేషనల్ మీడియా మహిళా జర్నలిస్టు హత్యకు గురైనట్లు స్థానికులు చెప్పారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సివిలైజెడ్ సొసైటీలో పెద్దగా ఉద్యమాల చర్చ జరగదనే చెప్పాలి. అనుమానం నెపంతో 'జుడుం' చేసిన హత్యలకు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాదు. ఇక్కడ హత్యలు, అత్యాచారాలు, గృహదహనాలు నిత్యకృత్యం.**





**ఎర్రబోరు బేస్ క్యాంప్ ముందు మావోయిస్టు ల చేతిలో హతమైన ఎస్‌పివోల విగ్రహాలు. గొత్తికోయలు రాకుండా సంత పై సాయుధ పహారా**

అన్నట్లుగా జుడుం నేతలు అడ్డంగా చేయి ఊపారు. ఇక్కడ చంపితే కనీసం ఎఫ్.ఐ.ఆర్ కూడా నమోదు చేయరు. రమేశ్‌ను సంతలో వెదికి పట్టుకున్నాం. కెమెరామెన్‌కు అసలేం జరిగిందో తెలియనే తెలియదు. ఇంకా ఏం తీయమంటారని అమాయకంగా అడిగాడు. తెలియకపోవడమే మంచిదని అనుకున్నాను. సంతలో నుంచి తొందరగా బయటపడాలి. ఎవేవో వస్తువులు సంతలో అమ్ముతున్నారు. వాటిని చూసేందుకు రమేశ్ ఇంకా ఆసక్తి కనబరుస్తున్నాడు. రమేశ్‌కు ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. ఎందుకు టైమ్ వేస్ట్ చేస్తారంటూ ఒక గదుము గదిమాను. రమేశ్ ఏమీ నొచ్చుకోలేదు. సరే పదా అంటూ నన్ను అనుసరించాడు.

మా పర్యటనలో ఇదొక షాక్ అయినప్పటికీ, ఏ మాత్రం ఆత్మస్థయిర్యాన్ని కోల్పోలేదు. ఎర్రబోరు బేస్ క్యాంపు వైపు వెళ్ళాం.

ఓ యువతి వెంట్రుకలు విరబోసుకుని భుజాన తుపాకీతో కనబడింది. వెహికిల్ ఆపాం. మా వైపు మహిళా ఎస్పీవో చూడగానే కెమెరా తీయమన్నాను. వీడియో





ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో
చేతులు వెనక్కి కట్టి
మెడలు కోసేసి
సాధారణంగా
కనిపించే మానవ
శవాల దృశ్యాలు

తీసుకోవచ్చా అని అడిగాం. తీసుకోండి అన్నట్లు కోఆపరేట్ చేసింది. నేను పైకి రావచ్చా అని అడిగా. మెట్లు చూపించి పైకి రమ్మంది. సెంట్రీ పోస్టు ఎక్కాము.



ఎర్రబోరు బేస్‌క్యాంపు సెంట్రీ పోస్టుపై మహిళా ఎస్పీవో విమల

**సల్వాజుడుం ఎస్‌పివోలలో మహిళలను కూడా రిక్రూట్ చేశారు. ఇది మొట్టమొదటిసారిగా మేమే బయటిప్రపంచానికి తెలియజేశాం. ఒక్కో క్యాంపులో 10 నుంచి 20 మంది మహిళా ఎస్‌పివోలు ఉన్నారు.**

మమ్మల్ని మేం పరిచయం చేసుకున్నాం. నీ పేరేంటని అడిగాం. విమల అని చెప్పింది. ఎంత మంది మహిళలు ఎస్పీవోలుగా ఉన్నారని అడిగాం. సవుదా అంది. మాకేమి అర్థం కాలేదు. అడిగాం. మళ్ళీ సవుదా అంది. ఓ క్షణం ఆగి ఆలోచించాం. బహుశా అది చౌదా కావచ్చని అనుకున్నాం. ఆమెకు హిందీ, కోయ తప్ప వేరే భాష రాదు. మహిళా ఎస్పీవోలు 14 మంది అక్కడ ఉన్నట్టుగా అర్థం చేసుకున్నాం. మహిళా ఎస్పీవోల రిక్రూట్‌మెంట్ ఎప్పుడు జరిగిందని అడుగగా, తాము మూడు నెలలుగా విధులు నిర్వహిస్తున్నామని చెప్పింది. మూడు నిముషాల్లో షూటింగ్ పూర్తి చేసుకుని సెంట్రీ పోస్టు దిగాం. మారణకాండ జరిగిన ఎర్రబోరులో సెంట్రీ పోస్టు ఎక్కి దిగడం నిజంగానే పులినోట్లో తలపెట్టి తీసినట్లుగానే అనిపించింది. సల్వాజుడుం సెంట్రీ పోస్టు దిగిరావడాన్ని కొందరు ఎస్పీవోలు చూశారు. మళ్ళీ ప్రమాదంలో పడకుండా ఏదో పాత వ్యక్తుల్లాగానే ఏమాత్రం తడుముకోకుండా కనబడినవారందరికీ షేక్ హ్యాండ్ ఇస్తూ, క్రైసే హో అంటూ ముందుకు నడుస్తూ, పాతవాళ్ళలాగే వెళ్ళిపోయాం.

'ఎవరు మీరు?' అని అడిగే అవకాశం ఇవ్వకుండా ముందుకు వెళ్ళిపోయాం. కొంటాలో ఉన్న మరికొందరు మహిళా ఎస్పీవోలను కలిశాం. వారు సిగ్గుపడుతూ



**కొంట బేస్ క్యాంపులో మహిళా ఎస్పీవోలు అనసూయ, శాంతి**

మాట్లాడారు. మహిళా ఎస్పీవోలు అంత అగ్రెసివ్‌గా ఉన్నట్లు కనిపించలేదు. తప్పదు కదా అన్నట్టు భుజాలకు తుపాకులు తగిలించుకున్నట్టు అనిపించింది. విషయాలపట్ల వారికి అవగాహన లేదు. వారు పేర్లు చెప్పారు.

అక్కడి నుంచి ఏదైనా మావోయిస్ట్‌ల ప్రభావిత ప్రాంతానికి తీసుకెళ్ళమని వాహన డ్రైవర్‌ను అడిగాం. తాము చచ్చినా రామని తెగేసి చెప్పారు. వాహనమైనా ఇవ్వమని డ్రైవర్‌ను అడిగితే అందుకు కూడా నిరాకరించారు. అక్కడి నుంచి తిరిగి మేమున్న షెల్టర్‌కి వెళ్ళిపోయాం.

సల్వాజుడుం బేస్ క్యాంపులు చూశాం. ఎంతోకాలంగా మా మదిలో ఉన్న కోరిక నెరవేరింది. ఆ అరాచక దృశ్యాలను కెమెరాలో బంధించగలిగాం. ఇక్కడి మా అనుభూతులు గగుర్పాటు కలిగిస్తాయి. తిరిగిన బేస్ క్యాంపుల్లో మేం మృత్యు లోకపు రహదార్లను చూసి వచ్చినట్టుంది. ఒక దశలో పీకలు కోసేస్తారనుకున్నాం. తాళ్ళు, కత్తులు చూశాక పీకలు కోసే దృశ్యాలు మా ముందు కదలాడాయి. బతుకు జీవుడా! అంటూ బయటపడ్డాం. సల్వాజుడుం ఎవరిని చంపినా, ఎవరిని నరికినా, ఎవరిపై అత్యాచారం చేసిన ఒక్క కేసు కూడా నమోదు కాదు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన దాఖలాలు లేనేలేవు. మా వాహనం మెల్లగా బయలుదేరింది. బేస్ క్యాంప్ దృశ్యాల ఫీడ్ చాలా వరకు వచ్చింది. కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించుకున్నంత ఆనందం మాకు మిగిలింది. నిజంగానే వ్యాల్యూబుల్ ఫీడ్ మా దగ్గర ఉంది. టేప్‌లను భద్రపర్చుకునే పనిలో అప్రమత్తంగా ఉంటున్నాం. వస్తూ వస్తూ ఎర్రబోరు పోలీసు స్టేషన్ దగ్గర మార్షల్స్ మా వాహనాన్ని ఆపారు. ఆంధ్రాలో అయితే పోలీసు స్టేషన్ ముందు వాహనం ఆపితే గంటకొట్టడం లాంటి హడావుడి కనబడుతుంది. ఇక్కడ అలాంటిదేమీ లేదు. తాపీగా లోపలి దాకా వెళ్ళాం. కొందరు కానిస్టేబుళ్ళు తుపాకులు పక్కన పడేసి నిద్రపోతున్నారు. వారిని తట్టి లేపాం. ఎస్ఐ సాబ్ కిదర్‌హై? అంటూ అడిగాం. హడావుడిగా క్వార్టర్‌లోకి వెళ్ళి ఎవరు వచ్చారో కూడా తెలుసుకోకుండా ఎస్ఐని వెంటబెట్టుకుని వచ్చాడు కానిస్టేబుల్. మా టీం అందరం ఎస్ఐ పండిట్‌ను పరిచయం చేసుకున్నాం. ఆయన టీ తెప్పించాడు. కబుర్లలో దిగాం. తానొక్కడే గ్రేహౌండ్స్ ట్రైనింగ్ చేశానని, మిగతా జవాన్లకి ఎవరికీ శిక్షణ లేదన్నాడు. ఇది ఒక పనిష్మెంట్ పోస్టింగ్‌గా చెప్పుకుంటూ వాపోయాడు. భార్యాపిల్లలు

**ఛత్తీస్‌గఢ్‌లో పత్రికలు, మీడియా, సల్వాజుడుం హత్యలు, అరాచకలపై పెద్దగా స్పందించవు. ఆంధ్రప్రదేశ్ లో లాగా పౌరహక్కుల సంఘాలు లేవు. భారీ ఎన్‌కౌంటర్లపై కూడా మీడియా ఘటనాస్థలానికి చేరుకోదు. మావోయిస్టు ఉద్యమానికి గిరిజనేతరుల మద్దతు పెద్దగా లేదు. చాలాకాలంగా ఛత్తీస్‌గఢ్‌లో హక్కుల కోసం పోరాడిన పౌరహక్కుల నేత డా. బినాయక్‌సేన్ చాలాకాలంగా జైల్లో మగ్గుతున్నారు. ఈయన గురించి గిరిజనులు చాలా గొప్పగా చెప్పారు. ఈయన క్లినిక్ ఎంత పెద్దది అంటే ఓ గ్రామాన్నే క్లినిక్‌గా మార్చినట్టు స్థానికులు చెప్పారు.**

సమీప పట్టణంలో ఉంటున్నారని, ఇక్కడ కనీసం పిల్లల చదువుకు సౌకర్యాలు కూడా లేవని, భార్యాపిల్లల దగ్గరికి వెళ్ళేందుకు ఉన్నతాధికారులు సెలవులు కూడా ఇవ్వరంటూ తన బాధను వెళ్ళబోసుకున్నాడు. నిజంగానే ఈ ప్రాంతంలో పనిచేసే పోలీసు అధికారుల వేదనలు కూడా అరణ్యరోదనలే. ఉత్తర తెలంగాణాలో పోలీసులు, గ్రేహౌండ్స్ పనితీరు గురించి అడిగి తెలుసుకోవాలన్న ఆతృత అతనిలో బాగా కనిపించింది. ఎర్రబోరులో పగలంతా ప్రశాంతంగానే కనబడుతుందని, రాత్రయితే ఎటు నుంచి ఎలాంటి ఉపద్రవం వచ్చి పడుతుందోనన్న భయాన్ని ఆయన వెలిబుచ్చారు. పోలీసు వ్యవస్థ ఇక్కడ ఆత్మరక్షణలో ఉన్నట్లు స్పష్టంగా కనబడుతోంది. ఎస్ఐ దగ్గర సెలవుతీసుకుని మేం మా వాహనాన్ని ఆంధ్రా సరిహద్దు దిశగా పోనిచ్చాం.

శబరి, సీలేరు, గోదావరి కలిసే బోటు దగ్గర ఓ 'పి టు సి' చెప్పుకున్నాం. అనేక మంది గొత్తికోయల శవాలు ఈ నదుల్లో తేలుతుంటాయని స్థానికులు చెప్పారు. మళ్ళీ మా వాహనం ఆంధ్రా సరిహద్దు దిశగా వెళుతోంది. బాగా పొద్దు పోయాక మేమున్న స్థావరానికి చేరుకున్నాం. ఏదైనా ఒక గిరిజన గూడెంలో ఓ పూట భోజనం చేసి మా ప్రయాణాన్ని ముగించుకుందామనుకున్నాం. అనుకున్నట్లుగానే స్వచ్ఛంద కార్యకర్తలతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఓ గూడెంలో ఏర్పాటు చేసుకున్నాం. అందుకు కావలసిన వస్తువులతో బయలుదేరాం. వాహనం దిగి మనిషికి కొన్ని వస్తువుల చొప్పున మోస్తూ గూడెం వైపు నడవసాగాం. గూడెం వచ్చేసింది. చల్లటి


గిరిజన గూడెంలో మా భోజనం

గాలులు వీస్తున్నాయి. వచ్చిన పని చాలా వరకు పూర్తయిందన్న ఆనందంతో మనసులో ఉత్సాహం పరవళ్ళు తొక్కుతోంది. పారుతున్న సెలయేళ్ళ ప్రక్కన చెలిమలు తవ్వి నీటిని పట్టుకొస్తున్నారు మహిళలు. ఓ గ్లాసు నీళ్ళు తాగాం. అడవి గుండా పారే నీటికి ఔషధ గుణాలు ఉంటాయని గిరిజనులు చెప్పారు. తెల్లవన్నీ పాలు... నల్లవన్నీ నీళ్ళు అని నమ్మే అమాయక జనం గిరిజనులు. వీరి గూడాల్లో కరెన్సీ కట్టలకు విలువ లేదు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రికల్ వస్తువుల వూసే లేదు. కనీసం టార్చ్‌లైట్లు కూడా వాడరు. దివిటీని అంటించుకుని వాటి వెలుతురులో రాత్రిళ్ళు నడుస్తారు. క్రూర జంతువులకన్నా నాగరిక మనిషే ప్రమాదకారిగా చెప్తారు.

గూడెంలో ఉండే నాలుగు ఆవులు, కొన్ని మేకలే వీరి బ్యాంక్ బాలెన్స్. గేదెల్నీ, గొర్రెల్నీ పెంచరు. ఆవుపాలు తాగరు. పాలు దూడ కోసమేనని నమ్ముతారు. వాటిని తాగడం నేరంగా భావిస్తారు. వెదురుతో అల్లిన చక్కటి కళాత్మక మంచాలు. వారికి కావల్సిన వస్తువులన్నీ వారే తయారు చేసుకుంటారు. పోడు వ్యవసాయం ద్వారా వచ్చే గింజలు సంవత్సరానికి సరిపడే పంట.

కూరగాయలు, ఆకు కూరలు వీరికి పెద్దగా తెలియదు. వండుకు తినడం నేర్చుకున్నారు. సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే వేటకు వెళతారు. ఏ కష్టం వచ్చినా, రోగాలు, రొప్పులూ వచ్చినా కులదేవర కరుణ కోసం వేడుకుంటారు. జంగూబాయమ్మ కులదేవతకు సంవత్సరానికి ఒకసారి జంతువులను బలి ఇస్తారు. కనబడ్డ వారి దగ్గర ఏదో యాచించాలన్న కోరికలు అసలే


నాలుగు ఆవులే వీరి ఆస్తి


కులదేవత పూజ చేస్తున్న గిరిజనులు

ఉండవు. ఎదుటి మనిషిపై ద్వేషం లేదు. హత్యలూ, ఆత్మహత్యలూ అసలే లేవు. తామెంతో సుఖశాంతులతో జీవిస్తున్నామని అనుకుంటారు. రేపటి గురించి ఆలోచించరు. అడవితల్లి అన్నీ తమకు సమకూరుస్తుందని నమ్ముతారు. ఆధునిక వ్యవసాయం గురించి తెలియదు. పోడు వ్యవసాయం, వరుణుని కరుణతో వచ్చేదే ఫలసాయం. పండుగలు, కర్మకాండల్లో తమకు తాముగా తయారు చేసుకునే లందా అనే మత్తు పదార్థాన్ని సేవిస్తారు. వరి, మొక్కజొన్నలని దంచి పిండిగా తయారు చేసి వేడి నీళ్ళ కుండపై వెదురు బుట్ట ఉంచి, దాన్లో పిండి పోస్తారు. ఆ ఆవిరితో పిండిని ఉడకబెడతారు. తర్వాత వారం రోజులు పులియబెడతారు. దీనితో లందా అనే మత్తు పదార్థం తయారవుతుంది. ఇది కూడా ఎక్కువగా కర్మకాండలలో వచ్చే బంధువులకు, పెళ్ళిళ్ళకు వచ్చే బంధువుల కోసం తయారు చేస్తారు. నిజం చెప్పాలంటే ఎలక్ట్రానిక్ వస్తువులతో కార్లు, మేడల్లో విహరిస్తూ కోట్లు సంపాదించుకుంటున్న వ్యక్తి కంటే గిరిజన జీవన విధానమే గొప్పదని నేను కచ్చితంగా నమ్ముతాను. అడవుల్లోంచి మనిషి బయటకు వచ్చి స్వార్థపూరిత విషవలయంలో చిక్కుకున్నాడన్నది వాస్తవం. గూడెంలో ఉన్న జనం మా చుట్టూ చేరారు. ఇదివరకే పరిచయమైన గూడెం కాబట్టి చాలా చనువుగానే మాతో మసలుకున్నారు. జుడుం క్యాంపుల్లోని విషయాలు తెలుసుకునేందుకు ఉత్సుకత కనబర్చారు. అక్కడి విషయాలు ఒకొక్కక్కటిగా అడిగారు. “క్యాంపుల్లో ఉన్న గిరిజనులు వెళ్ళిపోవాలనుకుంటున్నారు. బేస్ క్యాంపులు ఎక్కువకాలం ఉండవ”ని చెప్పగానే గొత్తికోయల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. జుడుం క్యాంపులు ఎంత తొందరగా ఎత్తివేస్తే అంత ప్రశాంతంగా తాము బతుకుతామని వారనుకుంటున్నారు. అడవిలో దొరికే పుల్లలతో వంటలు చకచకా వండేస్తున్నారు.

అది మధ్యాహ్న సమయమైనప్పటికీ అడవితల్లి ఒడి చల్లగా ఉంది. అటూ ఇటూ తిరుగుతూనే ఉన్నాం. రకరకాల పక్షుల కువకువలు, చెట్ల అందాలను ఆస్వాదిస్తున్నాం. ఉన్నట్టుండి సెల్‌ఫోన్ తీసి చూసే సరికి సిగ్నల్స్‌పోయాయి. మరో రెండు అడుగులు వెనక్కి వేశాం. ఒకటీ, రెండు... సిగ్నల్స్ వచ్చాయి. గబగబా ఫోన్లు చేయడం ప్రారంభించాం. మొదటి ఫోన్ ఆఫీస్‌కి చేసి ఎర్రబోరు ప్రమాదాన్ని మా ఇంచార్జీ కరీంకి చెప్పాం.

స్టూడియోకి ఎప్పుడొస్తున్నారని కరీం అడిగారు. పర్యటన అయిపోయింది. వీలైనంత తొందరగా వస్తామని చెప్పాను. గూడెంలో రెండు పెంపుడు కుక్కలున్నాయి. సాధారణంగా కొత్తవారిని చూస్తే మొరిగే కుక్కలు మమ్మల్ని చూసి మొరగలేదు. బహుశా ఆ గూడెంతో పరిచయమున్న సామాజిక కార్యకర్తలుండడం వల్లనేమో. వంటలు వండటంలో మేమేమీ పాలుపంచుకోలేదు. అదంతా సామాజిక కార్యకర్తలు, గిరిజనులు చూసుకున్నారు. అటుగుండా గూడెంలోని చివరి గుడిసె వేపు నడుస్తూ వచ్చాం.

దాదాపు 90 ఏళ్ళ వృద్ధుడు. గోచీ తప్ప అతని ఒంటిపై ఎలాంటి బట్టలూ లేవు. ఓ పక్షి మాంసాన్ని కాల్చుకుని తింటున్నాడు. గబగబా మేం అక్కడికి వెళ్ళాం. వెంటనే మమ్మల్ని చూసి చకచకా గుడిసెలోకి వెళ్ళిపోయాడు. ఎంతకీ బయటకు రాలేదు. మేము లాక్కుని తింటామనుకున్నాడు కాబోలు... మేం మంచి విజువల్ మిస్ అయ్యాం. అతణ్ణి కెమెరాలో బంధించాలనిపించింది. అతడిని బయటకు రప్పించేందుకు కొందరు గిరిజనుల సహాయం తీసుకున్నాం. వాళ్ళు బయటకు రమ్మని పిలుస్తుంటే ఆ వృద్ధుడు మావైపు గుర్రుగా చూస్తున్నాడు. ఎందుకొచ్చిన గొడవని గిరిజనుల ద్వారానే పిలిపించాం. ఫోటోలు దిగాం. విజువల్స్ తీసుకున్నాం. ఆదిమానవుని పోలికలతో ఉన్నాడు. అడవిలోని ఆకులతో చుట్ట తయారు చేసుకుని చెకుముకి రాయితో చుట్ట అంటించుకున్నాడు.

ఇంతలో భోజనాలు సిద్ధమయ్యాయని పిలుపు వచ్చింది. గిరిజనుల దంపుడు బియ్యం అన్నం మాకు, మేము తెచ్చిన బియ్యం వారికి. భోజనాలు వారి వంట పాత్రల్లోనే వండారు. అన్నం సాంబారు భోజనాలు. ఆకలి దంచేస్తోంది. ఆహా...



**గిరిజన గూడెంలో ఓ ఆదిమానవుడు**

ఏమి రుచి ... ఇంత రుచికరమైన భోజనం ఎన్నడూ తినలేదన్నట్లుగా తినేస్తున్నాం. ఆరోజు సరదాగా గడిచిపోయింది. చీకటి పడుతోంది. తిరుగు ప్రయాణమయ్యాం.

గిరిజనులు సాధారణంగా వాహనం వరకు వచ్చి సాగనంపారు. ఇక మీ పర్యటన ముగిసినట్లే కదా అని సామాజిక కార్యకర్తలు అన్నారు. ఇంకా ముగియలేదన్న విషయం మాకు తెలుసు. రమేశ్, నేను ఈ విషయంపై ఏకాంతంగా చర్చించుకున్నాం. మావోయిస్టుల్ని కలిసేదెలాగో తెలియక తర్జనభర్జన పడ్డాం. పరిచయాల్లేకుండా, తెలిసినవారి ద్వారా కాక నేరుగా వెళ్లే దారి లేదు. అందుకే అసంభవమని నాకనిపించింది. ఎవరూ తెలియాల్సిన పనిలేదు. మనమే వెళ్లొద్దాం. ప్రయత్నించి చూద్దామని రమేశ్ స్థిరంగా అన్నాడు. దీంతో నాలో పట్టుదల పెరిగింది.

మా మాటల మధ్య వేణు కలగజేసుకుని 'అది అయ్యే పని కాదు. ఇంటికి వెళ్ళిపోదాం. లేనిపోని ఆలోచనలు వద్దు సార్' అన్నాడు. ఓకే. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దాం. తర్వాత మాట్లాడుకుందామంటూ కామ్ అయిపోయాం.

స్థావరానికి వచ్చేశాం. బయటకు వెళ్ళి చాయ్ తాగి వస్తామంటూ నేను రమేశ్ బయలుదేరాం. జస్ట్ ట్రై అయితే అవుతుంది.. పోతే పోతుంది. ప్రయత్నం చేద్దాం. ఎవరికీ చెప్పకుండా వేణుని తీసుకుని రేపు ప్రొద్దుటే బయలుదేరుదాం. స్నానాలు కూడా చేయొద్దు వచ్చాకే స్నానాలు. రూమ్‌కి వచ్చి వేణుకి నచ్చజెప్పుకున్నాం. అయిష్టంగానే ఒప్పుకున్నాడు. అసలు మనం ఇక్కడినుంచి జనతన సర్కార్ వైపు వెళతున్నట్టు ఎవరికీ తెలియకూడదు. పోలీసులకి తెలిసినా... జుడుంకి తెలిసినా ప్రమాదమే. ఏదైనా జరగరాని సంఘటన జరిగితే ఇక అంతే. తెలతెలవారుతుండగానే కెమెరాతో సహా బయలుదేరాం. 300 రూపాయల అద్దెకు ఒక ఆటోను మాట్లాడుకున్నాం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మారాయ్ గూడెం దగ్గర దిగాం. అక్కడి నుంచి మ్యాప్ తీసి మావోయిస్ట్ పార్టీ జనతన సర్కార్ నడుపుతున్న ప్రాంతాన్ని గుర్తించాం.

అడవికి ఆనుకుని ఉన్న ఓ గ్రామం వచ్చింది. గ్రామంలో అటూ ఇటూ చూశాం. తెలుగు భాష తెలిసిన ఓ ఇంటివాళ్ళు మమ్మల్ని రిసీవ్ చేసుకున్నారు. కాళ్ళు, చేతులు కడుక్కోవడానికి నీళ్ళు కూడా ఇచ్చారు. చక్కటి టీ కూడా ఇచ్చారు. మేం వచ్చిన పని గురించి చెప్పాం. ఒక్కసారిగా వారి ముఖాల్లో భయాందోళన కనిపించింది. అక్కడికి వెళ్లడం ఎంత ప్రమాదమో సొంత పిల్లలకి చెప్పినట్టుగా చెప్పారు. 'మేం మీడియా... మాకేమీ అవదు. చక్కగా తిరిగి వచ్చేస్తాం' అని చెప్పి వారిదగ్గర సెలవు తీసుకుని ఆటో అతన్ని అక్కడే ఉండమని చెప్పి మేం అడవిలోపలికి సాగిపోయాం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 14 జిల్లాలు ఉండగా, పది జిల్లాల్లో మావోయిస్ట్ పార్టీ సమాంతర ప్రభుత్వం నడుపుతోంది. దాన్ని జనతన సర్కార్ అనిపిలుస్తారు. దట్టమైన అడవిలోకి మేం అడుగుపెట్టాం. దారిగుండా అక్కడక్కడా సీపీఐ మావోయిస్ట్ పార్టీ కరపత్రాలు కనబడ్డాయి. అక్కడక్కడా చెట్లకు పుల్లలతో పెట్టి ఉన్నాయి. సరైన దారిలోనే సాగుతున్నామని అనిపించింది. మేం గతంలో తిరిగిన అడవికీ, ఈ అడవికి మధ్య చాలా తేడా ఉంది. ఆంధ్ర సరిహద్దుల్లో ఒక్క టేకు చెట్టు కూడా అడవిలో కనిపించలేదు. జనతన సర్కారులో మాత్రం ఠీకుతాకుగా, సోకుగా పెరిగిన టేకు చెట్లు విపరీతంగా ఉన్నాయి. టేకు చెట్లు నరికే సాహసం ఎవరూ చేయట్లేదు. ఇలా 5 కిలోమీటర్లు నడిచాం. అడవి మధ్యలో ఓ వాగు వచ్చింది. నీటి ప్రవాహం

**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 14 జిల్లాలు ఉండగా 10 జిల్లాలో మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో 'జనతన సర్కారు' పేరుతో మావోయిస్టు పార్టీ సమాంతర పాలన సాగిస్తోంది. మొదట 4 జిల్లాల్లో ఆరంభమైన ఈ సర్కారు 10 జిల్లాలకు విస్తరించింది. ఇటీవల ఒరిస్సాలోని కొంత ప్రాంతంలో కూడా 'జనతన సర్కార్' ఆరంభమైంది.**

పెద్దగా లేదు. ఆ వాగు దాటాం. జనతన ఇలాకాలో ప్రవేశించినట్టుగా ఓ పి టు సి చెప్పుకున్నాం.

ఇక్కడ మాకు కోయభాష తెలిసినవారు కానీ, గైడ్‌కానీ ఎవరూ తోడుగా లేరు. సామాజిక కార్యకర్తల్లో కోయభాష తెలిసిన ఓ యువకుడు మావెంట రావలసి ఉండగా, మేము తెల్లవారుజామున బయలుదేరడంతో ఆ సమయంలో అతని సెల్ స్విచ్ ఆఫ్ ఉండటంతో అతడు లేకుండానే బయలుదేరి వచ్చాం. అతను లేకపోవడమే మంచిదైందని తరువాత తెలిసింది. ముందుగా మావోయిస్టులు పేల్చేసిన ఓ పోలీసుస్టేషన్ కనిపించింది. సెంట్రీ పోస్టు మొండిగోడల మధ్య ఓ పి టు సి చెప్పుకున్నాం. నేను రమేశ్ అడవిలో హుషారుగా నడుస్తున్నాం. ఇల్లు గుర్తుకు వస్తున్నా వేణు అనివార్యంగానూ, బలవంతంగానూ మాతో నడుస్తున్నాడు. గూడెంలో పిల్లలు బలంగా కనిపించారు.

హిందీ భాషలో ముద్రితమైన టెక్ట్స్ బుక్స్ కనిపించాయి. కోయ, హిందీ భాషలను మిళితం చేస్తూ ఉన్నాయి. అది జనతన సర్కార్ ముద్రించిన పుస్తకాలుగా ధ్రువపడింది. ఇక్కడ ఓ విషయం విశేషంగా చెప్పుకోవాలి. కొత్త వ్యక్తులెవరితోనూ జనతన సర్కార్ ప్రజలు మాట్లాడరు. ఎవరితోనూ చేయి కలపరు. చాలా బలవంతంగా ఒక బాలుడు మాత్రం మాతో మాట్లాడాడు. చేయెత్తి ఊపాడు. మేం అడిగిన ఓ

**'జనతన సర్కార్' అంటే ప్రజా ప్రభుత్వం అని అర్థం. దాని మంత్రిత్వ శాఖలు కూడా 'జనతన సర్కార్' ఏర్పాటు చేసుకుంది. విద్య, వైద్య, ఆరోగ్య, స్త్రీ, శిశు సంక్షేమ, న్యాయ, వ్యవసాయ శాఖ తదితర శాఖలను ఏర్పాటు చేసుకుంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వానికి కాక ప్రజలు 'జనతన సర్కార్'కే పన్నులు చెల్లిస్తున్నారు.**



**మావోయిస్టులు పేల్చివేసిన ఓ పోలీస్‌స్టేషన్**

గ్రామానికి ఎలా వెళ్ళాలంటే అలా అంటూ చేయెత్తి చూపాడు. ఇంతకంటే ఎక్కువ సహకారం ఇక్కడి ప్రజల నుంచి కనిపించడం లేదు. జనం ఆరోగ్యంగా కనబడ్డారు. చిన్న చిన్న చెరువులు, బోర్‌వెల్స్ కనిపించాయి.

ఎడ్ల ద్వారా సేద్యం చేస్తున్నారు. అక్కడి నుంచి ముందుకు వెళ్ళాం. మరో చిన్న గూడెం వచ్చింది. ఇక్కడ ఎలాగైనా మాట్లాడాలని ఓ ఇంటి దగ్గర కూర్చున్నాం. ఆంధ్రా నుంచి వచ్చిన పత్రకార్ అంటూ హిందీలో పరిచయం చేసుకున్నాం. తనకు కోయ భాష తప్పితే మరే ఇతర భాష రాదంటూ అతను కోయ భాషలో సమాధానం చెప్పాడు. ఎన్ని ప్రశ్నలు వేసినా అతనిది ఒకటే సమాధానం భాష రాదన్నదే. దాదలూరు (అన్నలు) వస్తారా? అని అడిగాం. వెంటనే అతని ముఖంలో కంగారు కనబడింది. నహీ... నహీ... అంటూ సమాధానం వచ్చింది. ఇతనికి భాష వచ్చు కాని ఇతనేమీ సమాధానం చెప్పదల్చుకోలేదన్నది అర్థమైంది. సరే... ఇక్కడి నుంచి మళ్ళీ కాలినడకన ప్రయాణం మొదలైంది. మా సంకల్పం, పట్టుదల ఏ మాత్రం తగ్గలేదు. మీరు చేస్తున్నదంతా వృథా ప్రయాస అంటూ కెమెరామెన్ నిష్ఠూరంగా మాట్లాడాడు. ఇలా అడవిలో చాలా దూరం నడిచాక మరో ఊరు వచ్చింది. ఈ ఊరు కాస్త పెద్దగా కనిపించింది.



జనతన సర్కార్‌లో వడ్ల కల్లంలో గిరిజన రైతులు

ఓ స్కూల్ బిల్డింగ్‌ను మావోయిస్ట్‌లు పేల్చివేశారు. అక్కడే ఉన్న పశువుల కాపరి గిరిజనుడితో కాసేపు మాటలు కలిపాం. 'ఈ బిల్డింగ్ ఏం చేసిందని మావోయిస్ట్‌లు కూల్చారు?' అంటూ ప్రశ్నించాం. పక్కా బిల్డింగ్ ఉంటే పోలీసులు క్యాంపులు ఏర్పాటుచేస్తున్నారు. అందుకే మావోయిస్టులు పక్కా బిల్డింగ్‌లను పేల్చివేశారంటూ సమాధానం చెప్పాడు. ఇక్కడికి దాదలూరు వస్తారా? అని అడిగితే గిరిజనుడు ఒక నవ్వు నవ్వాడు. అతడు ఎందుకు నవ్వాడో అర్థం కాలేదు. మళ్ళీ ఇలా అనుకున్నాం. మావోయిస్ట్‌ల చర్యలు కళ్ళ ముందు కనబడుతుంటే వస్తారా... అని అడిగినందుకు నవ్వక ఏం చేస్తాడు అనుకున్నాం. సరే ... ఇక్కడ చదువుకున్న వారెవరైనా హిందీ బాగా మాట్లాడేవారు ఉన్నారా అని అడిగాం. డాక్ (పోస్టాఫీస్)కు వెళ్ళండి అని సమాధానం ఇచ్చాడు. అక్కడికి వెళ్ళాం. పోస్టాఫీసు అని చిన్న బోర్డు ఉంది. పోస్టుబాక్స్ విరిగిపోయి శిథిలావస్థలో ఉంది. అంటే దీని అర్థం పోస్టు మాస్టర్‌ని కలవాలి అని ఆయన భార్యని హిందీలో అడిగాం. ఇంటి ముందు కళ్ళాపు చల్లుతున్న పోస్టుమాస్టర్ భార్య 'లేదు దగ్గరి పట్టణానికి వెళ్ళాడు' అని చెప్పింది. ఎప్పుడొస్తాడు అని అడిగితే రెండు రోజుల తర్వాత అని సమాధానమిచ్చింది.




**పోలీసులు ఆశ్రయం తీసుకుంటున్నారని మావోయిస్టులు పేల్చివేసిన ఓ పాఠశాల భవనం**

ఇంతలో ఓ యువకుడు వచ్చి పోస్టుమాస్టర్ ఎందుకు అని మమ్మల్ని ప్రశ్నించాడు. చక్కగా హిందీలోనే మాట్లాడుతున్నాడు. ఒక గుడ్డలాంటి టవల్ చుట్టుకున్నాడు. వంటిపై చొక్కా లేదు. రింగుల జుట్టు, నల్లగా ఉన్నాడు. దాదాలూరుని కలవాలి అందుకే వచ్చాం అని సమాధానం చెప్పాం. అయితే ఉండండి అంటూ అడవివైపు నడుస్తూ వెళ్ళిపోయాడు. ఓ గంట గడిచిపోయింది. ఇక తిరిగి వెళ్ళిపోదామని అనుకుంటున్నాం. ఉండమని చెప్పి వెళ్ళాడు కదా! కొద్దిసేపు ఆగుదామనుకున్నాం. ఇంతలో ఇద్దరు వ్యక్తులు అడవిలోంచి వచ్చారు. అందులో ఒకరు పోస్టుమాస్టర్. అయితే పోస్టుమాస్టర్ స్థానికంగా లేడని అతని భార్య చెప్పింది అబద్ధమని తేలిపోయింది.

పోస్ట్‌మాస్టర్ తన ఇంటికి వచ్చిన అతిథుల్లాగానే మమ్మల్ని పలకరించాడు. దాదాలూరుని కలవాలని అన్నాం. కష్టం అని సమాధానం వచ్చింది. మళ్ళీ నిరాశకు గురయ్యాం. ఉండండి, భోజనం సిద్ధం చేస్తాం అని అన్నాడు. బోర్డర్‌లో తెలుగువాళ్ళు భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. కృతజ్ఞతలు తెలిపి మరో గ్రామం దిశగా నడిచాం. మళ్ళీ అడవిలో నడక. ఇక్కడో గ్రామం కనిపించింది. కెమెరామెన్ ముఖంలో కోపం కనిపిస్తోంది. రమేశ్ ఓపిగ్గానే ఉన్నాడు.

ఇక్కడ మాత్రం ఎవరితో మాట్లాడేది లేదు. నేరుగా గూడెం పెద్ద ఇంటికే వెళదాం అంటూ గూడెం పెద్ద(పటేల్) ఇల్లు తెలుసుకుని అక్కడికి వెళ్ళాం. పటేల్ లేడు. అడవిలోకి వెళ్ళాడని సమాధానం వచ్చింది. మేం అతనితో కలవాలి,

మాట్లాడాలి అని చెప్పాం. సరే తీసుకువస్తామంటూ ఓ యువకుడు అడవిలోకి వెళ్ళాడు. ఇంతలో సైకిల్‌పై 12 ఏళ్ళ బాలుడు అక్కడికి వచ్చి కూర్చున్నాడు. ఆలివ్‌గ్రీన్ దుస్తులు ధరించి ఉన్నాడు. షేక్‌హ్యాండ్ ఇచ్చాం. హుషారుగా షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. ఉదయం 6 గంటలకి మొదలైన ప్రయాణం... మధ్యాహ్నం 3 గంటలవుతోంది. నాన్‌స్టాప్‌గా నడక. శరీరంలో గ్లూకోజ్ శాతం తగ్గిపోతోంది. నడిచే ఓపిక లేదు. ఓ



**కోయ, గొత్తికోయ గిరిజనులు జాతి వైరం లేక జనతనా సర్కార్‌లో వ్యవసాయ పనిముట్లు తయారు చేసుకుంటున్న దృశ్యం**

చెట్టు కింద కూలబడిపోయాం.

ఆ పక్కన కమ్మరి కొలిమిలో గిరిజనులు వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నారు. అక్కడ కోయలు, గొత్తి కోయలు కలిసి పనిచేస్తున్నారు. వారిమధ్య ఎలాంటి వివక్షా కనబడలేదు. అన్యోన్యంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాం. బాగా నడిచి అలిసిపోయాం. ఒళ్ళంతా నీరసం ఆవరించింది. విపరీతంగా అలసట. తినడానికి ఏమైనా దొరుకుతాయా? అని అడిగాం.

ఏం తింటారని అడిగాడు. పళ్ళలాంటివి అని సమాధానమిచ్చాం. బత్తాయి సైజులో ఉన్న నిమ్మకాయలని ఇచ్చారు. చెప్పలేనంత పుల్లగా ఉన్నాయి.

అయినా ఒకటి రెండు తినేశాం. ఇక తినలేకపోతున్నామని గుర్తించిన గిరిజనులు భూమిలోంచి తవ్వి కొన్ని కందలు కాల్చి ఇచ్చారు. గబగబా నములుతూ



అడవిలో భూమిలో దొరికే కందగడ్డలే ఆహారం

మింగేస్తున్నాం. ఏవో తిని కడుపు నింపేసుకున్నాం. వంచి నీళ్ళు తాగేశాం. కాస్త శక్తిని కూడగట్టుకున్నాం. ఇంకా నడవాలా? అంటూ వేణు నా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. లేదు. ఇదే చివరి గూడెం. తిరిగి వెళ్ళిపోదాం అని నేను చెప్పాను. పటేల్ ఎంతకీరాడు. ఇక వెళ్ళిపోదా మనుకునేసరికి పటేల్ అడవి లోంచి వచ్చాడు. వరుసగా మా అందరికీ షేక్ హ్యాండ్ ఇచ్చాడు. అతడు షేక్‌హ్యాండ్ ఇచ్చిన తీరు ఓ మిలటరీ అధికారి షేక్ హ్యాండ్ ఇచ్చినట్లుగా అనిపించింది.

అక్కడికి ప్రభుత్వం రాదనీ, 15 ఏళ్ళుగా ఓట్లు వేయడం లేదనీ, అసలు ఆ ప్రాంతం ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియదనీ చెప్పాడు. దాదాలూరు వస్తారా అని అడిగితే రెండు సంవత్సరాల క్రితం వచ్చారు. ఇప్పుడు రావడం లేదని చెప్పాడు. ఇక లాభంలేదని అర్థమైపోయింది. పీఛేముడ్ అంటూ నడక మొదలుపెట్టాం. శరీరంలో శక్తిలేదు. కాళ్ళు బాగా పీకుతున్నాయి. ఇక ఇంటికే కదా అంటూ వేణు ప్రశ్నించాడు. ఇప్పుడు నడిచిందంతా మళ్ళీ నడవాలి. ఏ రాత్రవుతుందోనని విసుక్కున్నాడు. రమేశ్, వేణు ముందు నడుస్తున్నారు. నేను వెనుకబడిపోయాను. ఓ కర్రను నేలకు కొడుతూ నడుస్తున్నాను. అప్పుడప్పుడు కొందరు గిరిజనులు తమ పిల్లలతో ఎదురవుతున్నారు. దాదా ఎక్కడి నుంచి అని అడిగితే సంత అంటూ సమాధానం చెబుతూ ముందుకు సాగుతున్నారు. వేణు పరిగెత్తినట్టుగా నడుస్తున్నాడు. రమేశ్ అతణ్ణి అనుసరిస్తున్నాడు. నేను మాత్రం మెల్లిగా నడుస్తున్నాను.

దట్టమైన అడవి. ఓసారి తలెత్తి పైకి చూసే సరికి ఆలివ్ గ్రీన్ దుస్తులతో ఓ

సాయుధుడు రమేశ్, వేణులను ఆపివేశాడు. నేను కాస్త నడక వేగాన్ని పెంచి మూడు నిముషాల్లో దగ్గరికి చేరుకున్నాను. ఒకింత ఉద్వేగం. నీవు జుడుమా? మావోయిస్టులా? అన్నది ప్రశ్న. ఆలివ్‌గ్రీన్ దుస్తులని చూసి తప్పక మావోయిస్టులని అనుకున్నాను. షేక్‌హ్యాండ్ ఇచ్చి మమ్మల్ని మేం పరిచయం చేసుకున్నాం. తమని భూంకాల్ మిలీషియా అంటారు అని వారుకూడా పరిచయం చేసుకున్నారు. ఈయనతోపాటు మిగిలిన వారు కూడా పరిచయం చేసుకున్నారు. 'మా భూభాగంలోకి మీరు చొచ్చుకొని వచ్చారు. మీరు ఎవరన్నది ధ్రువపడాలి. అంత వరకు మీరు మాతోటే ఉండాలి' అని అన్నారు. మేం ఓ చెట్టు కింద కూర్చున్నాం. హై కమాండ్‌కు



**అడవిలో మమ్మల్ని అడ్డుకున్న మావోయిస్టుల కొత్త సైన్యం భూంకాల్ మిలిషియా**

వర్తమానం పంపారు. వారి ఆదేశాల కోసం వేచిచూస్తున్నారు. ఇక మనం బందీలయ్యాం అని రమేశ్‌తో చెప్పాను. అవును అన్నట్టుగా రమేశ్ తలూపాడు. కాని వేణు రికార్డింగ్ ఆపడం లేదు. మిలీషియా తుపాకులతో మమ్మల్ని అడ్డగించిన ముఖ్యమైన విజువల్స్ అన్నీ రికార్డయ్యాయి.

'మేం మీ హైకమాండ్‌ని కలుస్తాం, ఆ మెసేజ్‌ని కూడా పంపండి' అని వారితో

చెప్పాం. అప్పటివరకు అడవిలో స్వేచ్ఛగా తిరిగిన మేం... ఇక కాళ్ళు చేతులు కట్టివేసినట్లుగా ఫీలవుతున్నాం. పాస్‌కి వెళ్ళాలన్నా మిలీషియా అనుమతితోనే వెళుతున్నాం. మెల్లిగా అడవిలో చీకటి అలుముకుంటోంది. అడవిలో చీకటి పడితే వినిపించే శబ్దాలన్నీ మొదలయ్యాయి. మరో కామ్రేడ్ అక్కడి వచ్చాడు. ఇంకా అడవిలోనికి వెళ్ళాలంటూ మరికొంత లోపలికి తీసుకు వెళ్ళాడు. ఇక్కడ ఏం జరిగినా బయటి ప్రపంచానికి తెలిసే అవకాశమే లేదు.

దాదాపు 20 మంది వరకు మిలీషియా సభ్యులున్నారు. వీరంతా కిందిస్థాయి కార్యకర్తలు. వీరికి రాజకీయ చైతన్యం కూడా తక్కువే. హైకమాండ్ ఏది చెబితే అది చేస్తారు. ఎక్కడైనా తొందరపాటు ప్రదర్శిస్తారా అన్న భయం కూడా మాలో



**అడవిలో అనుమానితులుగా పట్టుబడి బంధీలుగా మారి...**

ఉంది. ఇలా వారితోపాటు చాలా దూరం అడవిలో నడిచాం. అడవిలో కనిపించే సన్నని దారులేవీ కనిపించడంలేదక్కడ.

ఇక ఇక్కడ ఆగండి అంటూ ఆ కామ్రేడ్ హుకుం జారీ చేశాడు. మీ దగ్గర ఉన్న లగేజీ అంతా నాయకులు చెక్ చేస్తారు. బ్యాగులు ఇచ్చేయాల్సిందిగా కోరాడు. లగేజ్ ఇవ్వమనగానే 'కెమెరాలతోపాటు అందులో ఇంకేమున్నాయి' అని ఆలోచించగానే

**'జనతన సర్కార్'లో విద్యార్థుల పాఠ్యాంశాలు కోయ, హిందీ కలిపి రాసిన భాషలో ఉంటాయి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న గిరిజనుల గురించి విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు. న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా యేర్పాటైన న్యాయమూర్తులు ప్రజా కోర్టుల్లో తీర్పు చెబుతుంటారు. వీలైనంత వరకు కౌన్సిలింగ్ పద్ధతుల్లోనే శిక్షలుంటాయి. 'జనతన సర్కార్'లో నివసించే ప్రజలకు ప్రజా కోర్టులో అటవిక శిక్షలు ఉండవు. శత్రువుతో మిలాఖతైన వారికే కఠినమైన శిక్షలుంటాయి.**

ఒక్కసారిగా షాక్‌కు గురయ్యే అంశం ఒకటి గుర్తుకు వచ్చింది.

చింతూరులో పోలీసు స్టేషన్ వెళ్ళినప్పుడు ఓ కానిస్టేబుల్ జైలునుండి పరారయిన నరహంతకుడు రామారావుని పట్టుకునేందుకు తన బయోడేటా ఇచ్చాడు. గతంలో తాను రామారావుని పట్టుకున్నాడు. ఈ విషయంలో ఖమ్మం ఎస్‌పి చౌహాన్‌ని సంప్రదించి టీవీ5 జాయింట్ ఆపరేషన్‌కి సహకరించాలని అతనిచ్చిన ఫోటోలతో కూడిన కాగితం నా జేబులో ఉంది. అలాగే సల్వాజుడుం నేతలు ఇచ్చిన విజిటింగ్ కార్డులు నా బ్యాగ్‌లో ఉన్నాయి.

ఈ రెండూ మిలీషియా కంటబడితే వారికి లేని కొత్త అనుమానాలు రేకెత్తే అవకాశం ఉంది. కింకర్తవ్యం? ఏం చేయాలి? ఆలోచనలో పడ్డాను. 'లగేజీ ఇచ్చేది లేదు. ఎంత దూరమైనా మేం వస్తాం' అంటూ మిలీషియాతో తెగేసి చెప్పాం. మూడురోజులు పడుతుందని వారన్నారు. 'అయితే బయలు దేరండి' అంటూ నడక సాగించాం. చెమట కారుతున్నకొద్దీ జేబులో ఉన్న కాగితాన్ని చేతిరుమాలులా తుడవడం మొదలుపెట్టాను. కాగితం మెల్లిగా మెత్తబడటం మొదలయింది. దానిని చేత్తో చింపుతూ మొత్తానికి ఆ కాగితాన్ని కరగతీశాను. ఇక మిగిలింది విజిటింగ్ కార్డులు. వేణుతో జాగ్రత్తగా జుడుం విజిటింగ్ కార్డులు నమిలి మింగేయమని చెప్పాను. వేణు ఎవరికంటాపడకుండా ఆ పనిని క్షణాల్లో చేశాడు. మళ్ళీ అడిగేసరికి పని అయిపోయిందని చెప్పాడు. 'ఇంకెంత దూరం నడవాలి?' అంటూ మిలీషియాను ప్రశ్నించాను. చెప్పాం కదా మూడు రోజులు పడుతుంది.

**చైనా తరహాలో బేర్‌ఫుట్ డాక్టర్లను 'జనతన సర్కార్' యేర్పాటు చేసింది. వివిధ రకాల మందుల్ని గిరిజనుల దగ్గర ఉంచుతారు. వైద్యంలో కొద్దిపాటి శిక్షణ ఉన్న వీరు ఆయా మందులను రోగాలను బట్టి అందిస్తారు. పదో తరగతి వరకు చదివిన యువకులు ఉపాధ్యాయులుగా ఉంటారు. వీరిని గురూజీ అంటారు. వడ్డీలేని రుణాల్ని గిరిజన రైతులకు 'జనతన సర్కార్' అందిస్తోంది. పోడు వ్యవసాయంపై తగు శిక్షణ యిచ్చింది. నీటి వసతి యేర్పాటు చేసింది. చాలాచోట్ల చెఱువుల్ని తవ్వారు. మంచినీటి కోసం అడవుల్లో బోరింగులు వేసారు. అడవిలో బోరింగుల ద్వారా 'జనతన సర్కార్'లో ప్రజలు నీటిని పట్టడం ఔరా అనిపించింది.**

ఏమో నడవటం మా వల్ల కాదు. లగేజీ తీసుకోండి అని చెప్పాను. 'ముందే చెబితే మీరే విన్లేదు. మేమేం లాక్కెళ్ళుతామని చెప్పామా? పార్టీ వీటిని పరిశీలించాలంతే! ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటుంది'. వీరంతా గిరిజనులే. గిరిజనేతరులు మీలో ఎవరూ లేరా అన్నప్పుడు, 'ఏం గిరిజనుల సమస్యల కోసం గిరిజనులు పోరాటం చేయకూడదా?' అని వారు ఎదురు ప్రశ్నించారు. లగేజీ ఇచ్చేశాం. మా దగ్గర ఉన్న సెల్‌ఫోన్లు కూడా ఇచ్చాం. వారు మా జేబులు చెక్ చేయడం గాని, అవమానకరంగా మాట్లాడటంలాంటివి ఎక్కడా చేయలేదు. చాలా మర్యాదపూర్వకంగా వ్యవహరించారు.

గిరిజనులైనా నాగరిక మానవులకంటే ఎంతో నాగరికంగా వ్యవహరించారు. 'ఉద్యమంలో విద్యాధికులు రావడంలేదా?' అని మేము ప్రశ్నించినప్పుడు 'వాళ్ళంతా బాగా చదివేసి స్కామ్‌లు చేయడంలో బిజీగా ఉన్నారు' అంటూ చమత్కరించారు. లగేజీ మొత్తం ఇచ్చాక ఎక్కడ ఉండాలి అని మేం అడిగాం. ఇంత విశాలమైన అడవిలో ఎక్కడైనా ఉండండన్నారు. ఆ గూడెంలో ఉంటాం అన్నాం.

లగేజీ ఇచ్చాక హాయిగా వట్టి చేతులతో చేతులూపుకుంటూ ఆటో దగ్గరికి వచ్చాం. పొద్దున వచ్చిన ఆటో డ్రైవర్ చీకటి పడేసరికి మేం రాకపోవడంతో అతను ఒకింత కంగారులో ఉన్నాడు. అతనికి ఇవ్వాల్సిన 300 ఇచ్చేసి మేం వేరే ఊరు

**చాలా తక్కువసార్లు మాత్రమే భోజనం తృప్తిగా తింటారు. బయటకు వెళ్ళినప్పుడు తీసుకెళ్ళే ప్రతీపైసాకు ఖర్చు రాసివ్వాల్సి ఉంటుంది. బయట సంచరించేటప్పుడు మామూలు భోజనం మాత్రమే చేయాలి. బిర్యానిలాంటి విలాసవంతమైన ఆహార అలవాట్లకు లోనుకాకూడదు. నిరాడంబరమైన అలవాట్లను అలవర్చుకోవాలి. లాప్‌టాప్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వారు వాడడం మేము చూశాం. దళాల్లో లైంగిక వేధింపులపై ఎంత గుచ్చి అడిగినా అలాంటివి ఉండవనే ఓ మహిళ సమాధానం చెప్పింది. బయట జరిగే ప్రచారం వాస్తవం కాదని ఆమె తెలిపింది.**

వెళ్ళాలి, ఇక వెళ్ళిపోమని చెప్పాం. మీరు రావడం లేదా అని ఆటో డ్రైవర్ ప్రశ్నించగా, లేదని చెప్పాం. అంతా చీకటి నిండుకున్నది. అంతకు ముందు మధ్యాహ్న భోజనం సిద్ధంచేసి మా రాక కోసం ఎదురు చూస్తున్న తెలుగువాళ్ళు కళ్ళలో వత్తులు వేసుకుని మాకోసం ఎదురు చూస్తున్నారు.

అడవిలో మాకు ఏదో జరిగి ఉంటుందని వారు ఊహించుకున్నారు. పరాయి రాష్ట్రంలో బిడ్డ కోసం తల్లి వేచి చూసినట్టుగా ఉంది ఆ దృశ్యం. మేం అక్కడికి చేరుకోగానే వారి కళ్ళలో ఆనందం కనబడింది.

ఆ రోజు ఉదయం కూడా స్నానం చేయకుండానే అడవిలోకి వెళ్ళాం. రోజంతా నడిచాం. ఒళ్ళంతా చెమట కంపుకొడుతోంది. వేడినీళ్ళ స్నానం చేశాం. వేడివేడి అన్నం ఆమె వడ్డించింది. ఆమె పేరును ఇక్కడ మేం చెప్పదల్చుకోలేదు. అన్నపూర్ణగా పరిచయం చేస్తున్నాం. ఆమెది వ్యవసాయ కుటుంబం. ఒక రకంగా చెప్పాలంటే ఓ మోస్తరు రైతు కుటుంబం.

అన్నపూర్ణ భోజనాలు వడ్డిస్తూ తన భర్తను మావోయిస్ట్‌లు చంపేశారని చెప్పింది. చాలాసార్లు హెచ్చరికలు చేసినా వాళ్ళ ఆయన వినిపించుకోలేదనీ చెప్పింది. మొండివాడు, ధైర్యవంతుడిగా చెప్పింది. మేం ఒక క్షణం భోజనం ఆపి చంపేంత తప్పు ఆయన ఏమి చేశాడని అడిగాం. ఆయన సిపిఎంలో పని చేశాడు. ఆ పార్టీలో పనిచేయవద్దని మావోయిస్టులు హెచ్చరించారు. వారికి వారికి గొడవలు ఉన్నాయి. అందుకే చంపేశారని ఆమె చెప్పింది.

మీ భర్త అనవసరంగా చనిపోయాడని మీరు అనుకోవడం లేదా అని అడుగ్గా లేదు, ఆయన సిద్ధాంతం ఆయనది. ఆయన నమ్మిన సిద్ధాంతానికి ప్రాణాలు వదిలారు. ఆయన హత్యకు గురైనప్పుడు నేను ఆయన పక్కనే ఉన్నాను. నాపట్ల మర్యాదగా వ్యవహరించారు. నీ చేత చాలా సార్లు అన్నం తిన్నాం నన్ను పక్కకు జరగమని చెపుతూ నాకు నమస్కరిస్తూ ఆయనను కాల్చేశారు. "మీ భర్తను చంపిన వారి గురించి మీరు ..." అంటూ ఇంకా ఏదో అడగబోతుండగా, 'లేదు. వారికి రాజకీయాలు ఉన్నాయి. మీకవేమీ అర్థం కావులే నాన్నా, మీరు భోజనం చేయండం'టూ టాపిక్ మార్చింది.

మాకొకటే అర్థమైంది. ఆ ప్రాంతానికి ఎవరొచ్చినా పస్తులతో వెళ్ళకూడదనేది ఆమె నియమం. మా వంటిపై ఉన్న బట్టలు ఉతికేసుకుని వాళ్ళ అబ్బాయి బట్టలు వేసుకున్నాం. ఆ గూడెంలో టీచర్లు ఉండే గుడిసెలో వెళ్ళి పడుకోమని చెప్పారు. వారికి తుమ్మ కట్టెలు కొనే కాంట్రాక్టర్లుగా పరిచయం చేసుకోమన్నారు. ఈ రాత్రి పోలీసు కూంబింగ్ పార్టీలు రాకుంటే బాగుండు అని ఆమె చేతులెత్తి దేవుణ్ణి ప్రార్థించింది. వస్తే ... అంటూ మేం ఆగాం.

'అడవిలోకి మీరెందుకు వచ్చారు? మీరొస్తే కూంబింగ్ పార్టీలు ఎందుకొచ్చాయి?' అనే ప్రశ్న ఉదయిస్తుంది. అప్పటికే మిలీషియా మేమున్న ప్రాంతాన్ని చుట్టుముట్టింది. నిశితంగా ఆ ప్రాంతాన్ని వారు గమనిస్తున్నారు. దాదాపు ఆ ప్రాంతం మిలీషియా ఆధీనంలోనే ఉంది.

కొందరు మిలీషియా సభ్యులు అన్నపూర్ణని పక్కకు పిలిచి ప్రశ్నించారు. మేం మిలీషియా చెప్పిన సమాధానాలు, అన్నపూర్ణ వారికి చెప్పిన సమాధానాలు ఒక్కటిగా ఉండటంతో వారు ఆమెను ఎక్కువ సేపు ఇంకేమీ ప్రశ్నించలేదు. అప్పటికే బాగా రాత్రయిపోయింది. వారు చెప్పిన చోటకు వెళ్ళి ఆ గుడిసెలో తుమ్మకట్టెలు కొనే కాంట్రాక్టర్లుగా పరిచయం చేసుకుని, ఆ రాత్రి అక్కడే పడుకునేందుకు ఆశ్రయం పొందాం.

నేను, రమేశ్ ఓ మంచంలో వేణు వేరొక మంచంలో పడుకున్నాం. నాకు ఎంతమాత్రం నిద్ర పట్టడం లేదు. ఏవేవో ఆలోచనలు బుర్రలో తొలుస్తున్నాయి.

ఎవరో గుడిసె దాకా వచ్చినట్టు అలికిడి. ఎండిన ఆకులపై అడుగులు పడిన చప్పుడు. అడవిలో నుంచి ఏవో జంతువుల శబ్దాలు. మెదడులో తొలుస్తున్న ఆలోచనలు, ఓ వైపు చలీ, దోమలూ – వెరసి నిద్రపట్టడం లేదు. ఇంతలో దడదడా తలుపులు ఎవరో కొట్టారు. రాత్రి ఒంటిగంటవుతోంది. టీచర్లు లేచి తలుపులు తెరిచారు.

ఓ వ్యక్తి ఒక్క ఉదుటున లోపలికి వచ్చాడు. 'ఏమైంది? మావోయిస్టులతో ఏమైనా ఇబ్బంది కలిగిందా...మిమ్మల్ని ఏమీ అనలేదా? మళ్ళీ ఎప్పుడు రమ్మన్నారు...?' లాంటి ఏవేవో ప్రశ్నలు గుప్పించాడు. మీరేనా జర్నలిస్టులు? ఏ పత్రికల్లో పని చేస్తారు? అంటూ ప్రశ్నల పరంపర కొనసాగించాడు. రమేశ్ అతనివైపు ఒక చూపు చూసి 'మాకేమీ కాలేదు. మీరెళ్ళి పడుకోండ'ని చెప్పాడు. మేమంతకు ముందు కాంట్రాక్టర్లమని చెప్పింది అబద్ధమని తేలిపోయింది. అతనితో మేమేమీ మాట్లాడవద్దని నిర్ణయించుకున్నాం. ఇక టీచర్ల మధ్యలో కూర్చున్నాడతను.

ఈడెమ్మ... అడవి బతకులు... అంటూ తిట్ల పురాణం మొదలుపెట్టాడు. 'పోలీసులు వస్తారు. వాళ్ళకి అన్నం పెట్టాలి. జుడుం వస్తే వాళ్ళకి అన్నం పెట్టాలి. అన్నలకి అన్నం పెట్టాలి. అందరూ తింటారు. తర్వాత వాడికెందుకు పెట్టావ్... వీడికెందుకు పెట్టావ్? అంటూ ఒకరిపై ఒకరికి ఉన్న కోపంతో మా ఉసురు తీస్తారు. ఒకరు తర్వాత ఒకరు కక్ష కడతారు.

థూ!... నీయమ్మ.... ఈ ఏజెన్సీ బతుకులు. ఉన్న నా రెండెకరాల భూమి అమ్ముకుని ఇక్కడి నుంచి వెళ్ళిపోతా. ఏదో పట్నం వెళ్ళి బతుకుతా. ఇప్పుడదంతా మాకెందుకు మీరెళ్ళండని టీచర్లు అన్నారు. మీరు టీచర్లు, మీక్కాకపోతే ఎవరికి చెప్పాలి. ఇంకెవరికి చెబితే ఏం లాభం?' అని అన్నాడు. 'అయ్యా! ఉదయం మాట్లాడుదాం. ఇప్పుడు మీరు వెళ్ళండి' అని టీచర్లు అన్నారు. 'ఉదయమైనా ఇదే, రాత్రయినా ఇదే, ఉదయమైతే విషయం మారదుగా... ఇప్పుడే మాట్లాడుదాం' అని అన్నాడు. హింస ఈరకంగా కూడా ఉంటుంది కాబోలనుకుని మాలో మేం నవ్వుకున్నాం. ఓ గంటసేపు అలా విసిగించి అతను వెళ్ళిపోయాడు. మళ్ళీ అదే సీన్. నిద్రపట్టడం లేదు. వేణు బాగా నడవడం వల్ల అలిసిపోయి నిద్రపోయాడు. లోపలెలాగూ నిద్ర పట్టడంలేదు. కాసేపు బయటకు వెళ్ళి కూర్చున్నాం. ఏవేవో కబుర్లు చెప్పుకున్నాం.

ఆ రాత్రి గడిచిపోయింది. తూర్పున తెలతెలవారుతోంది. ఆ ముందు రోజు చాలా దూరం నడిచినా రాత్రి నిద్ర లేకపోయినా... ఆ అలసట తాలూకు మత్తు ఏదీ శరీరంలో లేదు. బయట కనపడేటట్లు నేను, రమేశ్ కూర్చుని అక్కడే దొరికిన ఓ పుల్లతో పళ్ళు తోముకుంటున్నాం. రాత్రి వచ్చి ఆతృత ప్రదర్శించిన వ్యక్తి మళ్ళీ వచ్చాడు. అలా అటవీ ప్రాంతాల్లో ఉద్యమాల చట్రంలో హింస... ప్రతిహింసల మధ్య నలిగిపోయిన వ్యక్తుల తాలూకూ ఇతనో మచ్చుతునక అనిపించింది.

మావేపు రెప్పవాల్చకుండా అలానే చూస్తూ నిలబడిపోయాడు. మేమూ ఓ చిరునవ్వు నవ్వాం. దగ్గరకు వచ్చి మీరు పోలీసా? అని అడిగాడు. వెంటనే మీ శరీరాలు అలా లేవు. మీరు జుడుమా? అని ప్రశ్న, అతనే సమాధానం. మీకు కోయభాష రాదు. మీరు మావోయిస్టులా... మీ దగ్గర ఆయుధాల్లేవు... సార్ ఎవరు జుడుమో... ఎవరు పోలీసో... ఎవరు అన్నలో...? అర్థం కాని పరిస్థితి ఇక్కడ. మొన్న డాక్టర్ల వేషంలో పోలీసులు వచ్చారు. వైద్యం కోసం గ్రామస్థులు వెళితే తట్టాబుట్టా సర్దుకుని పారిపోయారు.

'ఎవరు ఏ వేషంలో వస్తారో తెలియని సంకట పరిస్థితి సార్... మాది. వీళ్ళు వాళ్ళనుకుని... వాళ్ళు వీళ్ళనుకుని నాలుక జారామో... ఇక జీవితకాలం సాలెగూడులో చిక్కినట్లే. మావోయిస్టులకి అనుకూలంగానో లేక వ్యతిరేకంగానో ముద్రపడ్డా... ఇక్కడ అదీ నరకమే... పట్టమంటే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపం...'

ఇలా చాలా జీవితాలు నలిగిపోయినట్లుగా మేం కూడా గమనించాం. పోరాటంలో ప్రభుత్వపక్షం వహించిన వారెవరూ గ్రామాల్లో లేరు. అటవీ గూడాల్లో లేరు. ఇక గూడాల్లో ఉన్నవారంతా మావోయిస్టుల అనుకూలురుగానే భావించాలి. జుడుం ఏర్పడ్డాకే మావోయిస్టు సమస్య తీవ్రరూపం దాల్చిందన్నది నిర్వివాదాంశం. పోలీసుకన్నా జుడుం అంటేనే ప్రజల్లో ఎక్కువ భయం. మిలీషియా సభ్యులు మేమున్న ప్రాంతంలో నీడలా తిరుగుతున్నారు.

ఉదయం 8 గంటలకంతా మిలీషియా చెప్పిన చోట మేముండాలి. గబగబా రెడీ అయ్యాం. రాత్రి ఉతికి దండెంపై ఆరేసిన బట్టలు వేసుకున్నాం. చలికాలం

కావడం వల్ల అవి ఆరలేదు. అయినా తడి బట్టలనే వేసుకున్నాం. అన్నపూర్ణ ఇంటికి వచ్చి మళ్ళీ టీ, టిఫిన్ తీసుకున్నాం. మిలీషియా సభ్యులు షార్ట్ వెపన్స్, విల్లంబులతో ఆ ప్రాంతంలో మమ్మల్ని, మా కదలికల్ని ఫాలో చేస్తున్నారు. మేం అడవిలోకి వెళ్ళేందుకు ఉద్యుక్తులవుతుండగా 'ఒక్క నిముషం...' అంటూ అన్నపూర్ణ ఆపింది.

ఏంటా అని ఆగాం. భావోద్వేగాలు ఆమె కళ్ళలో కనిపించాయి. అడవి లోపలికి వెళ్ళడం ఆమెకు ఎందుకో కీడు శంకిస్తోంది. ఏదైనా జరగరానిది జరిగితే అంటూ ఆగింది. నేను వెంటనే ఇంటి అడ్రస్‌తోపాటు భార్య లక్ష్మి సెల్‌ఫోన్ నెంబర్ రాసిచ్చాను.

రమేశ్ కూడా అదే పని చేశాడు. ఒకవేళ ఏదైనా జరిగి మేం చనిపోతే ఈ వార్తను  మా ఇంటికి చేరవేయండి అంటూ బయలుదేరాం. అయినా ఆమె ఎందుకో దుఃఖం ఆపుకోలేపోయింది. కూంబింగ్ పోలీసు పార్టీ రావొద్దని మళ్ళీ కోరుకుంది. వస్తే ఏమవుతుందని వేణు ఆమెను అడిగాడు. ఆమె విషయం చెప్పింది. వేణు ముఖంలో ఒక్కసారిగా భయం కనిపించింది. ఏమీ అవదు. అన్నలపై మాకు నమ్మకం ఉందంటూ  బయలుదేరాం.

గబగబా నడక మొదలుపెట్టాం. కెమెరామెన్ ఇదివరకటిలా హుషారుగా లేడు. ఏదో భయం అతడిని వెంటాడుతోంది. వేణును ఒంటరిగా వదలొద్దని నిర్ణయించుకున్నాం. 'వేణూ, ఏంటి సంగతులు?' అంటూ సంభాషణ మొదలుపెట్టాం. 'పెద్దపులికి ఇచ్చిన మాట ప్రకారం ఆవు అడవిలోకి వెళ్ళినట్లుంది' అన్నాడు వేణు. నువ్వు ఎక్కువగా ఊహించుకుంటున్నావు. అట్లాంటిదేమి ఉండదు. మనం ఇంటర్వ్యూతో తిరిగి వస్తాం...

అప్పుడు ఉదయం 7.30 గంటల సమయం. చెప్పిన చోటికి మేం చేరుకున్నాం. అక్కడ అడవిలో గిరిజనులు వడ్ల కుప్పకొడుతున్నారు. ఆ ముందు రోజు సరిగ్గా మాట్లాడని వారు ఇప్పుడు ఎందుకో బాగా మాట్లాడుతున్నారు. ఆ ముందు గూడెంలో మీకేమి చెప్పలేదా? అని ప్రశ్నించారు. లేదే అని సమాధానమిచ్చాం. అయితే ఇక్కడే కూర్చోమని చెప్పారు. మరికొందరు మిలీషియా సభ్యులు దూరంగా ఆ ప్రాంతాన్నంతా జల్లెడపడుతున్నారు.

ఒక్క రూపాయి కూడా వేతనం తీసుకోని వీరు ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారు. వరి బంతులు, ఎడ్లతో తొక్కుతున్న గిరిజన రైతులతో మాట్లాడాం. పంట ఇంటికి వచ్చాక పండుగ చేసి ధాన్యం కళ్ళాల్లోంచి ఎత్తుతామన్నారు. మరికొందరు మిలీషియా సభ్యులు అక్కడికి చేరుకున్నారు. మాకు చెప్పిన సమయం అరగంట లోపే అక్కడికి కొరియర్ చేరుకున్నాడు. మిలీషియా సభ్యులని పక్కకి పిలిచి మాట్లాడి అతను వెళ్ళిపోయాడు. మీకు మధ్యాహ్నం కాని, ఈ రోజు రాత్రి కాని పార్టీతో అపాయిట్‌మెంట్ ఉంటుందని వారు మాతో చెప్పారు. చాలా బాగా సరదాగా మిలీషియా సభ్యులతో కలిసిపోయాం.

'ప్యాంట్, షర్ట్ వేసుకున్న వ్యక్తులు అడవుల్లో కనిపిస్తే పోలీసులు ఏం చేస్తార'ని వేణు వారిని అడిగాడు. వారికి అర్థం కాలేదు. మేం హిందీలో ట్రాన్స్‌లేట్ చేసి చెప్పాం. బూట్లు వేసుకున్న వ్యక్తులు కనబడితే చంపేస్తారని వారు చెప్పారు.

మెల్లిమెల్లిగా ఎండ కాస్తోంది. ఓ వెదురు మంచాన్ని తీసుకొచ్చి ఓ చెట్టు నీడలో మిలీషియా సభ్యులు వేశారు. నేనూ, రమేశ్ దండకారణ్యంలో తిరగడం ఎంత రిస్కో. అన్నింటికీ ప్రిపేరయ్యే అడవిలోకి అడుగుపెట్టాం. అంతకు ముందు మాతో రావాల్సిన కెమెరామెన్ ఛత్తీస్‌గఢ్ పర్యటన అనగానే రానన్నాడు. దీంతో వేణుని భద్రాచలం వరకే అంటూ తీసుకువచ్చాం. వేణుకి ఈ విషయాలేవీ తెలియవు. ఎంతకీ పొద్దుగడవక పోవడంతో ఏంచేయాలో తోచడం లేదు.

మరోవైపు వేణు భయంతో ఉన్నాడు. ఇంతలో మిలీషియా సభ్యులు ఎక్కడినుంచో ఒక రేడియో తీసుకువచ్చి ఇచ్చారు. అందులో వైజాగ్ రేడియో స్టేషన్ తగిలింది. 1.30 గంటలకు తెలుగు వార్తలు విని నేనూ, రమేశ్ ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ వేణుని 'కాసేపు పడుకుంటావా?' అంటూ అడిగాం. వేణు ఏదో బాధలో ఉన్నాడు. మెల్లిగా కన్నీరు కార్చడం మొదలుపెట్టాడు. ఏమయింది? అని అడిగాం. అన్నలు కాసేపట్లో చంపేస్తారు. హాయిగా ఊర్లో బతికేవాణ్ణి. అడవిలోకి తెచ్చి చంపేస్తున్నారు అంటూ ఏడుస్తున్నాడు. వేణుని పక్కకు తీసుకు వెళ్ళి ఇలా ఏడిస్తే మిలీషియాకి కొత్త అనుమానాలొస్తాయి. ఏమీ అవదు మనం క్షేమంగానే తిరిగి వెళతామని నచ్చజెప్పాం. కొంత దుఃఖం మింగేసి కన్నీళ్ళు తుడుచుకున్నాడు వేణు. పారిపోయే ప్రయత్నం చేస్తే పరిస్థితి వికటిస్తుంది. ప్రస్తుతం మన చేతిలో ఏమీ లేదు. వాళ్ళు పిలిచినప్పుడు

**దళాల్లో ఉండే సభ్యులు టాల్కం పౌడర్లు, ఫెయిర్ అండ్ లవ్లీ, బొట్టుబిళ్ళలు లాంటి సౌందర్య సాధనాలు వాడరు. జుట్టు కటింగ్ కోసం బయటకి వెళ్ళరు. ఒకరి జుట్టు మరొకరు కత్తిరించు కుంటారు. వంటలు, సెంట్రీలలో పురుషులతో సమానంగా మహిళలు పనిచేస్తారు. గర్భం ధరించిన మహిళలకు ఒక ముద్ద భోజనం ఎక్కువ.**

వెళ్ళడం తప్ప. ఇలా సమయం గడిచిపోయింది.

సాయంత్రం 4 గంటల సమయంలో కొరియర్ వచ్చాడు. మీరు భోజనాలు చేశారా? అని అడిగాడు. లేదని మిలీషియా సభ్యులే చెప్పారు. అప్పటికే భోజనాలు వేరే చోట సిద్ధం చేస్తున్నారని మరో సభ్యుడు చెప్పాడు. అన్నం, చిక్కుడు కూర అన్నాడు. అక్కడే భోజనాలు ఏర్పాటు చేశారు. మీరు చాలా దూరం నడవాల్సి ఉంటుంది. ముందుగా కడుపునిండా భోజనం చేయండని చెప్పాడు. చిక్కుడు కూర అంటే అడవి చిక్కుడు కాయలను కోసి ఉడకబెట్టి అందులో గుప్పెడు పసుపు కలిపారు. మేం అతిథులం కాబట్టి వారి దృష్టిలో ఇది మంచి భోజనం. భోజనాలు వడ్డించారు.

ఇదే చివరి భోజనం అంటూ వేణు మళ్ళీ ఏడుపు మొదలుపెట్టాడు. వేణు ఏడవటాన్ని మిలీషియా సభ్యులు గమనించారు. వయసులో చిన్నవాడు కావడం వల్ల కంగారు పడుతున్నాడని నేను చెప్పాను. వారు కూడా వేణుని ఓదార్చారు. భోజనం చేసి చేతులు కడుక్కున్నాక వేణు ఒంటరిగా నడుస్తూ వెళుతున్నాడు. ఎటు వెళుతున్నాడో అర్థం కాక నేను 'వేణూ' అని గట్టిగా అరిచాను. వెంటనే రమేశ్ "నేను మనం అక్కడ కూర్చున్న చోట నోట్ చేసుకున్న నోట్‌బుక్ మర్చిపోయాను తెమ్మని నేనే చెప్పాను" అని చెప్పాడు.

హమ్మయ్య అని ఊపిరిపీల్చుకున్నాను. కొందరు గిరిజనులు తాటికల్లు తీసుకు వచ్చారు. తాడి పీతే క్యా? అంటూ అడిగారు. గతంలో ఓసారి రమేశ్, వేణు సామాజిక కార్యకర్తలతో కలిసి కల్లు తాగారు. మళ్ళీ ఇక్కడా తాగుతారేమోనని భయపడి 'లేదు, మావాళ్ళెవరూ తాగరు' అని చెప్పాను. రమేశ్ ఓ నవ్వు నవ్వాడు. ఇక ప్రయాణం మొదలైంది.

**దళాల్లో ప్రేమ కూడా చిగురిస్తుంది. ఐతే 6 నెలల గెరిల్లా జీవితానికి అలవాటుపడని వారు పెళ్ళికి అనర్హులు. దళంలోకి రాకముందు పెళ్లై, విడాకులు కాకపోతే కూడా పెళ్ళికి అనర్హులు. పెళ్లైన తర్వాత వారు ఒకే దళంలో ఉండరు. 6 నెలలకొకసారి మాత్రమే కలుసు కుంటారు. అదీ ఒకరోజు మాత్రమే. చాలామంది గెరిల్లా జీవితానికి కమిట్‌మెంట్‌గా వచ్చినవారు. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేయించుకున్నవారు చాలా మంది ఉన్నట్టు తెలిసింది.**

వాగులు, వంకలు దాటుతున్నాం. చకచకా కొరియర్ ముందు నడుస్తున్నాడు. దట్టమైన అడవి. ఓ కొండ ఎక్కి దిగాం. నడక... నడక... నడక... అంతే ప్రయాణం. మాటలూ... ముచ్చట్లూ... ఏమీ లేవు. నిశబ్దంగా ప్రయాణం సాగుతోంది.

ఇంకెంత దూరం అని ఎవరూ అడగట్లేదు. ఇలా నడిచాక మళ్ళీ ఓ గూడెం వచ్చింది. ఇక్కడ మళ్ళీ వెదురు మంచం. ఈసారి చింతచెట్టు కింద కూర్చున్నాం. అడవిలో చింతచెట్టు ఉండటమేమిటంటూ విచిత్రంగా చూశాం. గొత్తికోయలు నివాసమున్న ప్రాంతంలో వారి పూర్వీకులు చింతచెట్లు నాటుతారనీ, పోడు వ్యవసాయం తర్వాత ఆ ప్రాంతం ఖాళీ చేసి వెళ్ళిపోయినా వ్యవసాయయోగ్యమైన భూములున్నాయని తెలియడం కోసం చింత చెట్లు నాటతారనీ గిరిజనులు చెప్పారు.

ఇక్కడికే పార్టీ వస్తుందనీ, వారు దాదాపుగా 30-40 కిలోమీటర్ల దూరంలో ఉన్నారనీ చెప్పారు. ఆ గూడెంలో అడవిలో దొరికే పుల్లలతో కొందరు చీపుర్లు తయారు చేస్తుండగా, మరికొందరు బుట్టలు అల్లుతున్నారు. చింతచెట్టు కింద చల్లని గాలివీస్తోంది. ఆ గూడెంలో ఎవరూ తలెత్తి కూడా చూడడం లేదు. ఉదయం వచ్చి వెళ్ళిన కొరియర్ అక్కడే ఉన్నాడు. కాసిన్ని మంచినీళ్ళు తెప్పించుకొని తాగాం.

మేం పార్టీ రాక కోసం వేచి ఉన్నాం. వాళ్ళు కొన్ని పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్నారు. వారు రావడానికి కొన్ని గంటల సమయం పట్టవచ్చన్నారు. మేం ఏవో కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నాం. వేణుకు కొంచం భయం తగ్గింది.

కొరియర్ కామ్రేడ్స్, ప్రజాసంఘాల బాధ్యులతో మేం మమేకమయ్యాం. చక్కగా కబుర్లు చెప్పుకుంటున్నాం. మళ్ళీ మిలిషియా ఆ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్ళింది.

మమ్మల్ని అతిథులుగానే చూస్తున్నారు. చాలా మర్యాదగా వ్యవహరిస్తున్నారు. ఇంతలో తల తిప్పి చూడగానే ఆలివ్‌గ్రీన్ దుస్తులు ధరించిన మావోయిస్ట్‌లు వరుస క్రమంలో కవాతు చేస్తున్నట్టుగా వస్తున్నారు.

వాళ్ళను చూడగానే మాలో ఆనందం ఉప్పొంగింది. రమేశ్‌కు వారిని చూడాలన్న జీవితకాలపు స్వప్నం నెరవేరింది. మా దగ్గరకు చేరారు. మేం చిరునవ్వుతో కరచాలనం చేశాం. పి.ఎల్.జి.ఎకు చెందిన వీరందరి దగ్గరా ఆధునిక ఎస్.ఎల్.ఆర్ తుపాకులున్నాయి.

వీరంతా ఓ గెరిల్లా దళం అనుకుంటా. 10 నుంచి 15 మంది దాకా సభ్యులున్నారు. ఒకరిద్దరు మహిళలు కూడా ఉన్నారు. ఎటువారు అటు సభ్యులంతా కమాండర్‌కు కవచంలా రెండు అంచెలుగా అర్ధచంద్రాకారంలో విడిపోయారు. అనుక్షణం కనుచూపుమేరకు కనపడుతున్న ప్రదేశాన్నంతా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

మా పేర్లతో మేం కమాండర్‌కు పరిచయం చేసుకున్నాం. కోయభాషలో సంభాషణ మొదలుపెట్టాడు. మాకేమీ అర్థంకాలేదు. అతను మాత్రం నవ్వుతూ దగ్గరగా కోయభాషలోనే మాట్లాడుతున్నాడు. ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు. ప్రతిసారీ మా వెంట తీసుకువెళ్ళిన కోయ భాష తెలిసిన 'పింటు' మాతో లేడు. సందు కోయ అంటు కోయభాష మాత్రమే మాట్లాడుతున్నాడు. మేం హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో ఏ భాష అయినా ఫరవాలేదు అంటున్నాం. అతను ఎంత మాత్రం వినిపించుకోవడం లేదు. కోయ భాషలోనే మాట్లాడుతున్నాడు.

ఏమి చేయాలో అర్థంకాక జుట్టుపీక్కున్నాం. ఒక్క నిముషం ఆలోచించాక ఒక ఆలోచన తట్టింది. ఇంతకు ముందు వచ్చిన కొరియర్‌కు హిందీ వచ్చు. అతడిని పిలిపించమని అడుగగా, సదరు కొరియర్‌కు కోయ భాష రాదంటూ మళ్ళీ కోయ భాషలోనే మాట్లాడటం మొదలుపెట్టాడు. అయితే చాలా రోజులపాటు అడవిలో గడిపిన కారణంగా కోయ భాషను కొంతమేరకు అర్థం చేసుకోగలం కాని కోయ భాషలో మాట్లాడలేని స్థితి మాది.

ఆయన కోయ భాషలో మాట్లాడుతుంటే మేం తెలుగు, హిందీ భాషల్లో మాట్లాడాం. మాకు చాలా విసుగు అనిపించింది. అయినా మా అవస్థను ఏ మాత్రం



**మావోయిస్టు పార్టీ నేత విజయ్ ముందు బంధీలుగా...**

పట్టించుకోకుండా అతను కోయ భాషలోనే మాట్లాడుతున్నాడు. కాసేపు మౌనంగా మంచంపై కూర్చున్నాం.

కొద్దిసేపటికి మావోయిస్ట్ నేత ఓ చిరునవ్వు నవ్వి 'కామ్రేడ్స్, నేను హిందీలోనూ మాట్లాడగలను' అని అన్నాడు. 'మరి ఇంతసేపు కోయ భాషలో ఎందుకు మాట్లాడా'రని ప్రశ్నించాం.

మేం గనుక కోయ భాషలో మాట్లాడి ఉంటే సల్వాజుడుంకు చెందిన వారమనుకుంటే ట్రీట్‌మెంట్ మరొక విధంగా ఉండేదేమో. ఇక కమాండర్ హిందీలో పరిచయం చేసుకున్నాడు. తన పేరు మాత్రం చెప్పలేదు. అతను మాత్రం కోయ జాతికి చెందిన వాడే. కాని విద్యావంతుడు.

మాది కరీంనగర్ జిల్లా అనగానే ఓ సభ్యుడిలో ఒకింత ఆనందం కలిగింది. అయినా మనకెందుకు వారి అడ్రసు అనుకుని ఆ దిశగా ఆరా తీయలేదు. బహుశా అతడిది కరీంనగర్ జిల్లా కావచ్చు. కమాండర్ తప్ప ఎవరూ మాట్లాడటం లేదు.

**పిఎల్‌జిఎ ఆధ్వర్యంలో సైన్యాన్ని కూడా ఇక్కడి పార్టీ యేర్పాటు చేసింది. మేం చూసిన పిఎల్‌జిఎ సభ్యుల దగ్గర అధునాతన ఎస్‌ఎల్‌ఆర్, ఏకె-47 లాంటి రైఫిళ్ళు కనిపించాయి. ఉత్తర తెలంగాణాలో మాదిరిగా గెరిల్లాలు బక్కచిక్కి లేరు. అంటే ఆహారం వీరికి సరిగా అందుతోందని అర్థం చేసుకోవాలి.**

అంతా పిన్‌పాడ్రాప్ సైలెంట్. మధ్యలో ఎవరో పోతూపోతూ దారిలో మాట్లాడుకుందామన్నాడు.

మాది కరీంనగర్ జిల్లా అంటూ వారినుద్దేశించి అన్నారు. వెంటనే కమాండర్ కరీంనగర్‌జిల్లా లేకుండా మావోయిస్ట్ పార్టీ ఎక్కడ ఉందని నవ్వుతూ అన్నాడు. మా ఎదురుగా ఉన్న మంచంపై కూర్చున్నాడు. చెప్పండి అంటూ భుజంపై చేతులు వేసి మాట్లాడుతున్నాడు. మాట్లాడబోయే ముందు ఎందుకైనా మంచిదని మా గుర్తింపు కార్డులు చూపెట్టాం.

'మీరు జర్నలిస్టులని మాకు ధ్రువపడింది. కాని ఇంత సాహసం చేసి మీరు ఎలా రాగలిగారు? మీకు భయం అనిపించడం లేదా?' అని ప్రశ్నించాడు. వెంటనే నేను 'విప్లవకారులేమైనా పిచ్చివాళ్ళా?' అన్నాను. అందరూ ఒక్కసారిగా నవ్వారు. 'ఇది మా రాజ్యం. మీరు మా అనుమతి లేకుండా వచ్చారు' అనగానే, 'ఇది విముక్తి ప్రాంతమా, మీ రాజ్యమంటున్నారు?' అని ప్రశ్నించాం. 'అవును దాదాపుగా అంతే. పది జిల్లాల్లో మేం మా ప్రత్యామ్నాయ ప్రభుత్వం నడుపుతున్నాం. మంత్రిత్వశాఖలూ ఉన్నాయి. ఇక్కడి ప్రజలు పన్నులు మాకే చెల్లిస్తున్నారు. ప్రభుత్వానికి కాదు'. 'మరి ఒక గొత్తికోయ జాతిని వెంట వేసుకుని పోరాటం చేసే మీరు?...' అంటూ ప్రశ్నిస్తుండగానే, "అది తప్పుడు అభిప్రాయం. 70 శాతం కోయలు మాతోనే ఉన్నారు. బయట జరిగే ప్రచారానికీ, లోపలున్న వాస్తవానికీ చాలా తేడా ఉంది. కోయలు, గొత్తికోయల మధ్య వైషమ్యాలున్నా అవి మాత్రం మా ప్రాంతంలో లేవు. వీరు కలిసిపోయి పెళ్ళిళ్ళు కూడా చేసుకుంటున్నారు. ఈ తరహా పెళ్ళిళ్ళను మావోయిస్ట్ పార్టీ ప్రోత్సహిస్తుంది. మేం నడుపుతున్న ప్రభుత్వం 'జనతన సర్కార్'. ఇది ప్రజల ఎజెండాతో నడుస్తుంది. ప్రజల ఆకాంక్షలతో నడుస్తుంది" అని చెప్పుకుంటూ వెళ్ళాడు.

**నక్సలిజం పుట్టిందిలా...**

**దేశంలో నక్సల్ ఉద్యమం పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లాలోని నక్సల్‌బరిలో 1967లో పుట్టింది. ఇక్కడ కోర్టులో గెలుచుకున్న తమ భూమిని మే 2న దున్నుకోడానికి గిరిజన యువకులు యత్నించగా, స్థానిక భూస్వామి అనుచరులు వారిపై దాడిచేశారు. కమ్యూనిస్టు నేత చారు మజుందార్ నేతృత్వంలో గిరిజనులు వారిపై తిరుగుబాటును చేశారు. తమ భూములను చేజిక్కించుకోవడం మొదలుపెట్టారు. ఈ తిరుగుబాటును 72 రోజుల తర్వాత గానీ సీపిఎం నేతృత్వంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అదుపు చేయలేకపోయింది. ఈ సమయంలో జరిగిన ఘర్షణల్లో ఓ ఎస్సై, తొమ్మిది మంది గిరిజనులు చనిపోయారు. ఈ తిరుగుబాటు దేశవ్యాప్తంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అదే నక్సలిజంగా అవతరించింది.**

అంతకుముందు మా దగ్గర నుండి తీసుకెళ్ళిన లగేజ్ సంచులు మా ముందు ఉంచారు. అందులో ఏ చిన్న వస్తువు లేకపోయినా అందుకు సంబంధించిన కాస్ట్ పే చేస్తామని కమాండర్ చెప్పారు. 'అన్నీ సరిగానే ఉంటాయి లెండి. మీపై మాకు నమ్మకం' అన్నాం. అలా కాదు, ఓ సారి మీ లగేజ్ చెక్ చేసుకోమన్నారు. ఆ... ఫర్వాలేదులెండన్నాం. అలా కాదు, అనేక చేతులు మారుతూ మా దగ్గరికి వచ్చాయి. లేదు. మీరు చూసి ఓ సారి చెప్పాల్సిందేనని పట్టుపట్టారు. లగేజ్ అంతా చెక్ చేసుకున్నాం. అన్నీ సరిగానే ఉన్నాయి.

కెమెరాలు ఆన్‌చేసి చూసే ప్రయత్నం చేసినట్టు, సెల్‌ఫోన్‌లో మెస్సేజ్‌లు చెక్ చేసినట్టు వాటి తాలూకు గుర్తులున్నాయి. కాని మా లగేజ్‌లో ఒక్క వస్తువు కూడా తీయలేదు. 'ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసేవారికి వీటి అవసరం ఏముంటుందిలే' అని మనస్సులో అనుకున్నాం. మళ్ళీ చర్చలోకి దిగాం.

ప్ర : **ఉత్తర తెలంగాణాలో ఉవ్వెత్తున ఎగిసిపడ్డ మీ ఉద్యమం ఎందుకు వెనక్కు వెళ్ళింది?**

**జ :** అవును. ఆరడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టు గెరిల్లా ఉద్యమం సాగుతుంటుంది. అక్కడ మా దళాలు లేవు. మేం

## చట్టం ఏం చెబుతోంది?

**చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నియంత్రణ) చట్టం-1967లోని మూడో సెక్షన్ కింద కేంద్ర ప్రభుత్వం ఏ సంస్థనైనా నిషేధించవచ్చు. ఏదైనా సంస్థను 'ఉగ్రవాద సంస్థ'గా ప్రకటించవచ్చు. ఇదే చట్టంలోని సెక్షన్ 2 (1) (ఎం) కింద ఉగ్రవాద సంస్థల జాబితాలో ఏ సంస్థనైనా చేర్చవచ్చు. ప్రజల్ని సమీకరించి వారి సమస్యలపై ఉద్యమిస్తున్న మావోయిస్టు పార్టీని ఉగ్రవాదుల సరసన చేర్చడాన్ని కాంగ్రెస్, బిజెపి మినహా దేశంలో అన్ని రాజకీయ పార్టీలు తప్పుపట్టాయి.**

రీట్రీట్ అయ్యాం. ఉద్యమ అవసరాల రీత్యా ఛత్తీస్‌గఢ్‌కు ఉద్యమం వచ్చింది.

**ప్ర : తెలంగాణా జిల్లాల్లో మీ అవసరం లేదా?**

**జ :** అలా అని కాదు. ఉద్యమం అవసరాల రీత్యా ఛత్తీస్‌గఢ్‌కు నుంచి మరో చోటికి ప్రస్థానం చెందుతూనే ఉంటుంది.

**ప్ర : ఉత్తర తెలంగాణాలో మీరు బిస్తర్ ఎత్తేసినట్టేనా?**

**జ :** ఎప్పటికీ అలా ఉండదు. అక్కడ సాయుధ దళాలు లేవు. ప్రజలతో సంబంధాలు, మా షెల్టర్లు, మా సానుభూతిపరులు, ప్రజాసంఘాల వారితో సంబంధాలు కొనసాగుతూనే ఉన్నాయి.

**ప్ర : తెలంగాణ జిల్లాల్లో దొరల వ్యతిరేక పోరాటం, వెట్టిచాకిరి నిర్మూలన ద్వారా గ్రామీణ జనం తలెత్తుకొని తిరిగేలా మీరు చేసిన పోరాటాలు మంచి ఫలితాలే ఇచ్చాయి. ఆ తర్వాత ప్రోగ్రాం ఇవ్వడంలో మీరు వైఫల్యం చెందలేదా?**

**జ :** ప్రోగ్రామింగ్ అనేది నిరంతరం ఉంటుంది. శత్రు నిర్బంధంలో కూడా ఉద్యమం ముందుకే వెళ్ళింది కానీ, వెనకకు తగ్గలేదు. ఉత్తర తెలంగాణాలో జనం గుండెనిండా విప్లవమే ఉంది. ప్రజలకు, మాకు మధ్య తుపాకులు అడ్డుపెట్టి వారినుంచి మమ్మల్ని వేరుచేయాలనే పాలకుల కుటిల యత్నాలను మేం ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ముందుకు

సాగుతున్నాం. మళ్ళీ గ్రామాల్లో ఆలివ్‌గ్రీన్ దుస్తుల విప్లవకారులు ప్రజల మధ్యకు వస్తారు. తెలంగాణా జిల్లాల్లో విప్లవ పార్టీ ప్రజల జీవితాల్లో భాగం. దాన్ని ఎవరు విడదీయలేరు.

**ప్ర : రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే చోట విప్లవ నినాదాలు ఏం చేస్తాయి?**

**జ :** డెఫినెట్‌గా వారు విప్లవంలోకే రావాలి. ప్రపంచీకరణ దుష్ఫలితాల ప్రభావమే ఈ ఆత్మహత్యలు. భవిష్యత్తులో మేం తప్ప మరెవరూ ఈ అంశాలను టేకోవర్ చేయలేరు. ఛత్తీస్‌గఢ్‌లో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం లేదు. ఇక్కడ స్వయంపాలన చేసుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే జనతన సర్కార్ మంత్రిత్వ శాఖలను ఏర్పాటు చేసుకుంది.

**ప్ర : ఇలాంటి ప్రయత్నాలు తెలంగాణా జిల్లాల్లో ఎందుకు చేయలేదు?**

**జ :** అక్కడ అలాంటి ప్రయత్నాలు చేయలేదని కాదు. అక్కడ గ్రామరాజ్య కమిటీలు ఏర్పాటుచేశాం. శత్రువు నిర్బంధంతో అనుకున్న ఫలితాలు సాధించలేకపోయాం. చెరువుల నిర్మాణం తదితర కార్యక్రమాలు అప్పుడే చేపట్టాం.

**ప్ర : ప్రజలు మిమ్మల్ని నమ్మి విప్లవంలోకి వస్తే ఏం మిగిలింది?**

**జ :** ఒక్క గంటలో, ఒక్క రోజులో తేలేది కాదు ఈ విప్లవం. దీర్ఘకాలిక సాయుధ పోరాటం ద్వారా మాత్రమే విప్లవం విజయవంతమవుతుంది.

**ప్ర : ఇప్పుడు కార్మికులు లేరు. రైతులు, కూలీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎవరు విప్లవానికి నాయకత్వం వహిస్తారు?**

**జ :** ప్రజలు విప్లవంలోకి వస్తున్నారు. విప్లవకారులకు చేతినిండా పనుంది. దండకారణ్యంలో పదికోట్ల మంది గిరిజనులు ఉన్నారు. వీరితోనే భారతదేశ విముక్తి సైన్యం ఏర్పడుతుంది. భారత విప్లవానికి గిరిజనులు అగ్రభాగాన ఉంటారు.

**ప్ర: సల్వా జుడుం ఎలా ఉంది?**

## రాష్ట్రంలో నిషేధమిలా...

**తెదేపా హయాంలో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1984లో పీపుల్స్ వార్ గ్రూప్‌తో పాటు దాని అనుబంధ సంస్థలైన రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, సింగరేణి కార్మిక సమాఖ్య, రైతు కూలీ సంఘం, రాడికల్ యూత్ లీగ్, విప్లవ కార్మిక సమాఖ్య లాంటి ప్రజా సంఘాలపై నిర్భంధం విధించారు.**

**1989లో చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ నిర్బంధం రద్దయింది.**

**1992లో జనార్దనరెడ్డి సీఎం అయ్యాక మళ్ళీ నిషేధం.**

**తెదేపా ప్రభుత్వ హయాంలో... నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ 1995, జూన్‌లో నిషేధం సడలింపు.**

**1996లో అదే ప్రభుత్వ హయాంలో ప్రజా భద్రత చట్టం కింద పీపుల్స్‌వార్ సహా ఆరు ప్రజా సంఘాలపై నిషేధం.**

**2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నక్సల్స్‌తో చర్చలు జరుపుతామన్న ఎన్నికల హామీకి అనుగుణంగా జులై 21న నిషేధం తొలగింపు.**

**అధికార పార్టీ ఎమ్మెల్యే దారుణ హత్య నేపథ్యంలో 2005, ఆగస్టు 17న మళ్లీ నిషేధం.**

**జ :** సైద్ధాంతికంగా రెండు భిన్న ధ్రువాలుగా చెప్పుకునే కాంగ్రెస్, బిజెపిలు మమ్మల్ని అణచివేయడంలో మాత్రం ఒక్కటయ్యాయి. ఇక్కడి రమణ్‌సింగ్ సర్కారు మహేంద్రకర్మ నేతృత్వంలోని సల్వాజుడుం సైతాన్ సేనగా మారి ఇక్కడి ప్రజల మాన, ప్రాణాలను హరిస్తోంది. జుడుం క్యాంపుల్లో ఉన్న అమాయక గిరిజనుల్ని తిరిగి తమ గ్రామాలకు రావాల్సిందిగా కోరుతున్నాం. ఇప్పుడిప్పుడే గిరిజనులు తమ స్వగ్రామాలకు చేరుకుంటున్నారు.

సర్కారుకు తొత్తులుగా మారి తుపాకులు పట్టి గ్రామాల్లో అరాచకాలు

**దేశంలో 2003-2008 మధ్య జరిగిన మావోయిస్టు సంబంధిత సంఘటనల్లో 2871 మంది పౌరులు, 982 మంది పోలీసులు, 1148 మంది నక్సల్స్ మరణించారు.**

సృష్టిస్తున్న ఎస్పీవోలను మాత్రం వదలేది లేదు. ఇటీవల అసెంబ్లీ తలుపులు మూసి, మీడియాను బయటకు పంపించి సమావేశాలు నిర్వహించారు. తమ నిర్ణయాలను మీడియాకు తెలియజేయడంగానీ, ప్రజల ముందు ముఖం చూపడానికి పాలకులు జంకుతున్నారు. నాలుగు గోడల మధ్య రహస్యంగా నిర్ణయాలు తీసుకుంటున్న సర్కార్‌కు బందూకులతోనే సమాధానం చెబుతాం. సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మను మావోయిస్ట్ పార్టీ మట్టుబెడుతుంది.

(కెమెరామెన్ లొకేషన్ చిత్రీకరించే ప్రయత్నం చేసినప్పుడు కమాండర్ సున్నితంగా వారించారు.) జనతన సర్కార్ చూసేందుకు పిఎల్‌జిఎ విన్యాసాలు, అలాగే అధికార ప్రతినిధి ఇంటర్వ్యూను కూడా మీకు ఇస్తారని, కాని అందుకు వచ్చేముందు అనుమతి తీసుకోవాలని, ఇలా పొరబాట్లు మాత్రం చేయవద్దని చెప్పారు.

కామ్రేడ్లతో మేం సెలవు తీసుకున్నాం. సమావేశం ముగిసింది. ఓ కొరియర్‌ను తిరుగు ప్రయాణం దారి చూపేందుకు మా వెంట పంపారు. అలా ఆ అడవికి వీడ్కోలు పలికాం.

మాకోసం అటవీ గ్రామాల్లో వేచి ఉన్నవారు మేం సురక్షితంగా బయటపడటం చూసి ఆనందంతో ఊపిరిపీల్చుకున్నారు. మాకు సహకరించిన గిరిజనులకు, రాత్రి పడుకోవడానికి ఆశ్రయం ఇచ్చిన వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకున్నాం. మావోయిస్ట్‌ల సంచారంతో ఆ ప్రాంతం ఎక్స్‌పోజ్ కావడం వల్ల ఎక్కువ సేపు మేం ఆ ప్రాంతంలో ఉండకూడదని భావించాం.

ఇంతలో సమీప పట్టణం నుంచి వచ్చిన ఓ ఆటోను గమనించి అదే ఆటోను తిరుగు ప్రయాణానికి ఎంగేజ్ మాట్లాడుకుని బయలుదేరాం. ఆటోలో కూర్చుని కొద్ది దూరం ప్రయాణించాక నెక్స్ట్ ఏం చేద్దామని నేను అనగానే కెమెరామెన్ ముఖంలో మరోసారి భయం కనిపించింది.

ఇంకేమి మిగిలింది? అన్నీ అయిపోయాయి కదా అన్నాడు. సల్వాజుడుం మహేంద్రకర్మను కలిసి ఇంటర్వ్యూ తీసుకుంటేనే మన పర్యటన విజయవంత మవుతుందని అన్నాను. రమేశ్‌కు మహేంద్రకర్మను కలవాలని ఉన్నా, వాళ్ళ చెల్లెలి సంవత్సరీకం ఉన్న కారణంగా తాను రాలేనని చెప్పాడు. అలా తిరుగు ప్రయాణం సాగుతూ ఉండగా బాగా రాత్రి అయిపోయింది.

మరోమారు అటవీప్రాంతం గుండా ఆటో వెళ్ళాల్సి ఉంది. అలా కొన్ని కిలోమీటర్లు రోడ్డుకిరువైపులా అడవి. ఆటోవాలా జాగ్రత్తగా ఆటో నడుపుతున్నాడు. ఓ చోట సన్నని నీటి ప్రవాహం.

జాగ్రత్తగా ఆటో దాటించాడు. కొన్ని చోట్ల మేం ఆటో దిగాల్సి వచ్చింది. అల్లంత దూరంలో కరెంటు వెలుగులు కనిపించాయి. రోడ్డుకు దగ్గరగా వస్తున్నట్టుగా భావించుకున్నాం. కొద్ది సేపట్లోనే తారురోడ్డు ఎక్కాం. మధ్యలో ఓ గ్రామంలో ఆటో ఆపి టీ తాగాం.

రాత్రి 11 గంటల సమయంలో మేమున్న గమ్యస్థానానికి చేరుకున్నాం. ఆటో దిగగానే కెమెరామెన్ ఒక్కసారిగా ఒళ్ళు విరిచి నిట్టూర్పు వదిలాడు. రమేశ్ వెళ్ళిపోతే కెమెరామెన్ ఉంటాడా? కెమెరామెన్ లేకుండా మహేంద్రకర్మను కలవడం ఎలా అన్న ప్రశ్నలు లోలోపల బాధిస్తున్నాయి. కెమెరామెన్‌ను పక్కకు తీసుకువెళ్ళి రమేశ్ వెళ్ళినా మన పర్యటన కొనసాగిద్దామన్నాను.

'ఆ... కుదరదు. నేను వెళ్ళిపోవాలి' అన్నాడు. దంతెవాడ జిల్లా వెళ్ళి మహేంద్రకర్మ ప్రత్యేక ఇంటర్వ్యూ తీసుకువస్తే అది తొలి తెలుగు న్యూస్ ఛానల్‌కు వచ్చినట్టు అవుతుందని కెమెరామెన్‌కు నచ్చజెప్పాను. అప్పటికే హోం సిక్‌తో ఉన్న కెమెరామెన్ వేణు అయిష్టంగానే ఒప్పుకున్నాడు. మిత్రుడు రమేశ్ ఆంధ్రాకు ప్రయాణం కాగా, మేం దంతెవాడ జిల్లాకు ప్రయాణం మొదలుపెట్టాం. అన్ని బేస్ క్యాంపులు దాటుతూ దంతెవాడ చేరుకోవాలి. ప్రతి బేస్ క్యాంపు వద్ద చెక్ పోస్టులుంటాయి. ఆ చెక్‌పోస్టుల వద్ద సల్వాజుడుం కార్యకర్తలు వాహనాలు ఆపి తనిఖీ చేస్తారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా బస్సు కిందికి దింపి కాల్చేస్తారని, బస్సు కోసం వేచివున్న మాతో ఓ ప్రయాణికుడు కెమెరామెన్ ఎదురుగానే అన్నాడు. దీంతో వేణు ముఖంలో మళ్ళీ ఆందోళన కనిపించింది.

## చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం - 1967 కింద దేశంలో నిషేధం ఎదుర్కొంటున్న సంస్థలివీ...

1. యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం
2. నేషనల్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్ (ఎన్‌డీఎఫ్‌బీ)
3. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ)
4. యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యూఎన్ఎల్ఎఫ్)
5. పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లీస్తాన్
6. కాంగ్లీపాక్ కమ్యూనిస్టు పార్టీ (కేసీపీ)
7. కాంగ్లీ యావోల్ కాన్బా లూప్ (కేవైకేఎల్)
8. మణిపూర్ పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్
9. రివల్యూషనరీ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్‌పీఎఫ్)
10. ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్
11. నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర
12. హిన్యూట్రెప్ నేషనల్ లిబరేషన్ కౌన్సిల్
13. ఆచిక్ నేషనల్ వాలంటీర్ కౌన్సిల్ (ఏఎన్‌వీసీ)
14. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్
15. ఖలిస్థాన్ కమాండో ఫోర్స్
16. ఇంటర్నేషనల్ సిక్కు యూత్ ఫెడరేషన్
17. లష్కరే తోయిబా/పసబనే అహ్లే హాదీస్

18. జైషే మహ్మద్ / తెహ్రికే ఫర్ఖాన్
19. హర్కతుల్ ముజాహిద్దీన్ / హర్కాతుల్ అన్సార్ / కర్కతుల్ జీహాదే ఇస్లామీ
20. హిజ్బుల్ ముజాహిదీన్ / హిజ్బుల్ ముజాహిద్దీన్ పీర్ పంజాల్ రెజిమెంట్
21. ఆల్ ఉమర్ ముజాహిదీన్
22. జమ్మూ అండ్ కాశ్మీర్ ఇస్లామిక్ ఫ్రంట్
23. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)
24. స్టూడెంట్ ఇస్లామిక్ మూమెంట్ ఆఫ్ ఇండియా (సిమి)
25. దీన్‌దార్ అంజుమన్
26. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు - లెనినిస్టు) పీపుల్స్‌వార్, దీనికి సంబంధించిన అన్ని అనుబంధ సంస్థలు
27. మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ). దీనికి సంబంధించిన అన్ని అనుబంధ సంస్థలు
28. అల్ బదర్
29. జమాయతుల్ ముజాహిదీన్
30. అల్ ఖైదా
31. దుఖ్తారనే మిలత్ (డీఈఎం)
32. తమిళనాడు లిబరేషన్ ఆర్మీ (టీఎన్ఎల్ఏ)
33. తమిళ నేషనల్ రిట్రీవల్ ట్రూప్స్ (టీఎన్ఆర్టీ)
34. అఖిల భారత నేపాలీ ఏక్తా సమాజ్

'మనం వెళుతున్నది సల్వా జుడుం చీఫ్ మహేంద్ర కర్మను కలవడానికి. కంగారు పడాల్సిందేమీ లేదు. అక్కడ ఉండేది కూడా జుడుం కార్యకర్తలే' అంటూ కెమెరామెన్‌కు ధైర్యం నూరిపోశాను.

రాత్రి 12 గంటల ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ ఆర్టీసీ బస్సులో ప్రయాణం మొదలైంది. అన్నట్టుగానే ఒక్కో చెక్‌పోస్టు వద్ద సల్వాజుడుం కార్యకర్తలు, ఒక్కో బేస్ క్యాంపు దగ్గర వాహనాలను ఆపి తనిఖీ పేరుతో జనాన్ని విసిగిస్తున్నారు. రెండు, మూడు చెక్‌పోస్టులు దాటాక మా బస్సులోకి జుడుం కార్యకర్తలు తుపాకులతో ఎక్కారు.

బహుశా అది మారాయిగూడెం చెక్‌పోస్టు అనుకుంటా. కెమెరామెన్ నా పక్క సీట్లో కాకుండా కాస్త దూరంగా విండో సైడ్ సీట్లో కూర్చున్నాడు. అందరినీ కళ్ళతో నిశితంగా చూస్తూ వచ్చిన జుడుం సాయుధులు కాస్త బిత్తరగా ఉన్న కెమెరామెన్ ఛాతిపై తుపాకీ పెట్టి కిదర్ జారహేహో అని అడిగారు. మేరేకు హిందీ నహీ ఆతా అంటూ హిందీలోనే సమాధానం చెప్పాడు. జుడుం ఎస్పీవో 'సాలే... నీచే ఉతర్, హిందీ నహీ ఆతా మగర్ హిందీమే బోల్తా...కుచ్‌హై' అంటూ గద్దించారు.

కెమెరామెన్ ఒక్క ఉదుటున సార్ అంటూ కేక వేశాడు. నేను నవ్వి, ఎస్పీవోను దగ్గరగా పిలిచాను. చెవిలో హమ్ కర్మాజీసే మిల్నే జారహేహై అంటూ భుజం తడుతూ చెప్పాను. ఎస్పీవో ఇంకేమీ మాట్లాడకుండా బస్సు దిగి వెళ్ళిపోయాడు. వేణు తలపై వెంట్రుకలన్నీ లేచి నిల్చున్నాయి.

తనకేదో గండం గడిచిందన్న ఫీలింగ్‌లో ఉన్నాడు. ఎవర్నయినా బస్సులో నుంచి కిందికి దించితే కొద్ది సేపట్లో తుపాకీ పేలిన శబ్దం వినబడుతుంది. ఇందుకు న్యాయ విచారణ ఏమీ ఉండదు. ఈ ఒక్క ఉదంతమే ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న తుపాకీ రాజ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. అలా ఒక్కొక్క సల్వా జుడుం బేస్ క్యాంపులు దాటుతున్నప్పుడల్లా బస్సులోని జనం గుండె చప్పుడు వేగం పైకి వినపడేటట్లుగా వారి ముఖ కవళికల్లో ఆందోళన ప్రస్ఫుటంగా కనబడుతుంది.

పులినోట్లో నుంచి బయటపడినట్లుగా ఎట్టకేలకు తెలతెలవారుతుండగా దంతెవాడ చేరుకున్నాం. మొత్తం గిరిజన జనాభా కనపడుతోంది.

బస్టాండ్‌కు దగ్గరగా ఉన్న హోటల్‌లో దిగాం. కాలకృత్యాలు తీర్చుకున్నాం.

దంతెవాడకు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహేంద్రకర్మ నివాసానికి చేరుకున్నాం. దంతెవాడ జిల్లా కేంద్రం. కానీ ఎక్కడా ఒక ఆటోకానీ, రిక్షాకానీ లేదు. అంతా కాలినడకనే జనం తిరుగుతున్నారు. చుట్టూ అడవి. మధ్య భూభాగం. అదో అటవీ ద్వీపంలా ఉంది. జడ్ ప్లస్ క్యాటగిరి భద్రతలో ఉన్న మహేంద్రకర్మ ఇంటికి చేరుకోవడం కూడా ఓ సాహసమే.

కర్మ ఇంటర్వ్యూ కోసం అపాయింట్‌మెంట్ కావాలని కర్మ పిఎను అభ్యర్థించగా, మహేంద్రకర్మ నుంచి సమాధానం మేం ఊహించినదానికంటే భిన్నంగా వచ్చింది. ఆజ్ తక్, ఎన్‌డి టివి, టైమ్స్ నవ్, సిఎన్‌ఎన్–ఐబిఎన్‌లకు మినహా ప్రాంతీయ ఛానళ్ళకు మహేంద్రకర్మ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వరని లోపలినుంచి సమాధానం వచ్చింది.

కాసేపు వేచివుండి దంతెవాడ పట్టణానికి చేరుకున్నాం. మహేంద్రకర్మ ప్రధాన అనుచరులెవరో తెలుసుకుని వారికి మేము ఎంత కష్టపడి ఇక్కడికి చేరుకున్నామో చెప్పి, ఇంటర్వ్యూ కావాలని అభ్యర్థించాం. వారు చెబితే కర్మ 'నో' అనడని తెలుసుకుని వారిని ప్రసన్నం చేసుకున్నాం. సరే మేం ఇంటర్వ్యూ ఇప్పిస్తామని మరుసటి రోజు కర్మ ఇంటికి తీసుకు వెళ్ళారు.

కర్మ ఇంటిముందున్న చెక్‌పోస్టులో మమ్మల్ని పెద్దగా తనిఖీ చేయలేదు. వారి అనుచరులు వెంట ఉండటంతో మెటల్ డిటెక్టర్ ద్వారం గుండా లోపలికి వెళ్ళాం. బయట ఇసుక బస్తాలతో సెంట్రీ పోస్టులు ఉన్నాయి. కర్మ అనుచరులు లోపలికి వెళ్ళి మా రాక గురించి చెప్పి, అపాయింట్‌మెంట్ సంపాదించారు. కర్మ నల్లని కోటు ధరించి ఉత్సాహంగా మా దగ్గరికి చేరుకుని సోఫాలో కూర్చున్నారు.

కర్మతో టిఫిన్ చేశాం. వెంటనే ఇంటర్వ్యూ కోసం కర్మ కూడా ప్రిపేర్ అయిపోయాడు. కోట్ అడ్డంగా ఉందంటూ తీసేసి ఫ్రీగా సోఫాలో కూర్చొని 'పూఛియే' అంటూ ఇంటర్వ్యూకు సిద్ధమైపోయాడు. సహజ సంపదను కొల్లగొట్టేందుకు జుడుం ఆరంభమైందన్న ప్రధాన ఆరోపణ ఉంది. ఈ ప్రశ్న ఎలా వేయాలన్న ఆలోచన బుర్రలో తిరుగుతోంది.



సల్వాజుడుం చీఫ్ మహేంద్రకర్మతో ఇంటర్వ్యూ

**ప్ర: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అపార సంపదను ఎప్పుడు వెలికి తీయబోతున్నారు?**

**జ:** చూడండి. ఈ దేశంలో షెడ్యూల్డు తెగలు నివసించే ప్రాంతంలో అడవులున్నాయి. ఆ అడవుల్లో ఖనిజాలున్నాయి. మినరల్స్ ఉన్నాయి. ఆ మినరల్స్, ఖనిజ సంపదపై కూర్చున్న గిరిజనుడు దేశంలో అందరికంటే దౌర్భాగ్యుడు. పేదరికంలో మగ్గుతున్నాడు. వాటిని వెలికి తీసి గిరిజనుల దారిద్ర్యాన్ని రూపుమాపుతాం.

**ప్ర: అందుకోసమే జుడుం ఏర్పాటు చేశారా?**

**జ:** అందుకొక్కదాని కోసం మాత్రం కాదు.

**ప్ర: సల్వాజుడుం ఏర్పాటు చేసి దాదాపుగా మూడేళ్ళు గడిచిపోయింది.మీ లక్ష్యాలు ఏ మేరకు నెరవేరాయి?**

**జ:** సామాన్యునిపై హింసకు వ్యతిరేకంగా అభివృద్ధి నిరోధక, ప్రగతి వ్యతిరేక మావోయిస్టులకు వ్యతిరేకంగా జుడుం పోరాడుతుంది. ఇది మొదటి

విజయం. ప్రజాస్వామ్యాన్ని కాపాడే దిశగా జుడుం అడుగులేస్తోంది. ఇది రెండో విజయం. మూడో విజయం గత 25 సంవత్సరాలుగా మావోయిస్ట్‌లు ఏర్పరచుకున్న నెట్‌వర్క్‌ను అంతమొందించాం. గతంలో మావోయిస్టులు ఒక దళంగా తిరిగేవారు. ఇప్పుడు అనేక దళాలను కలుపుకుని ఒక దళంగా తిరుగుతున్నారు. అంటే వారు పోరాటంలో వెనక్కి వెళ్ళిపోయారు. దీని అర్థం వారు బలహీనపడ్డారని. వారి ఇంటలిజెన్సీ, వారి సిద్ధాంతకర్తలు పూర్తిగా చచ్చుబడిపోయారు.

**ప్ర: మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. జనతన సర్కార్‌ను నిలువరించేందుకు మీరు సైన్యాన్ని దింపేందుకు కేంద్రాన్ని అడిగినట్లు తెలుస్తోంది. ఇది ఎంతవరకు నిజం?**

**జ:** అలాంటిదేమీ లేదు. జనతన సర్కార్ అనేది వారిది ఒక ప్రోగ్రామింగ్ మాత్రమే. ఇదే సందర్భంలో సల్వా జుడుం రూపంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా జనాందోళన మొదలైంది. ఇది శరవేగంతో దక్షిణ బస్తర్‌లో వ్యాప్తిచెందింది. వాళ్ళ జనతన సర్కార్ కాన్సెప్ట్ విఫలమైంది.

**ప్ర: ఛత్తీస్‌గఢ్ విధాన సభ సమావేశాలు మీడియాను బయటకు పంపించి తలుపులు మూసి నిర్వహించారు. బంద్ కమరేమే ఏ నిర్ణయాలు తీసుకున్నారు?**

**జ:** కొన్ని సార్లు విధాన సభ సమావేశాలు రహస్యంగా నిర్వహించకతప్పదు. సభ్యులందరూ స్వేచ్ఛగా తమతమ అభిప్రాయాలు వెల్లడించాలన్నా, ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాలన్నా తలుపులు మూసి సమావేశాలు నిర్వహిస్తాం. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇంకా కార్యరూపం దాల్చలేదు. అవి కార్యరూపం దాలిస్తే ఒక్క మావోయిస్ట్ కూడా ఇక్కడ ఉండటం కష్టమవుతుంది.

**ప్ర: ప్రజా గెరిల్లా సైన్యానికి దీటుగా భారత సైన్యాన్ని మీరు అడిగినట్లుగా బయటకు పొక్కింది. మీరేమంటారు?**

**ఎర్రబోరు, మారాయిగూడెం, అబూజ్‌మాడ్ తదితర బేస్‌క్యాంపులపై మావోయిస్టులు దాడిచేసి పెద్దసంఖ్యలో సల్వాజుడుం కార్యకర్తలను హతమార్చారు. ఇందులో పెద్దయెత్తున 'జుడుం' కార్యకర్తలు చనిపోయారు. చనిపోయిన వారిలో ఎక్కువమంది గిరిజనులే ఉండడం గమనార్హం.**

**జ:** నాగా, మిజో సిఆర్‌పిఎఫ్ బలగాలు ప్రస్తుతం పరిస్థితిని అదుపు చేస్తున్నాయి. వీటివల్ల కానప్పుడు సైన్యం గురించి ఆలోచిస్తాం. ప్రస్తుతానికి సైన్యం అవసరం లేదన్నదే మా భావన. ఇదైతే ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం. మేమైతే ప్రభుత్వంలో లేం.

ప్ర: **మూడు నెలలుగా జీతాలు రావడం లేదని ఎస్పీవోలు ఆరోపిస్తున్నారు. వారు నిరాశా, నిస్పృహల్లో ఉన్నారు. దీనిపై మీరెలా స్పందిస్తారు?**

**జ:** ఇది మావోయిస్టుల దుష్ప్రచారం. సల్వాజుడం ఎస్పీవోలను మానసికంగా కుంగదీయడానికి తమవైపు తిప్పుకోవడానికి చేసే ప్రయత్నం. ఇలాంటి ప్రయత్నాలు చాలా కాలంగా చేస్తున్నారు. వారి పప్పులుడకడం లేదు.

ప్ర: **గతంలో మావోయిస్ట్‌ల చేతిలో హతమైన సల్వాజుడుం కార్యకర్తల ఎక్స్‌గ్రేషియాను నేతలు మింగేశారని బలమైన ఆరోపణలు ఉన్నాయి. వీటిపై మీరేమంటారు?**

**జ:** ఇది కూడా దుష్ప్రచారమే. ఆ డబ్బంతా మావోయిస్టులే తిన్నారు. మేమే చంపాం. మేమే తింటామంటున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నేరుగా డబ్బు చెల్లిస్తోంది. ఇక మధ్యవర్తులు ఎక్కడ తింటారు?

ప్ర: **కోయ, గొత్తికోయల మధ్యన ఘర్షణ రేపిన మీరు గొత్తికోయ జాతిని నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నారు. దీన్ని మీరు ఎలా సమర్థించు కుంటారు?**

**జ:** అలాంటిదేమీ లేదు. గొత్తికోయలు కూడా మావాళ్ళే. ఇది కూడా మావోయిస్టుల దుష్ప్రచారమే. ఒక జాతిని నిర్మూలించాలన్న ఉద్దేశంతో మేము లేము.

**దేశంలో జాతీయంగా రెండు ప్రధాన రాజకీయ కూటములు కనబడుతాయి. ఒకటి ఎన్‌డిఏ, మరొకటి యూపిఏ. ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి రమణ్‌సింగ్ సర్కారు అధికారంలో ఉండగా ప్రభుత్వ సహకారంతో కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నేత మహేంద్రకర్మ సల్వాజుడుంకు నేతృత్వం వహిస్తున్నాడు. అంటే మావోయిస్టులను అణచివేసేందుకు ఎన్‌డిఏ, యూపిఏ ఏకం అయినాయన్నమాట.**

**ప్ర: కొద్దికాలం క్రితం మిమ్మల్ని మావోయిస్టులు టార్గెట్ చేశారు. హతమారుస్తామని ప్రకటించారు. దీనిపై మీ స్పందన?**

**జ:** 1989 నుంచి మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్నాను. జనజాగరణ ఉద్యమానికి నాయకత్వం వహించాను. ఇప్పటివరకు నన్ను హతమార్చే ప్రయత్నాలు చాలానే చేశారు. వారి ప్రయత్నాలు వారిని చేసుకోనివ్వండి. నేను బతికి ఉన్నంతవరకూ పోరాడుతూనే ఉంటాను.

**ప్ర: ఆంధ్రా సరిహద్దులో చాలా మంది గొత్తికోయలు శరణార్థులుగా బతుకుతున్నారు. వారిని ఛత్తీస్‌గఢ్ తీసుకువచ్చే ప్రయత్నాలు ఏమైనా చేస్తారా?**

**జ:** దీనిరి కూడా మావోయిస్టులదే బాధ్యత. మా ఉద్యమం అక్కడికి చేరకముందే గొత్తికోయలను అక్కడి నుంచి తరిమివేశారు. మా పోరాటం మావోయిస్టులతో కానీ, గొత్తికోయలతో కాదు. వారికి ఈ విషయాన్ని నచ్చజెప్పి వారిని వెనక్కితెచ్చే ప్రయత్నం చేస్తాం.

ఇలా కర్మతో ఇంటర్వ్యూ సాగింది. ఇంటర్వ్యూ పూర్తికాగానే ఆంధ్రాలో ఉద్యమ స్థితిగతులను మహేంద్రకర్మ మా ద్వారా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ అనగానే మావోయిస్ట్ నాయకత్వం అక్కడి నుంచే వచ్చిందని చెప్పాడు. తిరిగి మమ్మల్ని సాగనంపేందుకు ఏర్పాట్లు చేయించారు.

మొత్తం మావోయిస్టు ఉద్యమంలో వారికి వ్యతిరేకంగా నిలబడి ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని వారికి ప్రభుత్వ జీతం ఇప్పిస్తూ పోరాడుతున్న వ్యక్తి మహేంద్రకర్మ. తనను ఏదో రోజు మావోయిస్టులు చంపుతారన్న విషయం అతనికి తెలుసు. తెలంగాణ

**ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల సార్వత్రిక ఎన్నికల్లో దంతెవాడ నుంచి పోటీ చేసిన మహేంద్రకర్మ ఘోరపరాజయం పాలయ్యాడు. ఇదోరకంగా సల్వాజుడుంకు రెఫరెండం. మహేంద్రకర్మ ఓటమి ఫలితంగా సల్వాజుడుంకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది.**

ప్రాంత జర్నలిస్టులు వచ్చిన విషయం, మహేంద్రకర్మను కలిసి ఇంటర్వ్యూ చేసిన విషయం అక్కడి హిందీ జాతీయ పత్రికాప్రతినిధులకు తెలిసిపోయింది.

వారు మేమున్న ప్రాంతానికి వచ్చి సాదరంగా కలిశారు. మేం స్థానికంగా తిరిగేందుకు తమ వాహనాలు మాకు సమకూర్చారు. అనంతరం దంతెవాడ ఎస్పీ రాహుల్‌శర్మను కలిశాం. ప్రభుత్వం, ప్రభుత్వ ఏజెన్సీలు చేరుకోలేనటువంటి ప్రాంతానికి ఆంధ్రా జర్నలిస్టులు చేరుకోవడం, అక్కడి స్థితిగతులను చిత్రీకరించడంతో ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ బైట్ ఇచ్చారు.

తెలంగాణ జర్నలిస్టులన్నా, తెలంగాణ మావోయిస్టు నేతలన్నా, తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులన్నా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో హీరోలేనని రాహుల్‌శర్మ చెప్పాడు. ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ మీడియా చేరుకోలేని చోటికి వెళ్ళడం పట్ల ఆయన అభినందిస్తూ



**దంతెవాడ ఎస్పీ రాహుల్ శర్మతో ఇంటర్వ్యూ**

ఇంటర్వ్యూ ఇచ్చారు. చాలా సాదరంగా రాహుల్‌శర్మ కాంపౌండ్ గేటుదాటి మేం వచ్చిన  వాహనాన్ని సాగనంపారు. అక్కడి నుంచి మధ్యాహ్న భోజనం కోసం చిన్న రెస్టారెంట్‌కు చేరుకున్నాం. అక్కడ ఓ ఇన్‌స్పెక్టర్ నలుగురు గన్‌మెన్లతో మా పక్క టేబుల్ దగ్గర భోజనం చేస్తున్నారు. సివిల్ దుస్తుల్లో ఉన్న ఆయనను మీరేం చేస్తారని అడిగాను.

బియ్యం వ్యాపారం చేస్తానని భయంభయంగా సమాధానం చెప్పాడు. బియ్యం వ్యాపారం చేసేవారికి నలుగురు గన్‌మెన్లు ఎందుకని ప్రశ్నించాను. మీరెవరని అడిగారు. మీడియా అని సమాధానం చెప్పగానే తాను ఇన్‌స్పెక్టర్‌గా పరిచయం చేసుకున్నారు. అక్కడ ఓ చోద్యం కనిపించింది. ఆయన నలుగురు గన్‌మెన్లు కార్బన్ రైఫిల్స్ ధరించి ఉన్నారు. నలుగురూ మ్యాగ్జిన్స్ తీసేసి నడుంకు కట్టుకున్నారు.

ఈ దృశ్యాన్ని ఆయన దృష్టికి తీసుకు వెళ్ళి నేను బిగ్గరగా నవ్వాను. రక్షణలో వారికి ఉన్న లోపాలకు ఇదో పరాకాష్ట మాత్రమే. అక్కడి నుంచి మేం బస చేసిన హోటల్‌కు వెళ్ళి లగేజీ సర్దుకుని తిరిగి ఆంధ్రా ప్రయాణమయ్యాం. దిగ్విజయంగా సాహసయాత్ర ముగించుకుని మూడురోజులపాటు టీవీ 5లో చర్చా కార్యక్రమం జరిగింది. సల్వాజుడుం, అడవిలో యుద్ధం అన్న బ్యాంగ్‌లతో  వార్తా ప్రసారాలు జరిగాయి. ఒకరోజు వరవరరావు, రెండవ రోజు గద్దర్, మూడవ రోజు హరగోపాల్ చర్చల్లో పాల్గొన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ కరీం యాంకర్‌గా వ్యవహరించారు. తర్వాత 15 రోజులు వరుస కథనాలతో ఈ పుస్తకంలో పొందుపర్చిన అంశాలు వార్తా కథనాల రూపంలో ప్రసారమయ్యాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రైవేట్ వ్యక్తులకు తుపాకులిచ్చి శాంతిభద్రతలను పరిరక్షించడాన్ని ఇటీవల భారత అత్యున్నత న్యాయస్థానం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టింది. అక్కడ నెలకొన్న అశాంతియుత వాతావరణంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి శాశ్వతంగా శాంతి నెలకొనేలా చర్యలు తీసుకోవాలని చెప్పింది.

# అబూజ్‌మాడ్‌కు నా ప్రయాణం

2009 నవంబర్ నెల అది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతాన్ని వేలాదిగా పారామిలటరీ, కోబ్రా బలగాలు చుట్టుముట్టాయని, గ్రీన్‌హంట్ ఆపరేషన్ పేరుతో ముప్పేట దాడులు చేయబోతున్నాయని వార్తలు వెల్లువెత్తుతున్నాయి. సరిగ్గా 2009 నవంబర్ 2న చత్తీస్‌గఢ్ వెళ్తున్న తెలుగు మీడియా బృందంపై దాడి జరిగిందన్న వార్త భగ్గుమంది గ్రీన్ హంట్ ఆపరేషన్ కవరేజికి మీడియాకు అనుమతి లేదని, అటుగా వచ్చినవారిపై టెర్రరిస్టు చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని చత్తీస్‌గఢ్ డీజీపీ ప్రకటించారు. ఆ స్క్రోలింగ్ అన్ని ప్రాంతీయ, జాతీయ న్యూస్ ఛానళ్లలో బ్రేకింగ్ వస్తోంది. ఆ సమయంలో నాకు గ్రీన్‌హంట్ ఆపరేషన్ కవరేజ్‌కు రేపు బయలుదేరాలంటూ... ABN ఆంధ్రజ్యోతి నుంచి వర్తమానం అందింది. నేను గతంలో చత్తీస్‌గఢ్ వెళ్లిన దృష్ట్యా యాజమాన్యం మళ్లీనన్నే పంపాలని నిర్ణయించి ఉండవచ్చు. కానీ నిజానికి నాకెందుకో ఒకింత భయం వేసింది. వెంటనే గతంలో నాతోపాటు చత్తీస్‌గఢ్ వచ్చిన మిత్రుడు రమేష్ బాబుకు ఫోన్ చేసివస్తావా అని అడిగాను. ఇప్పుడు చత్తీస్‌గఢ్ వెళ్ళడం సరైన సమయం కాదని సున్నితంగా వారించాడు. కానీ అది నాకిచ్చిన అసైన్‌మెంట్. యాజమాన్యానికి నా అంగీకారం తెలిపాను. ఆ రాత్రే మా ప్రయాణం నాతోపాటు "అన్నా నువ్వు అడవులకు వెళ్లినప్పుడు నన్ను తీసెకెళ్లు" అని చెప్పిన ABNకి చెందిన కెమెరామెన్ సతీష్‌ను, డ్రైవర్‌గా మనోహర్‌ను గ్రాండ్‌సుమో వెహికిల్‌ను సమకూర్చారు. పదిరోజులకు సరిపడే బట్టలతో ఛత్తీస్‌గఢ్ అడవులకు పయనమయ్యాం. తెలతెలవారుతుండగా భద్రాచలం చేరుకున్నాం. కొన్ని గంటలపాటు అక్కడ విశ్రాంతి తీసుకున్నాం. ఆ ఉదయం మా భద్రాచలం ABN ఆంధ్రజ్యోతి ప్రింట్ ప్రతినిధులు మాగెస్ట్‌హౌజ్‌కు వచ్చారు. ఈలోపు అబూజ్‌మాడ్‌కు ఎలావెళ్లాలో నాకున్న నెట్‌వర్క్ ద్వారా నేను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాం. క్లారిటీ రాలేదు. మా భద్రాచలం ప్రతినిధులు ఇద్దరూ చర్చించుకుంటున్నారు. "సార్ అంటూ నన్ను పిలిచారు. మేం ఇలా చెబుతున్నామని

మీరే అనుకోవద్దు...” అంటూ మొదలెట్టారు. “సార్ ఛత్తీస్‌గఢ్ ప్రయాణం చాలా ప్రమాదకరం. మొన్నే సల్వాజుడుం ఓ తెలుగు ఛానల్‌పై దాడిచేసి, కొట్టి తిప్పిపంపింది. అలాగే తెలుగు మీడియా వస్తే కాల్చి చంపండని వారికి ఆర్డర్లున్నాయి. ఎందుకుసార్ రిస్క్‌తీసుకోవడం” అంటూ ప్రయాణం మానుకుంటేనే మంచిదన్నట్లుగా మాకు నచ్చజెప్ప చూశారు. వారు మాక్షేమం కోరి చెప్పారు. ఆ రోజు ఉన్న పరిస్థితి అట్లాంటిది. కానీ... ఆఫీస్ నుంచి నాకిచ్చిన అసైన్‌మెంట్. వెనక్కి వెళ్లడం సరికాదు. వారికి నచ్చచెప్పి లగేజ్ సర్దుకుని మేం ప్రయాణం కొనసాగించాం. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాగానే దిగి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు ఒక పీటూసీ చెప్పుకున్నం. కొంట ప్రాంతంలో సల్వాజుడుం కార్యకర్తలు రోడ్డుకిరువైపూలా తుపాకులతో ఉన్నారు. వారితో మాట్లాడి గతంలో నాకున్న ఆ ప్రాంత పరిచయాలతో కొంట దాటే ప్రయత్నం చేస్తున్నాం. కెమెరా ఆన్ చేయగానే మీడియానే మా శత్రువు అంటూ వారి బైట్లు మొదలెట్టారు. వారికి నచ్చజెప్పి, అనుమతి తీసుకుని, ఛత్తీస్‌గఢ్‌లో ప్రవేశించాం. అక్కడినుంచి ఇంజరం, ఎర్రబోరు, మరాయిగూడెం బేస్ క్యాంపులవైపుగా మా వాహనం వెళ్తోంది. నిజానికి నేను మొదటి సారి వెళ్లినప్పుడు ఉన్నంతగా, బేస్ క్యాంపుల్లో సల్వాజుడుం కార్యకర్తలు లేరు. ఒక్క మాటలో చెప్పాలంటే బేస్ క్యాంపులు బోసిపోయి ఉన్నాయి. బేస్ క్యాంపుల దగ్గర ఉన్న చెక్‌పోస్టుల నుంచి ఎలాగోలా తప్పించుకుని, వెళ్లాం. మధ్యాహ్న భోజనం ఒక చిన్న హోటల్‌లో కానిచ్చాం. రాత్రయ్యింది ఛత్తీస్‌గఢ్‌లో రాత్రి ప్రయాణం మంచిది కాదు. ఎక్కడో ఒక చోట ప్రయాణాన్ని నిలిపి, తిరిగి తెల్లవారిన తర్వాత కొనసాగించాలని నిర్ణయించాం. ఇంతలో AP రిజిస్టర్డ్ వెహికిల్ చూసి ఒక తెలుగు గొంతు వినపడింది. “మా వాహనం లైట్లు ఫెయిలయ్యాయి. మీ వాహనం లైట్ల వెలుగులో వస్తాం.. కాస్త కోఆపరేట్ చేయండి” అని అడిగారు. అదంతా అటవీ కొండ ప్రాంతం. చాలా ఎత్తయిన ఘాట్‌సెక్షన్. చాలా కష్టంగా మా వాహనం లైట్ల వెలుతురులో వాళ్ల వాహనం నెమ్మదిగా వెళ్తున్నాం. రాత్రి 11 గంటల ప్రాంతంలో జగదల్‌పూర్‌కు చేరుకుంది. వారిది జగదల్ పూరే కావడంతో. వారి ద్వారా మాకు అక్కడి ఓ హోటల్‌లో ఆ రాత్రికి ఆశ్రయం దొరికింది. వారు మూడు తరాలకిందట వెళ్లి అక్కడ స్థిరపడ్డట్టుగా చెప్పారు. తెలవారుతుండగా తలుపు చప్పుడు కావడంతో తీశాం. రాత్రి మమ్మల్ని అక్కడ దించి వెళ్లిన వాళ్లే. ఆప్యాయంగా పలకరించి ఛత్తీస్‌గఢ్ ఎందుకు వచ్చారు..? ఎక్కడికెళ్లాలని అడిగారు.

అబూజ్‌మాడ్ అడవులకు వెళ్లేందుకు, గ్రీన్‌హంట్ ఆపరేషన్ కవరేజ్‌కోసం వచ్చామని చెప్పిం. ఒక్కసారిగా అవాక్కయిన ఆయన "ఎందుకలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు. అబూజ్‌మాడ్ గురించి నీకేమైనా తెలుసా" అని ప్రశ్నించి వెనక్కు వెళ్లడమే శ్రేయస్కరమన్నట్లు చెప్పాడు. అబూజ్‌మాడ్ అడవులు ఏ ప్రాంతంలో వస్తాయని ప్రశ్నించాం. తనకూ సరిగా తెలియదని చెప్పి... తెలిసినవారికి ఫోన్లు చేసి అడిగారు. అటునుంచి కూడా సమాధానం అబూజ్‌మాడ్ ఎందుకు అన్నట్లుగానే.. సమాచారం తెలియలేదు. "నారాయణపూర్ జిల్లాలో అబూజ్‌మాడ్ అడవులు వస్తాయి. మీరు వెళ్ళి తెలుసుకోండి" అని సలహా ఇచ్చారు. ఏదయితే అదయ్యిందని నారాయణపూర్ వైపు బయల్దేరాం. ఓచోట BSF క్యాంప్.. మరోచోట CRPF క్యాంప్ ఇంకోచోట కోబ్రా క్యాంప్ CISF క్యాంప్, SSB క్యాంప్ స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ క్యాంప్.. అడుగడుగునా తనిఖీలు. దేశ సరిహద్దులు దాటుతున్నట్లుగా... ప్రతీచోట ఇక ముందుకు వెళ్లలేమనిపించిది. గంటల తరబడి ఆపేసి ఏవేవో ప్రశ్నలు 150 కిలోమీటర్లు ప్రయాణిస్తేగానీ అబూజ్‌మాడ్ చేరుకోలేము. అలాంటిది అడుగడుగునా పోలీసు వలయాలను ఛేదించుకుంటూ వెళ్ళడం ఎలా అన్న అనుమానం కలిగింది. రెండు రోజులు గడిచిపోయాయి. మదిలో ఒకటే ఆలోచనలు. మరుసటిరోజు రాత్రి మా మిత్రుడు వచ్చి తలుపుతట్టాడు. అప్పటికే నా దగ్గర ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సెల్ నెంబర్ ఉంది. అక్కడి మిత్రుని దగ్గర తప్ప ఆ నెంబర్ ఎవరి దగ్గరా లేదు. అక్కడ మా మొబైల్‌స్విచ్ ఆఫ్ చేశాం. మిత్రునితో కలిసి అర్ధరాత్రి కూర్చున్నాం. అతని దగ్గర అబూజ్‌మాడ్‌కు ఎలా వెళ్లాలో ఒక మ్యాప్ ఉంది. కానీ ఆ ఏరియా మాకు కొత్త. ముందు ఆయన చెప్పిన మ్యాప్ బుర్రకెక్కలేదు. అతను మాతో రానని చెప్పడంతో ఆ మ్యాప్‌ను మేం మాకర్థమయ్యే విధంగా రాసుకున్నాం. ఉదయం మేమనుకున్న మ్యాప్‌తో ప్రయాణం మొదలైంది. అక్కడ ఓ పోలీస్ క్యాంప్ లైట్‌మిషన్ గన్స్‌తో సిద్ధంగా ఉంది. మమ్మల్ని ఆపేశారు. ముందుకు వెళ్లడానికి వీల్లేదన్నారు. అనుమతులు చూపమన్నారు. లేకపోతే కేసులు పెడతామన్నారు. అబూజ్‌మాడ్ వెళ్తామన్న ఆశబలంగా ఉన్న ప్రతిబంధకాలే ఎక్కువ. క్షుణ్ణంగా మా లగేజీని పోలీసులు తనిఖీ చేశారు. ఎందుకు వచ్చారు..? ఏంటీ అన్న ప్రశ్నలు గిరిజన జీవితాలపై స్టడీ చేసేందుకు వచ్చామన్నాం. అక్కడ గిరిజనులు లేరా అని ప్రశ్నించారు. ఇంతలో కోబ్రాలో చేరిన CRPF జవాన్ ఒకరు తెలుగువాడు మా దగ్గరకు వచ్చాడు

"ఇటొొచ్చారన్నా" అంటూ తెలుగులో పలకరించాడు. మాకు ఆశ చిగురించింది. ఆ పక్కనే జవాన్లకోసం పెట్టిన ఓ చిన్న ఛాయ్ హోటల్‌లోకి తీసుకెళ్లాడు. మేం మనసు విప్పి మాట్లాడుకున్నాం. ఆ మిత్రుడు చెప్పిన దాని ప్రకారం గ్రామాలకు గ్రామాలే మావోయిస్టులకు మద్దతుగా ఉన్నాయి. పోలీసు బలగాలు అబూజ్‌మాడ్ అడవుల్లోకి ఎప్పుడూ వెళ్లలేదని చెప్పాడు. చాలాసార్లు CRPF క్యాంపులు, కోబ్రా క్యాంపులపై మావోయిస్టులే దాడి చేశారని. ఆ ప్రాంతంలో CRPF Cellphones పనిచేయకపోవడంతో ఆ విషయాలేవి బయటకు తెలియవని చెప్పాడు చాలా రాత్రుళ్లు.. CRPF క్యాంపుల పక్కన మావోయిస్టులు టపాకాయలు కాలిస్తే, ప్రతిగా వందల తూటాలు తాము కాల్చిన సందర్భాలు ఎన్నోనని... వారి పాట్లన్నీ చెప్పాడు. గ్రామంల్లోంచి సమాచారం రాదని, మావోయిస్టుల చేతుల్లో తన్నులు తిన్నవారు కూడా.. ప్రాణభయంతో వెనక్కి పోతుంటారని... ఇన్‌ఫార్మర్ వ్యవస్థ లేదని CRPF మిత్రుడు చెప్పాడు. తనతోపాటు వచ్చిన ఓ మిత్రున్ని విల్లంబులతో గిరిజనులు చంపేశారని, ఈ ప్రాంతం మంచిది కాదని, వెళ్లిపోవడమే మంచిదని చెప్పాడు. అతని మూలంగా మాపై ఆ క్యాంప్‌లో ఒత్తిడి తగ్గింది. ఇక్కడ దగ్గర గిరిజన గూడాలు ఎక్కడున్నాయని అడిగాం. దారి చెప్పాడు. అక్కన్నుంచి వాగులు వంకలూదాటుతూ వాహనాన్ని వదిలి కాలినడకన.. నేను కెమెరామెన్ ఆ గూడానికి చేరుకున్నాం. అక్కడి గిరిజనులతో మాట్లాడే ప్రయత్నం చేశాం. చాలాసేపు గడిచాక వారు మాతో కొద్దికొద్దిగా మాట్లాడటం మొదలుపెట్టారు. అబూజ్‌మాడ్‌కు వెళ్లాలన్న విషయం చెప్పాం. మేం పోలీసులం కాదని వారి గూడెం పెద్ద నిర్ణయించుకున్న తరువాత.. అడవులకు వెళ్లేందుకు అతనే ఓ గిరిజన యువకున్ని పంపాడు. అలా మొదలైన మా నడక... కోయపై నడుస్తూ వాగుదాటాల్సి వచ్చింది. అడవిలో ఓ చోట కింగ్‌కోబ్రా ఎదురుపడింది. ఒకింత భయవేసింది. అక్కడ మరో గూడెం. నడుముపై భాగంలో ఆడ, మగ, ఎవరకీ బట్టలులేవు. అక్కడ ఒకరికి పరిచయం చేసి మాతో వచ్చిన యువకుడు వెళ్లిపోయాడు. అక్కడనుంచి మళ్లీనడక. వెళ్తుండగా ఒక్కసారి తలపైకెత్తిచూస్తే అడవి ముఖద్వారం ముందు సిమెంటుతో నిర్మించిన ఓ పెద్ద ఆర్చ్ "అబూజ్‌మాడ్ క్షేత్రమే ఆప్‌కా హార్ధిక్ స్వాగత్ కర్తాహై" అంటూ హిందీలో

ఓ స్వాగత తోరణం. ఎగిరిగంతేయాలన్న ఆనందం. గ్రీన్‌హంట్ ఆపరేషన్ గురించి వినడమే గానీ. ఏ జాతీయ ఛానల్ కూడా అబూజ్‌మాడ్ అడవులకు చేరుకోలేదు. ఆ ఆర్చ్ దగ్గర ఓ అమూల్యమైన పీటూసీ చెప్పుకున్నాం.

## ఏబీఎన్ లాంగ్‌మార్చ్!




అది ఖాకీలు తప్ప కాకులు దూరని కారడవి! ఆ అడవి లోపల గూగుల్ మూడో కంటికి కూడా దొరకని మావోయిస్టుల స్థావరాలు. యుద్ధానికి ఇరుపక్షాలూ తుపాకులు నూరుతున్నాయి. ఆ రణ క్షేత్రం అబూజ్‌మాడ్. అక్కడ కలం నిషేదం, కెమెరా నిషేధం! మొత్తంగా మీడియాకు నో ఎంట్రీ. ఈ కత్తుల వంతెనను దాటుకుని 'ఏబీఎన్–ఆంధ్రజ్యోతి' అబూజ్‌మాడ్ వార్‌జోన్‌కు చేరుకుంది. యుద్ధ సన్నాహాలను కెమెరాలో బంధించింది. ఈ డేర్‌డెవిల్ ఆపరేషన్ రిపోర్ట్ ఈరోజు సాయంత్రం 'ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి' న్యూస్‌రూమ్‌లో చూడండి!

*(12 నవంబర్ 2009న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనది.)*

కెమెరామెన్ సతీష్‌లో కూడా ఆనందం కనిపించింది. అడవిలో ఓ మూల దారిగుండా నడిచాం. జోరుగా ప్రవహిస్తున్న ఒక వంక దాటాం. అబూజ్‌మాడ్ అడవి... చాలా దట్టమైనది. అంత దట్టమైన అడవి నేనెప్పుడూచూడలేదు. అత్యంత విలువైన టేకు, నల్లమద్ది, లాంటి విలువైన చెట్లు. అక్కడ నుంచి ఇంకో యువకునికి మమ్మల్ని అప్పజెప్పి వెనక్కి వెళ్లి పోయాడతను. మమ్మల్ని కలిసిన ఆ యువకుడు చిన్న టవల్‌లాంటిది చుట్టుకున్నాడు. అతనితో మేం మాటలుకలుపుతూ నడుస్తున్నాం. కోబ్రా బెటాలియన్, కంపెనీ, ప్లాటూన్, బెటాలియన్ అంటూ మాకు అర్థం కాని ఆర్మీ లెక్కలన్నీ చెబుతున్నాడు. నిరక్షరాస్యుడు, గిరిజనుడు ఇవన్ని మాట్లాడటమేంటి అనుకున్నా. కానీ తరువాత తెలిసింది. అతను మిలీషియా సభ్యుడని. అడవిలో ఇక్కడి నుంచి జనతన సర్కార్ నడుస్తోందంటూ ఆ యువకుడు మాతో చెప్పాడు అదంతా మావోయిస్టు పార్టీ సమాంతర ప్రభుత్వమని పరిచయం చేశాడు.

# ఇదే... అబూజ్‌మాడ్!




- నిషేదాన్ని ఛేదించిన 'ఏబీఎన్–ఆంధ్రజ్యోతి'
- ఎర్రన్నల కోటలో కన్ను తెరిచినా కెమెరా
- 'విముక్తి ప్రాంతం'లోకి తొలిసారిగా మీడియా ప్రవేశం

## ఏబీఎన్ డేర్ డెవిల్ ఆపరేషన్

(హైదరాబాద్ – ఆన్‌లైన్)



అదో కీకారణ్యం! పచ్చటి ఆ చెట్ల మధ్య, మట్టిదారిలో ఓ స్వాగత తోరణం. 'అబూజ్‌మాడ్ మీకు హార్థిక స్వాగతం పలుకుతోంది' అంటూ ఓ సందేశం! అక్కడి నుంచి మొదలవుతుంది... మావోయిస్టుల సామ్రాజ్యం. అది 'ఖాకీలు' దూరని

ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ వేటకు బయలుదేరుతున్న బలగాలు అబూజ్‌మాడ్ స్వాగత తోరణంవద్ద ఏబీఎన్– ఆంధ్రజ్యోతి ప్రతినిధి రెహమాన్



అరణ్యం. కెమెరా కన్నెరుగని ప్రపంచం. మైకుల్లోకి ఎక్కని నిశ్శబ్దం. కొన్నేళ్లుగా సర్కారీ వాసన సోకని వాతావరణం. ఔను... నిజం! కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలెవరూ చేరుకోని... ప్రాంతీయ, జాతీయ మీడియాలో ఎవరూ అడుగుపెట్టని... ఆ మావోయిస్టుల కోటలోకి 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' కాలు మోపింది. కెమెరా కన్ను తెరుచుకుంది. నిషిద్ధాన్ని సైతం నివ్వెరపరిచింది.

ఇప్పుడు దేశం దృష్టంతా అబూజ్‌మాడ్‌పైనే! కారడవుల్లో మావోయిస్టులు... చుట్టూ చేరి చుట్టుముడుతున్న బలగాలు! మావోయిస్టుల పెట్టనికోటను బద్దలు చేయడమే లక్ష్యంగా కేంద్రం 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' చేపట్టింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో ఉన్న అబూజ్‌మాడ్ ఇప్పుడు రణక్షేత్రంగా మారింది. బయటి ప్రపంచానికి ఈ ప్రాంతం ఎలా ఉంటుందో తెలియదు. ఛత్తీస్‌గఢ్ పోలీసులూ అక్కడ అడుగుపెట్టలేదు. ఈ 'నిషిద్ధాన్ని' ఛేదించేందుకు 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' నడుం కట్టింది. అనుకున్నదే తడవుగా... అక్కడికి బయలుదేరింది.

### అడ్డదారే రహదారి..

అబూజ్‌మాడ్‌ను చేరుకోవడం అంత సులభం కాదు. అడ్డదారులే తప్ప రహదారులు లేవు. అడుగడుగునా చెక్‌పోస్టులు అడ్డుకుంటాయి. తుపాకులు నిలువరిస్తాయి. అందుకే... 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' బృందం గిరిజనులతో కలిసి నాటుపడవలో శబరి నది దాటి ఛత్తీస్‌గఢ్‌లోకి అడుగు పెట్టింది. చెక్‌పోస్టులు తగలకుండా, కోబ్రా దళాల కంట పడకుండా... కాలినడకన అబూజ్‌మాడ్ ప్రాంతంలోకి అడుగుపెట్టింది. 'అబూజ్‌మాడ్' స్వాగత తోరణం దాటి సుమారు 20 కిలోమీటర్లు అడవిలోకి వెళ్లింది. ఒక చోట గిరిజనులు విల్లంబులతో అడ్డగించారు. తాము మీడియా ప్రతినిధులమని చెప్పాక వదిలిపెట్టారు. మరోచోట మావోయిస్టులకు చెందిన 'భూంకాల్ మిలీషియా' సభ్యులు చుట్టుముట్టారు. విల్లంబులు, తుపాకులు ఎక్కుపెట్టారు. వివరాలు తెలుసుకున్న తర్వాత... స్వేచ్ఛగా మాట్లాడారు.

### పోలీసులకు విన్నపం...

అబూజ్‌మాడ్‌పై బలగాలు ముప్పేట దాడికి సిద్ధపడుతున్నాయి. అడవిలో దాగిన 'అన్నలు' తప్పించుకునే మార్గం కూడా లేదు. పోరాడటమొక్కటే మిగిలింది. ఈ దశలో జవాన్ల మనసు మార్చేందుకా అన్నట్లు... అక్కడి అడవుల్లోని చెట్లకు పెద్దసంఖ్యలో పోస్టర్లు కనిపించాయి. "పొట్టకూటికోసం మీరు పోలీసులయ్యారు. మా పోరాటం మీతో కాదు. దయచేసి వెనక్కి వెళ్లిపోండి. మేం ఉగ్రవాదులం కాదు. మేం మీతో తలపడం, మీరూ మాతో తలపడొద్దు" అంటూ హిందీలో

సందేశాలు కనిపించాయి. బలగాల మనసు గెలిచేందుకు మావోయిస్టులు చేసిన చిరు ప్రయత్నానికి ఈ పోస్టర్లు సాక్ష్యంగా నిలిచాయి.

## ఇంటింటా అప్రమత్తత

అబూజ్‌మాడ్ చుట్టూ ఇప్పుడు కేంద్ర బలగాలతోపాటు సల్వాజుడుం వంటి మావోయిస్టు వ్యతిరేక సైన్యాలు గాలింపులు జరుపుతున్నాయి. మీడియా అంటే సల్వాజుడుంకు మంట. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చామంటే మరీ అసహనం. అక్కడి గ్రామాల్లో ఎక్కడ చూసినా 'యుద్ధ సన్నాహాలే' కనిపించాయి. ఇంటింటా ఆయుధాలు, తుపాకులు, తూటాలే! దాదాపు ప్రతి 15 కిలోమీటర్లకు ఒక పోలీసు శిబిరం. ఇక్కడి పోలీసు స్టేషన్లలో 'మోస్ట్ వాంటెడ్' మావోయిస్టులతో కూడిన జాబితాలు, ఫోటోలు దర్శనమిచ్చాయి. ఈ ఫోటోల్లో విరసం నేత వరవరరావు ఫోటో కూడా ఉండటం విశేషం. 'ఇదేమిటి ఈయన ఫోటో పెట్టారని?' ప్రశ్నిస్తే... ఆయన కూడా మాకు 'మోస్ట్ వాంటెడ్' అనే సమాధానం వచ్చింది.

## ఎవరున్నారు?

అబూజ్‌మాడ్‌లో 70 ఏళ్లుగా అధికారిక సర్వేలు జరగలేదు. స్వాతంత్ర్యానికి పూర్వం తయారు చేసిన మ్యాపులు తప్ప కొత్తవి లేవు. గూగుల్ సంస్థ కూడా ఇక్కడ ఎర్త్ సర్వే నిర్వహించలేదు. సెలయేర్లు దాటడానికి వంతెనల్లేవు. కొయ్యలపై జాగ్రత్తగా కాలు పెట్టాల్సిందే. అక్కడ రోడ్లు లేవు. ఉన్నది ఒకే ఒక డొంక దారి. తప్పిపోతే మళ్లీ బయటపడటం దాదాపు అసాధ్యం. ఆ దారిలోనే 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రయాణించింది. అష్టకష్టాలు పడి అబూజ్‌మాడ్ చేరుకుంది. ఈ 'ఒంటరి ప్రపంచాన్ని' బయటి ప్రపంచానికి... అదీ మొట్టమొదట తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసింది. ఆ అడవిలో మావోయిస్టులున్నారన్నది నిజం. కానీ... ఎంతమంది ఉన్నారు, ఎవరెవరున్నారన్నది మాత్రం ఎవరికీ తెలియదు. కేంద్ర బలగాల సన్నాహాలు చూస్తే... మావోయిస్టు దళపతి గణపతితోసహా అనేకమంది కీలక నేతలు అక్కడే ఉండొచ్చనే అభిప్రాయం కలుగుతోంది. మరి వీరిని కేంద్ర బలగాలు చేరుకోగలవా? ఇదో పెద్ద సందేహం. ఈ కొండలు నక్సల్స్‌కు కొట్టిన పిండి. వారికి అండగా గిరిజన కొరియర్లు ఉండనే ఉన్నారు. కానీ... ఈ అడవుల్లో ముందడుగు వేయడం కేంద్ర బలగాలకు అంత సులువు కాదు. దంతేవాడలో వికటించిన 'ఆపరేషన్ రెడ్‌హంట్' అనుభవం వారిని వెంటాడుతోంది. అందుకే... అబూజ్‌మాడ్‌లో కేంద్రం ఆచితూచి అడుగువేస్తోంది.

*(13 నవంబర్ 2009న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనది.)*

మరికాస్త ముందుకెళ్లాం విస్తృతంగా మావోయిస్టు పార్టీ ప్రచురించిన పోస్టర్లు, కరపత్రాలు చెట్టుకొకటి పుట్టకొకటిగా కనపడ్డాయి. ఈ కరపత్రాలను తీసుకొని చదివాం. ఆ కరపత్రం సారాంశం గ్రీన్‌హంట్ పోలీసులకు ఉద్దేశించి ఉంది.

# జవాన్లూ... మీరూ మావాళ్లే!

- ఆదివాసీ పోరాటానికి మద్ధతివ్వండి
- ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించండి
- దేశ ద్రోహులమూ కాదు.. దుర్మార్గులమూ కాదు.
- పారా మిలటరీ బలగాలకు కరపత్రంలో మావోయిస్టులు

**(అబూజ్‌మాడ్ నుంచి ఏబీఎన్ ప్రతినిధి)**



**'గన్' కన్నా 'స్లోగన్' పవర్‌ఫుల్ అని తేలిపోయింది. ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్లకు కదలిక అన్న విషయం మరోసారి రూఢీ అయింది. ఓ చిన్న కరపత్రం.. కర్కశంగా దూసుకుపోయే పారా మిలటరీ బలగాల్లో కూడా కదలిక తీసుకొస్తోంది. ఖాకీ కట్టి.. లాఠీ పట్టిన పోలీసులను కదిలిస్తోంది. అదే.. అబూజ్‌మాడ్ అడవుల్లో యుద్ధానికి ముందు పారా మిలటరీ బలగాలను ఉద్దేశించి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వేసిన కరపత్రం. ఆ కరపత్రం సారాంశమిదీ...**

**జీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, కోబ్రా, బీబీఎస్ఎఫ్ దళాల్లో చేరిన మిత్రులారా..!**

మీరు కూడా పేద తల్లీదండ్రి కన్న బిడ్డలే. ఉద్యోగం, ఉపాధి కోసం మీరు ఈ బాటను ఎంచుకున్నారు. ఈ సరళిలో మీకు, మాకు మధ్య ఎలాంటి కోపతాపాలకు తావు లేదు. ఆదివాసీ సమస్యలపై పోరాడుతున్న మాపై ఉగ్రవాది ముద్రలు వేస్తూ మాపై మీకు ద్వేషాన్ని పెంచేలా కేంద్ర హోం మంత్రి చిదంబరం ప్రయత్నాలు ప్రారంభించాడు. మావోయిస్టు పార్టీతో అంతరంగిక భద్రతకు పెను

ముప్పు పొంచి ఉందన్న దుష్ప్రచారాన్ని అమెరికా సామ్రాజ్యవాదపు నమ్మినబంటు అయిన మన్మోహన్‌సింగ్ ఆరంభించాడు. కానీ దేశాన్ని, సంపదను దోచుకునే వారికి మా నుంచి ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని మాత్రం దాచేస్తున్నాడు. ఒక అబద్దాన్ని నిజంగా నమ్మించేందుకు వందసార్లు ప్రచారం చేస్తున్నాడు. దేశ సంపదను ఆదివాసీలకు అందించేందుకు అండగా నిలబడి పోరాడే మా పార్టీ.




మిత్రులారా... మీ అధికారుల ఆదేశాలతో ఆదివాసీ గ్రామాలు తగలబడుతున్నాయి. దోపిడీకి గురవుతున్నాయి. సల్వాజుడుం మూకల ద్వారా ప్రభుత్వం ఆదివాసీ మహిళల మాన, ప్రాణాలను దోచుకుని గృహదహనాలకు పాల్పడుతోంది. అమాయకులపై తూటాల వర్షం కురిపిస్తోంది. నరహంతకులకు ప్రోత్సాహకాలు ఇస్తోంది. ఇదంతా ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతోంది. మీరు ప్రదర్శిస్తున్న జులుం పేదలకు వ్యతిరేకం. ప్రజల రక్షణ పేరిట మీ ప్రాణాలు బలిదానం అవుతున్నాయి. ఒక్క నిమిషం ఆలోచించండి. మీ ప్రాణాలు ఎందుకు పోతున్నాయో..!? కానీ మీలో కూడా మంచివాళ్లు ఉన్నారు. ఆదివాసులపై కాల్పులు జరపాలని మీ అధికారులు ఇచ్చిన ఆదేశాలను మీరు చాలాసార్లు ధిక్కరించారు. మహిళలపై అత్యాచారాలు చేయాలని చెప్పినా ధిక్కరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని మా ఇలాకాల్లో చాలా చోట్ల విధులు నిర్వర్తించడానికి నిరాకరిస్తున్నారు. చాలామంది తమ ఉద్యోగాలను కూడా వదులుకున్నారు. చాలామంది ఉద్యోగాల్లో చేరినా.. తమకు ఇచ్చిన ఆయుధాలను మాకు అప్పగించారు. ఆదివాసీల గుండెలపై తుపాకులు ఎక్కుపెట్టేందుకు నిరాకరించినందుకు వాళ్లందరికీ మేం కృతజ్ఞతలు చెబుతున్నాం. మా క్షేత్రాల్లో పనిచేసే చాలామంది పోలీసు బలగాలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయి. ఉన్నతాధికారుల వేధింపులను తాళలేక జవాన్లు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కోకొల్లలు. మనమంతా అలయ్ బలయ్

తీసుకోవాల్సిన వాళ్లం అని మీ అందరికీ మేం విన్నవిస్తున్నాం. మీలో బుద్ధిబలం ఉంది. విషయాలపై ఆలోచించి వివేకంగా నిర్ణయాలు తీసుకోగలరు. మిత్రులారా.. మీ మూలాలను ఆలోచించుకోండి. ప్రజా వ్యతిరేక ఆదేశాలు ఇచ్చే అధికారుల మూలాలను కూడా పరిశీలించండి. చిదంబరం, రమణ్‌సింగ్, మహేంద్రకర్మ వంటివాళ్ల అసలు రంగును గుర్తించండి. కాంగ్రెస్, బీజేపీ తమ విధానాలను వేర్వేరుగా ప్రచారం చేసుకున్నా.. మమ్మల్ని అంతమొందించాలని అనుకోవడంలో దొందూ దొందే. రెండు చేతులు చాపి మేము మీకు స్వాగతం పలుకుతున్నాం. దేశ ద్రోహులను తరిమి కొట్టేందుకు మీరు, మేము చేతులు కలుపుదాం. జాతి ద్రోహులు మీ సేవలను ఉపయోగించుకునే ప్రయత్నాల్లోంచి మీరు వెనక్కి వచ్చేయండి.

మిత్రులారా..! మీమీ అవసరాల కోసం ఉద్యోగాన్ని వదులుకోలేకపోతే తక్కువలో తక్కువగా మాతో తలపడడానికి నిరాకరించండి. మీ ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించండి. ప్రజా వ్యతిరేకంగా లాఠీ, తూటాలను ఉపయోగించడానికి దూరంగా ఉండండి. మాతో తలపడే పరిస్థితి మీకు ఎదురైతే ఆయుధాలు పడేసి చేతులు పైకెత్తండి. మీ ప్రాణాలను కాపాడుకోండి. మా ప్రజా పోరాటాలకు మీ వంతు సానుభూతి, మద్ధతు ప్రకటించండి. ఇంత నర సంహారం తర్వాత కూడా ఇక్కడి ప్రజలు మాతో ఎందుకు ఉంటున్నారో ఒక్కసారి ఆలోచించండి. ప్రభుత్వ దుష్ప్రచారం నుంచి బయటపడండి. ప్రజా పోరాటాలకు మద్ధతు ఇవ్వండి. సాయుధులైన మేము దేశ ద్రోహులం కాదు. దుర్మార్గులం అంతకన్నా కాదు. మరచిపోకండి. మీరూ మావాళ్లే. మా నుంచి వచ్చిన వాళ్లే.

**– భారత కమ్యూనిస్టు పార్టీ**

(మావోయిస్టు)

*(16 నవంబర్ 2009న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనది.)*

పొదల్లో నుంచి ఓ దారిలోకి వెళ్లగానే పెద్ద జామతోట గిరిజనులు బుట్టల్లో జామకాయలు తెంపు తున్నారు. "అడవుల్లో జామతోటలేంటి? తోట ఎవరువేశారు..? తెంపి ఎక్కడికి తీసుకెళ్తారు..?" అంటూ ప్రశ్నించాను "ఈ తోట ప్రజలిది, ఈ పండ్లు గిరిజనుల కోసం" అన్నాడు. అరటితోటలను కూడా చూపించాడు. ప్రజలకు పౌష్టికాహారం అందించేందుకు మావోయిస్టులే ఈ తోటలను ఏర్పాటు చేసినట్లు చెప్పాడు. మీ ప్రభుత్వం ఇలా ఏర్పాటు చేసిందా అని ప్రశ్నించాడు. అక్కడి గిరిజనులు ఆప్యాయంగా ఒక బుట్ట నిండా పండ్లు తెచ్చి ఇచ్చారు. అందులోంచి మేమిద్దరం చెరో పండు తీసున్నాం. వాళ్లు మొహమాటపెట్టినా... అన్ని పండ్లు తీసుకునే హక్కు మాకు లేదంటూ తెగేసిచెప్పాం. చెక్ డ్యామ్‌లు, సహకార వ్యవసాయం, సహకార సంఘాల ఏర్పాటు గురించి చెప్పాడు. అంతా కొత్త కొత్తగా అనిపించింది. అక్కడ మేం గిరిజనుల మయ్యాం. వారే ఆధునికులైపోయారు.

# ఆకుపచ్చ కోనలో.. 'అన్నల' పాలన!

## అబూజ్‌మాడ్‌లో జనతన సర్కార్

● మావోయిస్టుల్లో కొత్త కోణం..'ఏబీఎన్' ఆపరేషన్ (హైదరాబాద్ – ఆన్‌లైన్)



అడవిలో పంటల సాగు

**జల్ (నీరు), జమీన్ (భూమి), జంగల్ (అడవి), పడాయి (చదువు), తందురుస్త్ (ఆరోగ్యం)!**

ఇది రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలో భాగం కాదు. మావోయిస్టుల సామ్రాజ్యంలో అమలవుతున్న 'జనతన సర్కార్'లో ప్రధాన లక్ష్యాలివి. తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారాన్ని వారు ఒకే ఒక చోట సాధించారు. అది... అబూజ్‌మాడ్‌లో! బయటి వారికి 'రహస్యం'గా మిగిలిన ఈ ప్రాంతాన్ని 'ఏబీఎన్–ఆంధ్రజ్యోతి' మొట్టమొదటిసారిగా ఛేదించింది. ఈ 'విముక్తి ప్రాంతం'లో అమలవుతున్న



అడవిలో పండ్ల తోటల పెంపకం

మావోయిస్టుల పాలనను స్వయంగా గమనించింది. నక్సలైట్లు 1996లోనే ఒక ప్రత్యామ్నాయ ప్రజా ప్రభుత్వానికి రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగా తెలంగాణ జిల్లాల్లో గ్రామరాజ్య కమిటీలను ఏర్పాటు చేశారు. వీటిని పోలీసులు మొగ్గలోనే తుంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు కాని ఈ విధానాన్ని మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో విజయవంతంగా అమలు చేస్తున్నారు. అబూజ్‌మాడ్‌లో జనతన సర్కార్‌ను స్థాపించారు. గిరిజన సమూహాల్లోని మూఢ నమ్మకాలు, దురాచారాలను రూపుమాపే దిశగా కృషి చేస్తున్నారు. నడుముకు పైభాగాన దుస్తులంటే తెలియని ఆదివాసీ మహిళల గౌరవాన్ని పెంచారు. ఆహారంలో ఉప్పును చేర్చారు. రుచి నేర్పారు. ఎడ్లతో వ్యవసాయం ప్రవేశపెట్టారు. కూరగాయల ఉత్పత్తిని పెంచారు. వర్షపు నీటి నిల్వకు చిన్న చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. పండ్లతోటలను పెంచారు. పౌష్టికాహార లోపంపై పోరాడారు. సమష్టి వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. ఫలసాయాన్ని అందరూ కలిసి పంచుకుంటారు. ఇక్కడ వ్యక్తి గత ఆస్తులు లేవు. కరెన్సీ గొడవ లేదు. అక్కడ సహకార బ్యాంకులు ఏర్పాటయ్యాయి. వడ్డీలేని రుణాలు అందుతాయి. మొబైల్ ఆస్పత్రులు పనిచేస్తున్నాయి. పాఠశాలలూ సంచార పద్ధతిలో పనిచేస్తాయి. భూంకాల్ నాయక్ గూండారామ్, ఖాన్ సీమ, భీమ్‌సా ముండ, వీర్ సారామన్, సింజ్, అల్లూరి, కొమరంభీం లాంటి గిరిజన యోధుల జీవితాలే సిలబస్! అడవే వారికి ప్రయోగశాల. జనతన సర్కార్‌లో పర్యావరణం, మహిళా, శిశు సంక్షేమం, అటవీ హక్కులు, విద్య, వైద్య శాఖలు ఉన్నాయి. వాటికి మంత్రులూ ఉన్నారు. నక్సలైట్లంటే తుపాకులు, మందుపాతర్లు, హింస, విధ్వంసం... అని అనుకునే ప్రపంచానికి తెలియని ఓ కొత్త కోణం ఇది.

*(15 నవంబర్ 2009న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనది.)*

మావోయిస్టు నేతలతో కలుస్తారా...? ఎవరితో కలుస్తారో చెప్పండి...? అని అడిగాడు. వర్షం మొదలైంది. మేం వదిలేసిన వచ్చిన వాహనం, డ్రైవర్ మనోహర్ ఎలా ఉన్నాడో అన్ని బాధ కలిగింది. మళ్లీ వచ్చి కలుస్తామంటూ వెనుదిరిగాం మళ్లీ అవేదారుల గుండా... బిక్కుబిక్కుమంటూ మాకోసం ఎదురుచూస్తున్న డ్రైవర్ మనోహర్‌ను కలిశాం. అక్కడి నుంచి భారీ వర్షం. వాహనం ముందుకు వెళ్లలేని పరిస్థితి అంతా ఘాట్‌రోడ్డు. అంతా బురద బురద. ఎర్రమట్టి రోడ్డు కాలుపెడితే జారుతోంది. ఏ మాత్రం అదుపు తప్పి లోయలో పడితే బొమ్మకారులా దొర్లి వందల మీటర్ల లోతులో ఉన్న లోయలో పడాల్సిందే. గిరిజనులు చెట్లకొమ్మలని నరికి టైర్లకింద వాహనం జారకుండా చాలా దూరం వరకు వేశారు. అతికష్టంమీద ఆ భారీ వర్షంలో పోలీస్ క్యాంప్‌లు దాటుతూ చీకట్లో నరకయాతన పడుతూ నారాయణ్‌పూర్ చేరుకున్నాం. మరుసటి రోజు నారాయణపూర్ ఎస్.పి.ని. కలిసి ఇంటర్వ్యూ చేశాం. పోలీస్ బలగాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నాయని అబూజ్‌మాడ్ అడవుల్లోకి వెళ్లడం కష్టమే అన్ని ఒక ప్రశ్నకు సమాధానంగా ఎస్.పి. చెప్పారు. అక్కడి మావోయిస్టు పార్టీ మోస్ట్‌వాంటెడ్ జాబితాలో వరవరరావు ఫోటోను చూసి ఇదేంటని ప్రశ్నించాము మాకు వాంటెడ్ అని ముక్తసరిగా సమాధానం వచ్చింది. తర్వాత ఎబియన్ ఆంధ్రజ్యోతి టీవీ ఛానెల్‌లో ప్రసారమయిన కథనాలకి స్పందించి ఛత్తీస్‌గఢ్ డిజిపి ఆయనపేరును వాంటెడ్ జాబితాలో నుంచి తొలగించారు ఎస్.పి.కి మేము అబూజ్‌మాడ్ అడవుల్లో తిరిగి వచ్చిన విషయం చెప్పలేదు. అక్కడికి రావడాన్ని ఆయన తప్పు పడుతూ ఎవరి దగ్గర ఆశ్రయం పొందారు. వంటి అన్ని విషయాలు ఆగ్రహంగానే ఆరా తీసే ప్రయత్నం చేశారు మేము ఇదే రాక అన్నట్టుగా చెప్పి వెనుదిరిగి వచ్చేశాం మావోయిస్టు పార్టీ ప్రధాన స్థావరం అబూజ్‌మాడ్‌పై దాడి చేయడం గ్రీన్‌హంట్ ఆపరేషన్ సఫలీకృతమవుతుందన్న ప్రభుత్వ వాదనకు బలం చేకూరే అంశాలేవీ మాకు కనపడలేదు. అక్కడినుంచి దంతేవాడ చేరుకుని 'మహేంద్ర కర్మ' (సల్వాజుడుం చీఫ్)ను కలుసుకొని ఇంటర్వ్యూ చేశాం. టీవీ 5 లో ఉన్నపుడు కర్మతో మొదటి ఇంటర్వ్యూ తెలుగు ఛానెల్ తరపున నేనే చేయడంతో కర్మ అప్పాయింట్‌మెంట్ సులభంగానే దొరికింది.

# అడవి నుంచి వాళ్లే వెళ్లిపోవాలి




- నక్సలైట్లు దేశానికే శత్రువులు
- హింసను వదిలేయాలి
- అప్పుడే శాంతి చర్చలు సాధ్యం
- అసలు యుద్ధం త్వరలో ఆరంభం
- గణపతి బస్తర్‌లో లేకపోవచ్చు
- వరవరరావు చట్టబద్ధ వ్యక్తే!
- ఏబీఎన్ ఇంటర్వ్యూలో సల్వాజుడుం మహేంద్రకర్మ

**(అబూజ్‌మాడ్ నుంచి ఏబీఎన్ ప్రతినిధి)**

సల్వాజుడుం – మహేంద్ర కర్మ... నక్సల్ ఉద్యమం గురించి ఏ మాత్రం తెలిసిన వారికైనా ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేర్లివి. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ (సీఎల్పీ) నాయకుడైన మహేంద్ర కర్మ మావోయిస్టులతో పోరాటం కోసం ఏకంగా ప్రైవేటు సైన్యాన్ని ఏర్పాటు చేశారు. గిరిజనుల్లోని ఒక తెగతో 2004లో సల్వాజుడుంను ఏర్పాటు చేసి నక్సలైట్లపై ఎదురుదాడులు జరిపారు. ఆయనను అంతమొందించేందుకు నక్సలైట్లు పలుమార్లు దాడులు జరిపారు. వాటి నుంచి తప్పించుకున్న ఆయన ప్రస్తుతం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వానికి, భద్రతా బలగాలకు మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. అబూజ్‌మాడ్‌లో పర్యటిస్తున్న 'ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలివీ...

**గ్రీన్‌హంట్‌పై ప్రచారం జరిగినంతగా ఆపరేషన్ ముందుకు సాగడం లేదనిపిస్తోంది?**

అవును. బలగాలు ఇప్పుడిప్పుడే చేరుకుంటున్నాయి. ఆపరేషన్ పూర్తిస్థాయిలో మొదలు కాలేదు.

**యుద్ధం ఎప్పుడు మొదలవుతుంది?**

అడవిలో ఆదివాసీల వ్యవసాయ పనులు పూర్తి కాగానే యుద్ధం మొదలవుతుంది.

**సల్వాజుడుం అధిపతిగా మీరు ఇందులో ఎలాంటి పాత్ర పోషించబోతున్నారు?**

బయటి నుంచి జాయింట్ ఫోర్స్ రూపంలో బలగాలు వచ్చాయి. దాన్ని మిత్ర

సైన్యంగా భావిస్తాం. నక్సల్స్ సమస్యను విముక్త సమస్యగా భావించి యుద్ధం సాగుతుంది.

**శాంతి చర్చలకు ప్రతిపాదనపై ఏమంటారు?**

యుద్ధం కంటే శాంతి చర్చలు మంచి ప్రతిపాదన. అది శుభవార్తే. చర్చలకు తలుపులు తెరిచే ఉంటాయి. చర్చలు విఫలమైతే యుద్ధం అనివార్యమే. ఇటీవల ఒక ఇంటార్వ్యూలో మావోయిస్టు నేత కిషన్‌జీ (మల్లోజుల కోటేశ్వర్‌రావు)... అడవుల్లోంచి దళాలు వెనక్కు వెళ్లాలన్నారు. అయితే మావోయిస్టులే ఆ క్షేత్రాల నుంచి బయటకు వెళ్లాలని నేను అంటున్నా!

**చర్చలకు షరతులేమిటి?**

ఒకటే షరతు. క్షేత్రంలో నక్సలైట్లు ఉండకూడదు. కాల్పుల విరమణ పాటించాలి. తుపాకులు వాడొద్దు. హింసకు పాల్పడవద్దు.

**చర్చలకు మీరు చొరవ తీసుకుంటారా?**

తప్పకుండా! ఇక్కడ స్నేహపూర్వక వాతావరణం అవసరం. సమస్య పరిష్కారం కావాలి. అది చర్చల ద్వారానే సాధ్యం.

**బస్తర్ అడవుల్లో అగ్రనేతలు ఉన్నారా?**

పెద్ద తుపాకులు ఎప్పుడో పారిపోయాయి. గణపతి, గణేష్‌లాంటి నేతలు ఇక్కడ లేరనే అనుకుంటున్నా. సాధారణ మావోయిస్టులు మాత్రమే ఇక్కడ ఉన్నారు. వారికి చిన్నా చితక, చచ్చు పుచ్చు తుపాకులు ఇచ్చారు. వారు కూడా ప్రధాన స్రవంతిలో చేరాలని 'ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి' ద్వారా వారికి విజ్ఞప్తి చేస్తున్నా.

**బహిరంగ జీవితం గడుపుతున్న వరవరరావు లాంటివారిని ఛత్తీస్‌గఢ్ పోలీసులు మోస్ట్ వాంటెడ్‌గా ప్రకటించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?**

అది ప్రభుత్వ నిర్ణయం. నాకు సంబంధం లేదు. ఆయన చట్టబద్ధంగా పనిచేస్తున్న వ్యక్తే. అయితే ఆయన కూడా ప్రధాన భూమిక పోషించి చర్చలకు మధ్యవర్తిగా ముందుకు రావాలి.

**ఆదివాసీలు బలికాకుండా రక్షణ చర్యలేమిటి?**

యుద్ధం సైన్యానికి, నక్సల్స్‌కు మధ్యే. గిరిజనులకు దీంతో ఎలాంటి సంబంధం

లేదు. గిరిజనులను చంపడానికే బలగాలు వస్తున్నట్టు నక్సలైట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది దురదృష్టకరం.

**అసలీ యుద్ధం ఎందుకోసం? నక్సలైట్లను తరమడానికా? ప్రభుత్వం చెప్పే తరహా అభివృద్ధికా?**

మావోయిస్టులు ముందు అడవి నుంచి వెళ్లిపోతే అభివృద్ధి అదే జరుగుతుంది. ఇక్కడ ప్రగతి లేదు. చదువు లేదు. ప్రజలకు కనీస సదుపాయాలు అందకుండా మావోయిస్టులు వికాసాన్ని అడ్డుకుంటున్నారు. ఇది సిగ్గుమాలిన చర్య. వారు అమానవీయంగా, క్రిమినల్స్‌లా వ్యవహరిస్తున్నారు.

**వారిని తరిమేస్తే అభివృద్ధి జరుగుతుందా?**

అభివృద్ధి, నక్సల్స్‌ను తరమడం ఒకేసారి జరగవు. మావోయిస్టులు దేశానికే శత్రువులు. వారు బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం అవివేకం. గ్రామాల్లో ధనిక భూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడం వల్ల ప్రజలకు కనీస ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి.

*(17 నవంబర్ 2009న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనది.)*

ఛత్తీస్‌గాఢ్ ప్రాంతంలో వారాంతపు సంతలని ప్రభుత్వం నిషేధించింది. దీనితో గిరిజనులని, వారికి మద్దతిస్తున్న మావొయిస్టులని ఒక్కదెబ్బకి రెండుపిట్టలని కొట్టవచ్చున్న అభిప్రాయం ప్రభుత్వంలో ఉంది.

# అడవిలో ఆకలి వేట

- సంతలపై సర్కారు నిషేధం
- నక్సల్స్‌పై కోపం... కోయలకు శాపం
- నిత్యావసర సరకుల కోసం తల్లడిల్లుతున్న గిరిజనం

(అబూజ్‌మాడ్ నుంచి ఏబీఎన్ ప్రత్యేక ప్రతినిధి)





గిరిజనుల కష్టాలకు మచ్చుతునకలే ఈ చిత్రాలు

నక్సల్స్‌పై ప్రభుత్వం ప్రకటించిన యుద్ధం ఆదివాసీల ఉసురు తీసుకునే ప్రమాదం కనిపిస్తోంది. నిత్యావసర సరకులు తెచ్చుకునేందుకు సంతలు తప్ప మరో మార్కెట్ గురించి తెలియని గిరిజనులు ఆకలితో నకనకలాడే ముప్పు ముంచుకొచ్చింది. దండకారణ్యంలో భాగంగా, ఛత్తీస్‌గఢ్ పరిధిలో ఉన్న అబూజ్‌మాడ్ అడవులు నాలుగువేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ఇక్కడ దాదాపు 432 గ్రామాలున్నాయి. వాటిలో నివసించే ఆదివాసీలకు ప్రభుత్వం అంటే ఏమిటో తెలియదు. వారికి తెలిసిందల్లా మావోయిస్టులు నడిపే జనతన సర్కారు మాత్రమే! అందుకే మావోయిస్టులకు, గిరిజనులకు మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. దీంతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఒకవైపు మావోయిస్టులపై సాయుధ దాడికి సన్నాహాలు చేస్తూనే, మరోవైపు వారికి అండగా ఉన్న గొత్తి కోయలపైన మానసిక యుద్ధానికీ తెరతీసింది. అటు మావోయిస్టులను అడవి

నుంచి బయటకు రప్పించడం, ఇటు ఆదివాసీలను వారికి దూరం చేయడం అనే రెండు లక్ష్యాలతో అడవిలోకి ఆహార పదార్థాలు వెళ్లకుండా అడ్డుకుంటోంది. ఇందుకోసం దండకారణ్యంలో వారాంతపు సంతలన్నింటినీ నిషేదించింది. నిజానికి ఈ సంతలు గిరిజనుల జీవనంలో భాగం. ఇవి తప్ప వారికి వేరే మార్కెట్లు తెలియవు. ఉప్పు, కారం సహా తమకు కావాల్సిన నిత్యావసర సరకులను, ఆహార పదార్థాలన్నింటినీ వారు ఈ సంతల్లోనే కొనుగోలు చేస్తారు. మావోయిస్టుల కడుపు మాడ్చేందుకు ప్రభుత్వం సంతల్ని నిషేధించగా, ఇది గిరిజనుల ఉసురు తీసే ప్రమాదం కనిపిస్తోంది. సంతలపై నిషేధంతో గిరిజనులు తీవ్రంగా నలిగిపోతున్నారు. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే అడవిలో ఆకలి చావులు సంభవించి, గిరిజనులు పెద్దసంఖ్యలో ప్రాణాలు విడిచే అవకాశం ఉంది. నిజానికి సంతలపై నిషేధం విధించినా మావోయిస్టులు, అటు ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ నుంచిగానీ, ఇటు మహారాష్ట్ర నుంచి గానీ, ఏదో ఒక మార్గంలో ఆహార పదార్థాలు తెప్పించుకోగలరు. ఈ రెండు వైపులా వారికి విస్తృతమైన నెట్‌వర్క్ ఉండడం, దళాలు అటూ ఇటూ సంచరిస్తుండడం వల్ల, కొంచెం కష్టమైనా సరుకుల రవాణా పూర్తిగా అసాధ్యం మాత్రం కాదు. కానీ అసలు కష్టం గిరిజనులకు వందల కిలోమీటర్లు ప్రయాణించి వారు సరుకుల్ని తెచ్చుకోలేరు. అలా తెచ్చుకోవాలనుకున్నా వారి వద్ద డబ్బు ఉండదు. అడవిలో తాము సేకరించిన సరుకులను సంతల్లో వస్తు మార్పిడి రూపంలో అమ్మి, అదే పద్ధతిలో కావాల్సిన సరుకులను కొనుగోలు చేయడం మాత్రమే వారికి తెలిసిన విద్య, సంతలపై నిషేధంతో వారు తాము సేకరించిన అటవీ ఉత్పత్తుల్ని అమ్మనూ లేరు, ఆహార పదార్థాలను కొనుక్కోనూ లేరు.

## మావోయిస్టుల ఆగ్రహం

సంతల్ని నిషేధించడంపై స్థానిక గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అటు మావోయిస్టు పార్టీ కూడా దీనిపై మండిపడింది. సంతలపై నిషేధాన్ని ఎత్తివేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించింది. ఇది జీవించే హక్కును కాలరాసి గిరిజనుల్ని అంతమొందించాలన్న కుట్ర అని, దీన్ని తిప్పికొట్టడానికి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చింది. నిషేధాన్ని ఎత్తి

వేయకపోతే ప్రభుత్వ గోదాములపై గిరిజనులు ఆకలిదాడులు చేస్తారని దండకారణ్య మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ హెచ్చరించింది.

### నిషేదం ఎత్తివేయాలి: గద్దర్

సంతలు గొత్తికోయల సంస్కృతిలో భాగమని, వీటిపై నిషేధాన్ని బేషరతుగా ఎత్తి వేయాలని ప్రజాగాయకుడు గద్దర్ డిమాండ్ చేశారు. యుద్ధం ఎవరిపై జరుగుతోందో, ప్రభుత్వాలు ఆదివాసీలపై ఎందుకు యుద్ధాన్ని ప్రకటించాయో ఇకనైనా అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ అమానవీయ నిషేధానికి వ్యతిరేకంగా కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి ఛానెల్ అబూజ్‌మాడ్ అడవుల్లోకి వెళ్లి, అక్కడి వాస్తవ పరిస్థితులను ప్రజలను అందజేయడాన్ని ఆయన ప్రశంసించారు. గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ను విరమించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు తెలుగు జర్నలిస్టులు, కవులు, కళాకారులతో ఓ ప్రతినిధి బృందాన్ని ఛత్తీస్‌గఢ్ తీసుకువెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు.


*(14 నవంబర్ 2009న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనది.)*

అక్కడి నుంచి బయలుదేరే ముందు ఆ ప్రాంతంలో గ్రీన్‌హంట్ సన్నాహాలు తెలుసుకున్నాం. చివరకు మావోయిస్టుల అమ్ముల పొదలో రాకెట్ లాంచెర్లు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎయిర్‌వేలో ఫోర్స్‌ను దించాలన్న రాకెట్ లాంఛెర్లను మావోయిస్టులు దాడి చేస్తారన్న భయం కనబడుతోంది. జాతీయ స్థాయిలో గ్రీన్‌హంట్ ప్రచారం జరుగుతున్నా... సాయుధ బలగాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టినా... గ్రీన్‌హంట్ ముందుకు సాగుతుందన్న నమ్మకం కనపడలేదు.

# ముందుకు సాగని 'వేట'

● గ్రీన్‌హంట్ సాధ్యాసాధ్యాలపై మల్లాగుల్లాలు

**(అబూజ్‌మాడ్ నుంచి ఏబీఎన్ ప్రతినిధి)**



అబూజ్‌మాడ్ అడవికి ఆమడదూరంలో పారా మిలటరీ బలగాలు మోహరించాయి. కానీ, వారం రోజులుగా ఒక్క అడుగూ ముందుకు వేయలేకపోతున్నాయి. ఈ అడవులపై బలగాలకు అవగాహన లేకపోవడమే దీనికి కారణం. 4 వేల చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్న ఈ అడవికి సంబంధించిన మ్యాపు ప్రభుత్వ యంత్రాంగం వద్ద లేదు. మహారాష్ట్ర, ఆంధ్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ సరిహద్దులుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఉంది. అడవి మధ్యకు వెళితే దారులు మూసి.. మావోయిస్టులు విరుచుకుపడితే పరిస్థితేంటన్న ప్రశ్న బలగాలను వేధిస్తోంది. దట్టంగా ఉండే ఈ అడవుల్లో 432 గ్రామాలు, వేలాదిగా జనం.. ఒక్కరు కూడా ప్రభుత్వానికి సహకరించేవారు లేరు. దారులు తెలియవు. గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ ద్వారా లోపలికి వెళ్లాలన్నా ఎర్త్ సర్వే, మ్యాప్ ఉండాలి. ఇవి లేకుండా ఇస్రో సైతం సహాయపడటం కుదరదు. కొండ, కోనలను సర్వే చేసిన గూగుల్ ఎర్త్ డాట్ కం అబూజ్‌మాడ్ అడవులను గుర్తించలేక పోయింది. వేల కిలోమీటర్లు విస్తరించి ఉన్న కీకారణ్యంలో వెళ్లడం

అంటే పులి నోట్లో తలపెట్టడమేనని గెరిల్లా యుద్ధ తంత్రంలో ఆరితేరిన ఆంధ్ర, బెంగాల్, పంజాబ్ పోలీసు అధికారులు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాకెట్ లాంచర్లను విజయవంతంగా ప్రయోగించినట్లు మావోయిస్టుల వద్ద దొరికిన డాక్యుమెంట్ల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో వాయు సేన సహకారం తప్పనిసరని భావిస్తున్నారు. అంతర్గత భద్రత కోసం వాయు సేనను పంపేది లేదని, ఎయిర్ బాంబింగ్‌కు కూడా అనుమతించబోమని ఎయిర్ మార్షల్ చీఫ్ తేల్చిచెప్పారు. పర్యావరణం, గిరిజనులు, అడవులు, భారత భూభాగంలో సైనిక చర్యలు వంటి పలు అంశాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర హోంమంత్రి కూడా సైన్యాన్ని, వాయుసేనను పంపేది లేదన్నారు. పారా మిలిటరీ బలగాలనే ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. మరోపక్క మావోయిస్టు అగ్రనేతలు గుర్రాలపై సంచరిస్తున్నట్లు నారాయణపూర్ ఎస్పీ రాహుల్ భగవత్ ధ్రువీకరించారు. దీంతో లాల్‌గఢ్‌లో ఆపరేషన్ రెడ్‌హంట్ తరహాలోనే ఈసారి కూడా మావోయిస్టులు అమీతుమీకి సిద్ధమైనట్టు భావిస్తున్నారు. ఒకవేళ మావోయిస్టులపై పూర్తి స్థాయి యుద్ధానికి దిగినా... 4 అంచెలుగా గిరిజనులను ముందుంచి.. మావోయిస్టులు సిద్ధమైతే.. వారిని ఛేదించుకుని ముందుకు వెళ్లడం సాధ్యమేనా అన్న ప్రశ్న కూడా ప్రభుత్వాన్ని వేధిస్తోంది. ఏడాదిన్నర కిందట క్రాంతి ట్రాన్స్‌పోర్టుపై దాడి చేసిన పోలీసులు రాకెట్ లాంచర్లను స్వాధీనం చేసుకోవడం.. ఛత్తీస్‌గఢ్ సీఎం రమణ్‌సింగ్ చర్చల ప్రతిపాదనకు తోడు జార్ఖండ్ సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటం కూడా ప్రభుత్వం వెనుకంజకు కారణంగా భావిస్తున్నారు. కాగా, ఈ యుద్ధం ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న అపార ఖనిజ సంపదను వెలికితీసేందుకేనని, మావోయిస్టులు వెనక్కు తగ్గితే వారిపై అసలు యుద్ధమే ఉండదని సల్వాజుడుం చీఫ్ మహేంద్ర కర్మ 'ఏబీఎన్ – ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. గ్రీన్‌హంట్‌కు ప్రజామద్దతు కూడగట్టేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు కూడా పెద్దగా ఫలించడం లేదు. దీంతో గ్రీన్‌హంట్ అసలు ముందుకు సాగడం లేదు.

*(18 నవంబర్ 2009న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైనది.)*

## జనం అసంతృప్తే మావోయిస్టుల బలం

దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద అంతర్గత ముప్పుగా ప్రధాని మన్మోహన్‌సింగ్ అభివర్ణించిన మావోయిస్టుల సమస్యకు మూలాలు మన పాలనా వైఫల్యాల్లోనే ఉన్నాయని కేంద్ర ప్రణాళిక సంఘం నియమించిన నిపుణుల కమిటీ రెండేళ్ల క్రితమే కుండబద్ధలు కొట్టింది. యూపీఏ ప్రభుత్వం 2004లో తొలిసారి అధికారానికి వచ్చినప్పుడే నక్సల్స్ సమస్య తీవ్రతను గుర్తించింది. అభివృద్ధిని ఆయుధంగా చేసుకొని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు నడుంకట్టిన ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ ప్రాంతాల అభివృద్ధి మోడల్‌ను సూచించే బాధ్యతను ప్రణాళిక సంఘానికి అప్పగించారు. ప్రణాళిక సంఘం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నక్సల్స్ సమ్యసై అవగాహన ఉన్న 15 మంది ప్రముఖులతో నిపుణుల కమిటీని నియమించింది. 2006 నుంచి 2008 వరకు ఈ కమిటీ దేశమంతా పర్యటించింది. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులతో, సామాజిక సంఘాల కార్యకర్తలతో విస్తృతంగా సంభాషించింది. సమస్యను అన్ని కోణాల్లో లోతుగా అధ్యయనం చేసింది. 2008 మార్చిలో నివేదికను సమర్పించింది.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్.ఆర్.శంకరన్, కె. బాలగోపాల్, యూపీ డీజీపీ ప్రకాశ్ సింగ్ తదితర ప్రముఖులు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ 'తీవ్రవాదం ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి సవాళ్లు' అనే పేరుతో నివేదికను సమర్పించింది. అందులోని ముఖ్యాంశాలు......

– ప్రజల్లో బలంగా ఉన్న అసంతృప్తి భారత రాజకీయ వ్యవస్థకు పెను సవాల్‌గా మారింది. ఇది తరచూ అశాంతికి దారితీస్తోంది. కొన్నిసార్లు హింసాత్మక రూపం దాలుస్తోంది. అలక్ష్యానికి గురవుతున్న వర్గాల కోసం ప్రభుత్వం కొన్నేళ్లుగా చట్టాలు చేయడంతోపాటు సంస్థాగత ఏర్పాటు చేస్తోంది. ఇలాంటివి ఎన్ని చేసినా అశాంతి కొనసాగుతోంది. జనాభాలో చాలామందికి మనుగడ సాధించడమే పెద్ద సమస్యగా మారిపోయింది.

– నక్సలైట్ల ప్రధాన నినాదం "దున్నేవాడిదే భూమి". దేశంలో వ్యవసాయ కార్మికుల్లో 58 శాతం మంది వ్యవసాయం, అనుబంధ వృత్తులపై ఆధారపడ్డారు. భూమి లేకపోవడమే పేదరికానికి ప్రధాన కారణమైంది. దీన్ని గుర్తించిన ప్రభుత్వం... జమిందారీ వ్యవస్థను

రద్దు, వ్యవసాయ భూములపై సీలింగ్ విధించడం, మిగులు భూముల పంపిణీ వంటి చర్యలు చేపట్టింది. తర్వాత భూసంస్కరణలపై ప్రభుత్వానికి నిబద్ధత బలహీనపడింది. ఇది అసంపూర్ణ ఎజెండాగా మిగిలిపోయింది. దీంతో పేదలు తమ జీవనోపాధి కోసం అడవులు, నీటి వనరులు వంటి ఉమ్మడి ఆస్తులపై ఆధారపడడం ప్రారంభించారు. ఇవి కూడా వారికి అందకుండా పోతున్నాయి.

– 9 శాతం అభివృద్ధి సాధిస్తున్నామని, రెండంకెల వృద్ధిరేటు కోసం చెమటోడుస్తున్నామని భారత్ గర్వంగా చెబుతోంది. అయితే భిన్న తరగతులు, పట్టణ–గ్రామీణ ప్రాంతాలకు, ఎగువ కులాలు – అణగారిన వర్గాలకు మధ్య అసమానతలు పెరిగిపోతున్నాయి. దీనివల్ల అశాంతి విజృంభిస్తోంది. సమాన హక్కుల కల్పనలో ప్రభుత్వ బాధ్యత తరిగి పోతుండడంతో విద్య, ఆరోగ్యం, రవాణా, గృహ నిర్మాణం వంటి రంగాల్లో రెండు ప్రపంచాలు మనకు కనపడుతున్నాయి. సంపద కొద్ది మంది చేతిలోనే ఉండరాదన్న రాజ్యాంగ నిబంధనను ప్రభుత్వ విధాన నిర్ణేతలు విస్మరిస్తున్నారు. ఆధునికీకరణ, యాంత్రికీకరణ, ఎగుమతులకు ప్రాధాన్యం ఇవ్వడం, వివిధ రకాల సబ్సిడీలను ఉపసంహరించడం పేదల పాలిగ సమ్మెట పోటు అవుతోంది.

– నక్సలైట్లకు ప్రధాన మద్దతు దళితులు, ఆదివాసీల నుంచే అందుతోంది. దేశ జనాభాలో నాలుగో వంతు వీరే. ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. దారుణ పేదరికం వీరిలో నిరాశ, నిస్పృహలకు కారణం అవుతోంది.

– ఎస్సీల్లో 10 శాతం కుటుంబాలకు భూమి లేదు. మరో 77% మందికి స్వల్పంగా భూమి ఉంది.

– ఎస్సీల్లో ఎక్కువ మంది వ్యవసాయ కార్మికులే. పట్టణ ప్రాంతాలకు వలసపోవడం, వ్యవసాయేతర కార్యక్రమాలకు మళ్లడం తక్కువ. ఉపాధి అవకాశాలు పరిమితమే.

– దళితులు ఇంకా అంటరానితనాన్నే ఎదుర్కొంటున్నారు. 11 రాష్ట్రాల్లో అధ్యయనం చేయగా, 63 రకాల అంటరానితనం ఉందని తేల్చింది.

– గ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకోనివ్వక పోవడం, బహిరంగ ప్రదేశాలకు రానివ్వక పోవడం, సామాజిక, ఆర్థిక హక్కులను హరించడం వంటివి జరుగుతున్నాయి. ఇలాంటి చోట్లే నక్సల్స్ హింస ఎక్కువగా ఉంది.

– అటవీ భూములు, ఉత్పత్తుల కోసం ఆదివాసీలు చేస్తున్న పోరాటమే దేశంలో

అనేక ప్రాంతాల్లో అశాంతికి కారణమవుతోంది. ఆదివాసీలు ఎక్కువగా నివసిస్తున్న అడవులను రిజర్వు అడవులుగా ప్రకటించేస్తున్నారు. అడవుల పరిరక్షణ చట్టం 1980 ప్రకారం కేంద్రం అనుమతి లేకుండా ఏ అటవీ భూమిని. ఇతర ప్రయోజనాల కోసం మళ్లించకూడదు. అటవీ పరిరక్షణపేరిట అడవుల్లో ఉండేవారి హక్కులను ప్రభుత్వం హరిస్తోంది.

– సెజ్‌ల కోసం భారీగా భూములను సేకరించడం వల్ల దేశంలో తీవ్రస్థాయిలో నిరసనలు మొదలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా భూములపైనే ఆధారపడి జీవిస్తున్నారు. సెజ్‌ల కోసం భారీస్థాయిలో భూములు కావాలి. సారవంతమైన భూములు సేకరించకుండా ఉండడం దాదాపు అసాధ్యం. ఇది ఘర్షణకు కారణం అవుతోంది.

– నక్సలైట్లు అనగానే ఠక్కున ప్రజాకోర్టులు గుర్తుకు వస్తాయి. ఇక్కడ లభించే తక్షణ పరిష్కారాలకు ఆదరణ లభిస్తోంది. మన న్యాయవ్యవస్థ ద్వారా కేసులు పరిష్కారం కావడానికి దీర్ఘకాలం పడుతోంది. నిర్దిష్ట సమయంలోగా వివాదాలు పరిష్కారం కాకుంటే సమాజంలో అసహనం మొదలవుతుంది. దీనికితోడు ఖర్చులు కూడా పెరిగిపెవడంతో కొందరు పేదల మనస్సుల్లో 'ప్రజా కోర్టుల'కు చట్టబద్ధత ఏర్పడుతోంది.

**నక్సల్స్ ఎక్కడ విజయం సాధించారంటే!**

ప్రభుత్వ భూముల స్వాధీనంలోనే నక్సలైట్లు ఎక్కువగా విజయం సాధించారు. భూమి లేని పేదలు వ్యవసాయం చేసుకోవడానికో లేక ఇల్లు కట్టుకోవడానికో ప్రభుత్వ భూములను పెద్దఎత్తున ఆక్రమించుకుని పంపిణీ చేశారు. బీహార్‌లో అన్ని నక్సల్స్ పార్టీలు తమకు పట్టున్న ప్రాంతాల్లో సర్కారీ భూములను ఆక్రమించి భూమిలేని దళితులకు పంచిపెట్టాయి. అయితే వారికి ఆ భూములపై పూర్తిస్థాయి హక్కులు మాత్రం సంక్రమించలేదు. వాటిపై ఆ పేదలకు హక్కులు కల్పించినా లేదా షరతులతో అసైన్డు చేసినా చట్టాల్ని ఉల్లంఘించినట్టే అవుతుందని, అలా చేయడం వల్ల నక్సల్స్‌ను బలోపోతేం చేసినట్టేనని అధికార యంత్రాంగం భావించింది. అందువల్లే ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నీటిపారుదల, మైనింగ్, పరిశ్రమలు తదితరాల కారణంగా తమ జీవన స్థితిగతులు ఘోరంగా మారి పోయాయనే భావన నిర్వాసితుల్లో, ముఖ్యంగా ఆదివాసీల్లో నెలకొంది. గత 60 ఏళ్లలో డ్యామ్‌ల కారణంగా 40 శాతం మంది ఆదివాసీలు నిర్వాసితులయ్యారు.

ఇలాంటి వారికి ప్రభుత్వపరంగా ఒరిగింది కూడా ఏమీ లేదు. ఒరిస్సాలో నీటిపారుదల ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులైన ఆదివాసీలు పెద్దసంఖ్యలో విశాఖపట్నం జిల్లాలోని అడవుల్లో స్థిరపడాలనే ఉద్దేశంతో వలస వెళ్లారు. అయితే నక్సల్స్ ఉద్యమ నేపథ్యంలో అక్కడి నుంచి ఖాళీ చేయాలని అటవీ అధికారులు వారిని హెచ్చరించారు. ఈ దశలో నక్సల్స్ ఆదివాసీలకు మద్దతుగా నిలిచారు. దీంతో పోలీసుల నుంచి వారికి వేధింపులు ప్రారంభమయ్యాయి. నక్సల్స్‌కు ఆశ్రయం కల్పించారనే ఆరోపణలతో వారిని పదేపదే అరెస్టు చేసి జైల్లో పెట్టడం జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో అమల్లోకి వచ్చిన అటవీ నివాసితుల చట్టం-2007 ఆదివాసీలకు కాస్త ఉపశమనం కల్గించినా, పూర్తి స్థాయిలో సమస్యలు  సమసిపోలేదు.

నిర్వాసితులు వలస వెళ్లడానికి కేవలం ప్రాజెక్టులు ఒక్కటే కారణం కాదు. భూమి లేకపోవడం, దుర్భర పేదరికం, సామాజిక అణచివేత తదితర కారణాలు కూడా వారిని వలసబాట పట్టిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మురియా, గోథీ అనే భూమి లేని ఆదివాసీలు గత కొన్నేళ్ళుగా నక్సల్స్ సహకారంతో ఖమ్మం జిల్లా అడవుల్లోకి వెళ్తున్నారు. అక్కడ గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మళ్లీ అటవీ అధికారులు, పోలీసులు రావడం,. ఆదివాసీలు గుడిసెలకు నిప్పుపెట్టడం వంటి సంఘటనలు 1989-2002 మధ్య కాలంలో పలుమార్లు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పౌర సంఘాలు జోక్యం చేసుకోవడంతో ఆదివాసీలు అక్కడ ఉండటానికి ప్రభుత్వ యంత్రాంగం ఎట్టకేలకు  అంగీకరించింది.


మరోవైపు తమ సంప్రదాయ జీవన విధానంలో నక్సల్స్ జోక్యం చేసుకోవడం నచ్చక పోవడంతో చాలా ప్రాంతాల్లోని స్థానికులు ప్రతిఘటన దళాలను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం కొన్నిచోట్ల అలాంటి దళాలను అధికారులు నిఘాబృందాలుగా మార్చారు. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం అలాంటిదే. అందులోని కొంతమందిని ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్పీవోలు)గా నియమించారు. వారికి శిక్షణ ఇచ్చి ఆయుధాలు కూడా సమకూర్చారు. సల్వాజుడుం కార్యకర్తలు ఆయుధాలతో నక్సల్స్‌తో పోరాడటం గిరిజనులే గిరిజనులపై పోరు సాగించినట్లు అవుతుంది. మరోవైపు బీహార్‌లో సామాజిక అణచివేతకు గురైన దళితులు తమ ఆవాసాలను ఖాళీ చేసి ఇతర ప్రదేశాలకు వలస పోతున్నారు. ఇది సామాజికంగా మరి కొన్ని ఇబ్బందులకు దారితీస్తోంది. వారంతా

ఏదో ఒకచోట స్థిరపడితే, ఆ ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాల కోసం వారిని బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారు. మళ్ళీ నిర్వాసితులు కావడంతో వారు దిక్కుతోచని పరిస్థితుల్లో నక్సల్స్ సహాయన్ని అర్తిస్తున్నారు.

సమర్థవంతమైన, నిష్పాక్షిక పోలీసు విధానం సుపరిపాలనలో చాలా ముఖ్యం. అయితే సమాజంలో బలహీన వర్గాలకు పోలీసులపై పెద్దగా విశ్వాసం లేదు. సమాజంలోని బలవంతులను కాదని తమకు న్యాయం చేస్తారన్న నమ్మకం వారిలో లేదు. ఫిర్యాదు దాఖలు చేయడానికి పోలీసు స్టేషన్‌కు వెళ్లినా నిందితుడిగా వెళ్లినట్లే ఉంటోంది. నక్సలైట్ ఉద్యమం పట్ల ఆకర్షితులు కావడానికి ఇవే కారణాలవుతున్నాయి. నక్సలైట్ ఉద్యమం కారణంగా పోలీసు అణచివేత బాగా పెరుగుతోంది. డిమాండ్లు న్యాయమైనవా, కాదా అన్న అంశాన్ని పరిశీలించకుండానే నక్సల్స్ మద్దతిచ్చిన ఉద్యమాలను కర్కశంగా అణచివేస్తున్నారు. గట్టిగా మాట్లాడేవారిని నక్సలైట్‌గా ముద్రవేస్తూ జైల్లో పెడుతున్నారు.

## నిపుణుల కమిటీ సిఫార్సులు


బాలగోపాల్


శంకరన్


ప్రకాశ్‌సింగ్

– ఎస్సీ, ఎస్టీలు అధికంగా నివసించేచోటే నక్సలిజం ప్రాబల్యం విస్తరిస్తోంది. వీరిమీద జరుగుతున్న బహుముఖ దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వం అభేద్యమైన రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఉన్న పౌరహక్కులు, ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం... వంటి రాజ్యాంగ నిబంధ లను సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా రక్షణ కల్పించాలి. దళితుల రక్షణ చట్టాల అమలు నామమాత్రంగా ఉంది.

– ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాల పరిరక్షణకు జాతీయ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల సంఘం, మహిళా కమిషన్, బాలల హక్కుల కమిషన్ లాంటి పలు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలున్నాయి. వాటి మధ్య సమన్వయం లేదు. పార్లమెంటు కానీ, రాష్ట్రాల ముఖ్యమంత్రులు గానీ ఎవరూ ఈ సంస్థల సిఫార్సులన్నీ పరస్పరం సంప్రదించుకొని ఉమ్మడి సిఫార్సుల ద్వారా తప్పించుకోలేని విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలి.

– ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, మానవ హక్కుల సంఘానికి చట్టాల ఉల్లంఘనల విషయంలో దర్యాప్తుచేసి, తీర్పులిచ్చి అమలు చేయించగల అధికారాలు కట్టబెట్టాలి.

– నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో.. భూములు లాక్కోవడం, కట్టు బానిసలుగా ఉంచుకోవడం లాంటి దోపిడీకి అప్పులే ఆజ్యం పోస్తున్నాయి. తిండి కోసం కూడా అప్పు చేయాల్సిన పరిస్థితి గిరిజనుల్లో ఉంది. భూములున్న రైతులకు రుణమాఫీ ప్రకటించిన ప్రభుత్వం భూమిలేని పేదలు, చేతివృత్తులవారి అప్పులను ఎందుకు మాఫీ చేయకూడదు? అప్పు తీసుకున్నవాడు 'అసలు'కు మించిన మొత్తాలను అప్పటికే చెల్లించి ఉన్నా, రుణం ఉద్దేశించిన ప్రయోజనం లబ్ధిదారుకు చేరకున్నా ప్రభుత్వం సదరు వ్యక్తి రుణాన్ని మాఫీ చేయాలి. గిరిజన ప్రాంతాల్లో రుణ బకాయిలను వసూలు చేసుకోవడానికి భూములను వేలం వేయకుండా బ్యాంకులను నిరోధించాలి.

– పేదలు భారీఎత్తున అప్పుల పాలయిన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పెద్దఎత్తున అమలు చేయాలి.

– అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు కల్పించాలి. సంప్రదాయ సంతల్ని ఆధునికీకరించాలి. ఆధునిక ధాన్యం నిల్వ సౌకర్యాలు కల్పించాలి. అటవీ ప్రాంతాలకు ప్రత్యేక పౌర సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

– గిరిజనులకు అటవీ హక్కులు కల్పించినందున ఇప్పటిదాకా ఉన్న అటవీ చట్టాల కింద పెట్టిన కేసులను ఎత్తేయాలి.

– అసంఘటిత కార్మికుల జాతీయ కమిషన్ సిఫార్సులను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అయినా వెంటనే అమలు చేయాలి.

– వ్యవసాయ భూగరిష్ఠ పరిమితి చట్టాలను అమలు చేయడం 30 ఏళ్ల క్రితమే ఆగిపోయింది. వాటిని అమలు చేయాల్సిందే. సేకరించిన భూమి అత్యంత అణగారిన వర్గాలకు అందేట్లు చూడాలి. చట్టపరంగా వ్యవసాయేతర భూమిగా మార్చినా ఉద్దేశించిన లక్ష్యానికి వాడకుండా వ్యవసాయ యోగ్యంగానే భూమి ఉన్నట్లయితే దాన్ని సీలింగ్ కింద స్వాధీనం చేసుకోవాలి. ఆరుతడి భూములు మాగాణులుగా మారితే ఆ మేరకు భూ పరిమితి వర్తింపజేయాలి.

– భూపరిమితి కేసులను త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి. భూములు బంధువులకో, బయటి వాళ్లకో రాసి, తప్పుడు సాక్ష్యాలతో భూపరిమితి చట్టం నుంచి తప్పించుకున్న పాత కేసులను తవ్వితీయాలి. తాజాగా దర్యాప్తు చేయాలి.

– భూమి యజమానికి ఉండే హక్కులను భారత చట్టాలకు లోబడి కౌలు రైతుకు బదిలీ చేయాలి.

– చాలా రాష్ట్రాల్లో వ్యవసాయ భూములను కౌలుకివ్వడం నిషేధం అయినా కౌలుదారీ వ్యవస్థ ఏటేటా పెరుగుతోంది. 40 శాతం భూములను కౌలురైతులే నోటి మాట ఒప్పందాలపై సాగు చేస్తున్నారు. బ్యాంకుల నుంచి వారికి అప్పులు రావడం లేదు. కేరళ, బెంగాల్, మహారాష్ట్ర తప్ప ఏ రాష్ట్రంలోనూ కౌలురైతులను పరిరక్షించే చట్టాలు లేవు. చిన్న కమతాలున్న నిరుపేదలు తమ భూములను పెద్ద రైతులకు నామమాత్రపు ధరకు కౌలుకిచ్చి పట్టణాలకు వలస వెళ్లడం కూడా పెరిగింది. ఇలా అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు పకడ్బందీ కౌలుచట్టాలు తేవాలి.

– చాలాచోట్ల మిగులు భూమిని, భూదాన్ భూమిని పేరుకు నిరుపేదలకు పంచారు.

భౌతికంగా అవి వారి చేతుల్లోకి రాలేదు. అలాంటి భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి. లబ్ధిదారులకు భౌతికంగా, ప్రభుత్వ రికార్డుల పరంగా భూమిని అనుభవంలోకి తేవాలి. దాన్ని అభివృద్ధి చేసుకొనేందుకు బ్యాంకు రుణాలు ఇప్పించాలి.

– ప్రభుత్వ భూములను అనుభవిస్తున్న నిరుపేదలను ఆక్రమణదారులుగా పేర్కొనరాదు. వెళ్ళగొట్టరాదు. అర్హులకు వాటిని క్రమబద్ధీకరించాలి. వెళ్ళగొట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయ భూవసతి కల్పించాలి. ఈ మేరకు చట్టబద్ధమైన హక్కు కల్పించాలి.

– రాజ్యాంగం ఐదో షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రాంతాల్లో గిరిజనుల భూముల్ని గిరిజనేతరులకు బదిలీ చేయడాన్ని నిరోధించే చట్టాల్లో చాలా లొసుగులు ఉన్నాయి. వాటిని గుర్తించినా ప్రభుత్వాలు కావాలనే మిన్నకున్నాయి. గిరిజనులకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చిన కేసులన్నీ తిరగదోడాలి. ఇప్పటికీ కోర్టుల్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి. గతంలో గిరిజనులు అమ్ముకున్న భూములన్నీ తిరిగి వాళ్లకే అప్పగించేలా చూడాలి. ప్రస్తుత చట్టాలను అనుసరించి గ్రామసభల్లో తీర్మానాల ద్వారా ఇది జరగాలి. ఎస్సీల భూముల విషయంలోనూ ఇలాంటి రక్షణే కల్పించాలి.

– గిరిజన ఉప ప్రణాళికను రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ పరిధిలోకి తేవాలి. అంటే, షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనే ఆ నిధులు ఖర్చు చేయాలి.

– ఇప్పటికే నిరుపేదలు సామూహికంగా ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్న ప్రైవేటు భూములను వారికే క్రమబద్ధీకరించాలి. యజమానులకు నష్టపరిహారం ఇవ్వాలి.

– గనులు, పరిశ్రమల పేరిట భారీగా భూములు సేకరించి ఎలాంటి కార్యకలాపాలూ లేకుండా వదిలేసిన వ్యవసాయ యోగ్యమైన భూములను స్వాధీనం చేసుకొని నిరుపేదలకు అప్పగించాలి.

– ఇళ్లులేని 80 లక్షల కుటుంబాలకు కనీసం ఐదు సెంట్ల భూమిని, ఇంటి నిర్మాణానికి రుణ సహాయాన్ని అందించాలి.

– ప్రభుత్వ ప్రాజెక్టులనే ప్రజాప్రయోజనం పరిధిలోకి తేవాలి. ఒకసారి పునరావాసం పొందిన వారిని అక్కడి నుంచి ఎలాంటి పరిస్థితుల్లోనూ భూసేకరణ పేరుతో వినియోగంలోకి తీసుకురాలేకపోతే తిరిగి భూమి యజమానికి అప్పగించాలి.

– గ్రామ సభల తీర్మానంతోనే భూసేకరణ జరగాలి. మోసపూరితంగా గ్రామసభ అనుమతి పొందితే చెల్లదని ప్రకటించాలి. ఎంత భూమిని సేకరించాలన్న నిర్ణయంలో

బాధితులు కూడా భాగస్వాముల్ని చేయాలి.

– ఉమ్మడి వనరులు అంతరించి పోవడం వల్లే గ్రామాల్లో పేదరికం పెరుగుతోంది. భూకబ్జాదారులు వాటిని ఆక్రమించడంతో వాటి నుంచి వచ్చే ఆదాయం లేకుండా పోతోంది. భూకబ్జాలను తొలగించి, సామాజిక అడవులు, నీటి వనరులు తదితర ఆస్తుల కల్పనపై దృష్టి పెట్టాలి.

– ఉపాధి హామీని ఎస్టీలు పెద్దఎత్తున ఉపయోగించుకుంటున్నారు. వనరులు అంతరించి, వలసలు పట్టిన ప్రాంతాలను గుర్తించి ఉపధి హామీని పెద్దఎత్తున చేపట్టాలి.

– 12 రాష్ట్రాలు, 125 జిల్లాల్లోని 460 పోలీస్ స్టేషన్ల ప్రాంతాలను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు.

– రాజ్యాంగం ప్రకారం, చట్టాల ప్రకారం సమాజంలోని భిన్నవర్గాలకు దక్కాల్సిన కనీస హక్కులను కల్పించడంలో మన సమష్టి వైఫల్యంవల్లే నక్సలిజం పుట్టుకొచ్చింది.

## 2005-2010 (మార్చి 29) వరకూ వివిధ ఘటనల్లో మృతి చెందిన పౌరులు, పోలీసులు, నక్సల్స్ వివరాలు

| రాష్ట్రం | పౌరులు | పోలీసులు | నక్సల్స్ | మొత్తం |
|---|---|---|---|---|
| 2004 | | | | |
| ఆంధ్రప్రదేశ్ | 68 | 06 | 47 | 121 |
| బీహార్ | 166 | 05 | 01 | 172 |
| జార్ఖండ్ | 128 | 41 | 20 | 189 |
| ఛత్తీస్‌గఢ్ | 75 | 08 | 15 | 98 |
| ఒడిషా | 04 | 04 | - | 08 |
| 2005 | | | | |
| ఆంధ్రప్రదేశ్ | 186 | 22 | 161 | 369 |
| బీహార్ | 72 | 24 | 11 | 107 |
| జార్ఖండ్ | 92 | 27 | 07 | 126 |
| ఛత్తీస్‌గఢ్ | 121 | 47 | 32 | 200 |
| ఒడిషా | 13 | 1 | 3 | 17 |
| 2006 | | | | |
| ఆంధ్రప్రదేశ్ | 37 | 10 | 133 | 180 |
| బీహార్ | 40 | 05 | 06 | 51 |
| జార్ఖండ్ | 81 | 43 | 20 | 144 |
| ఛత్తీస్‌గఢ్ | 304 | 84 | 74 | 462 |
| ఒడిషా | 05 | 04 | 15 | 24 |
| 2007 | | | | |
| ఆంధ్రప్రదేశ్ | 43 | 02 | 45 | 90 |
| బీహార్ | 45 | 22 | 02 | 69 |
| జార్ఖండ్ | 149 | 08 | 13 | 170 |
| ఛత్తీస్‌గఢ్ | 171 | 198 | 66 | 435 |

| | | | | |
|---|---|---|---|---|
| ఒడిషా | 15 | 02 | 07 | 24 |
| 2008 | | | | |
| ఆంధ్రప్రదేశ్ | 28 | 01 | 37 | 66 |
| బీహార్ | 35 | 21 | 15 | 71 |
| జార్ఖండ్ | 74 | 39 | 50 | |
| 153 | | | | |
| ఛత్తీస్‌గఢ్ | 35 | 67 | 66 | |
| 168 | | | | |
| ఒడిషా | 24 | 76 | 32 | |
| 132 | | | | |
| 2009 | | | | |
| ఆంధ్రప్రదేశ్ | 10 | – | 18 | |
| –28 | | | | |
| బీహార్ | 37 | 25 | 16 | 78 |
| జార్ఖండ్ | 74 | 67 | 76 | |
| 217 | | | | |
| ఛత్తీస్‌గఢ్ | 87 | 121 | 137 | |
| 345 | | | | |
| ఒడిషా | 36 | 32 | 13 | 81 |
| 2010 (మార్చి 29 నాటికి) | | | | |
| ఆంధ్రప్రదేశ్ | 02 | – | 02 | 04 |
| బీహార్ | 17 | 02 | 03 | 22 |
| జార్ఖండ్ | 17 | 09 | 03 | 29 |
| ఛత్తీస్‌గఢ్ | 04 | 03 | 42 | 49 |
| ఒడిషా | 17 | 05 | – | 22 |

# ప్రొఫైల్

**తల్లిదండ్రులు :** సుభాహన్‌మియా, ఆస్మాబేగం

భార్య లక్ష్మి, పిల్లలు ఉదయ్, అబ్దుల్ కలామ్.

**బువ్వ పెట్టినూరు : కరీంనగర్ (16 ఏళ్ళుగా)**

**సొంతూరు :** మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్ తాలూకా శాంతినగర్.

పదవతరగతి వరకు రవీంద్ర ఉన్నత పాఠశాల, శాంతినగర్. ఎస్ఎఫ్ఐలో చురుకైన పాత్ర, విద్యార్థి సంఘ అధ్యక్షుడు.

ఇంటర్మీడియెట్ : ఆలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, విద్యార్థి సంఘ ప్రధాన కార్యదర్శిగా గెలుపు.

డిగ్రీ : వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

హైదరాబాద్ అపోలో ఇనిస్టిట్యూట్‌లో డిప్లొమా ఇన్–కార్డియాలజీ

ఆవృత్తి నచ్చక తిరిగి జర్నలింజం వైపు ప్రయాణం.

చుండూరు దళితులపై దాడికి వ్యతిరేకంగా పోరాటంలో అరెస్ట్.

గద్వాల్ డివిజన్‌లో రెండు గ్లాసుల పద్ధతిపై, అంటరాని తనం నిర్మూలన పోరాటంలో చురుకైన పాత్ర

ఆదర్శయూత్ ఫెడరేషన్ నాయకత్వంలో పలు సామాజిక పోరాటాలు.

హైదరాబాద్ అపోలో పోరాటంలో యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పలుమార్లు అరెస్ట్. కొన్ని రోజులపాటు ముషీరాబాద్‌లో జైలు జీవితం.

ఆత్మగౌరవ సమస్యతో దీర్ఘకాలికంగా ఎక్కడా స్థిరంగా ఉద్యోగం చేయలేకపోవడం.